



# విశ్వం వాయిస్

అవినీతిపై- అక్షరసమరం...

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY








SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT, CERCULATED AT IN WEST GODAVARI, VISAKHAPATNAM, SRIKAKULAM, VIJAYANAGARAM, VIJAYAWADA, HYDERABAD, BANGLORE, CHENNAI, DELHI, MUMBAI, TIRUPATHI, ANANTAPUR, GUNTUR, KADAPA, KHAMMAM, KARIMNAGAR, KURNOOL, NELLORE, NIZAMABAD, ONGOLE

సంపుటి : 8 | సంచిక : 337 | అమలాపురం | ఎడిటర్ : కె. సునీల్‌కుమార్ | శనివారం 23 ఆగస్టు 2025 | పేజీలు : 12 | వెల : 2/-





## విపక్ష నేతల్లో అత్యధికులు
# అవినీతిపరులే

- అందుకే 130వ రాజ్యాంగ సవరణను వ్యతిరేకిస్తున్నారు
- ప్రతిపక్ష కూటమి నేతల్లో అత్యధికులు జైలులో లేదా బెయిలుపై ఉన్నారు
- ఎస్ఐఆర్‌ను వ్యతిరేకించడం ద్వారా ఇండియా కూటమి చొరబాట్లను సమర్థిస్తోంది
- ఇండియా కూటమిపై ప్రధాని ఘాటు విమర్శలు

వివరాలు 6లో..

## సవాళ్ల వెనుక..
# అవకాశాలు



- ట్రంప్ టారిఫ్ ఇబ్బందులు తాత్కాలికమే
- ప్రధాని మోదీ వాటిని సమర్థంగా పరిష్కరిస్తారు
- సంపద సృష్టికర్తలకే సంక్షేమ పథకాలిచ్చే హక్కు
- అంతర్జాతీయ జీవన ప్రమాణాలతో అమరావతి నిర్మిస్తున్నాం
- ఎకనమిక్ టైమ్స్ వరల్డ్ లీడర్స్ ఫోరం సదస్సులో సీఎం చంద్రబాబు

**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :**

మనకు ఎదురయ్యే ప్రతి సవాల్ వెనుక ఒక అవకాశం ఉంటుందని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధించిన టారిఫ్‌ల వల్ల వచ్చిన సమస్యలను పరిష్కరించాలని.. అదే సమయంలో మనం రాజీపడకూడదని ఆయన సూచించారు. ప్రస్తుత ఇబ్బందులను ప్రధాని మోదీ చాలా సమర్థంగా పరిష్కరిస్తారని ధీమా వ్యక్తం చేశారు. ప్రముఖ దినపత్రిక ఎకనమిక్ టైమ్స్ ఆధ్వర్యంలో శుక్రవారం దిల్లీలో జరిగిన 'వరల్డ్ లీడర్స్ ఫోరం' సదస్సులో చంద్రబాబు ప్రసంగించారు. 'ప్రపంచంలో ఏ దేశమైనా, రాష్ట్రమైనా సంక్షేమం లేకుండా మనుగడ సాగించలేవు. సంస్కరణల కారణంగా దేశంలో పోర్టులు, ఎయిర్‌పోర్టులు, రోడ్లు, టెలి కమ్యూనికేషన్లు, విద్యుత్తు ప్రాజెక్టులు, కళాశాలల్లాంటి ఆస్తులు వచ్చాయి. దేశంలో సంపద సృష్టి జరిగి, ప్రభుత్వాలకు రాబడి పెరిగింది. సమాజంలో పేద, ధనిక వర్గాల మధ్య అంతరాన్ని తగ్గించడంలో భాగంగానే సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాం. సంపద సృష్టించే వారికే వీటిని అమలు చేసే హక్కు ఉంటుంది. కేవలం అప్పులు తెచ్చి సంక్షేమ పథకాలు అమలు చేయలేం. అలాగే రాష్ట్రానికి సంపద సృష్టించి, ప్రజలను పేదరికంలో ఉంచడం కూడా మేలు చేయదు' అని చంద్రబాబు - మిగతా2లో

## తప్పుడు ప్రచారాలకు
# తావివ్వొద్దు



- వర్షాలు, వరదల పరిస్థితిపై ప్రజలకు కచ్చితమైన సమాచారం ఇవ్వండి
- అధికారులకు ముఖ్యమంత్రి ఆదేశాలు
- కృష్ణా, గోదావరి వరదలు, ఎరువులపై సమీక్ష
- ఓఎన్జీసీ గ్యాస్ పైప్ లీక్ ఘటనపైనా ఆరా
- ఢిల్లీ నుంచి చంద్రబాబు టెలికాన్ఫరెన్స్

**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :**

వరదలు, భారీ వర్షాలపై ఆయా ప్రాంతాల ప్రజల ఫోన్లకు నిరంతరం కచ్చితమైన సమాచారం ఇవ్వాలని, తప్పుడు ప్రచారాలకు తావు లేకుండా చూడాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. సమస్య వచ్చాక అధికార యంత్రాంగం స్పందించడం కన్నా ముందుగానే సన్నద్ధమై ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. కృష్ణా, గోదావరి నదులకు ఎగువ నుంచి వస్తున్న భారీ ప్రవాహాలు, వరదల పరిస్థితిపై శుక్రవారం ఢిల్లీ నుంచి ఆయన అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. సీఎస్ విజయానంద్, డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తాతో పాటు వివిధ శాఖల అధికారులతో - మిగతా2లో





## మన అంతరిక్ష కేంద్రం!

- బీఏఎస్%-%01 నమూనా ఆవిష్కరించిన ఇస్రో
- మన అంతరిక్ష ప్రస్థానంలో కీలక మైలురాయి
- అమెరికా, రష్యా, చైనా సరసన భారత్
- మూడేళ్లలో ప్రయోగించాలన్నది లక్ష్యం
- దేశీయంగానే బీఏఎస్ తయారీ

**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :**

ఇదేమిటో తెలుసా? రోదసిలో మన దేశాన్ని అమెరికా, రష్యా, చైనా సరసన నిలిపే ప్రతిష్టాత్మక భారతీయ అంతరిక్ష కేంద్రం (బీఏఎస్) తొలి నమూనా! దేశమంతా చిరకాలంగా ఎంతో ఉత్సుకతగా ఎదురు చూస్తున్న ఈ బీఏఎస్%-%01ను భారత అంతరిక్ష సంస్థ (ఇస్రో) శుక్రవారం సగర్వంగా ఆవిష్కరించింది. ఢిల్లీలోని భారత్ మండపంలో జరుగుతున్న జాతీయ అంతరిక్ష దినోత్సవం ఇందుకు వేదికైంది. దేశీయంగా రూపకల్పన చేసిన బీఏఎస్ తొలి మాడ్యూల్ (01)ను 2028 కల్లా భూ దిగువ కక్ష్యలోకి ప్రవేశపెట్టేందుకు ఇస్రో కృషి చేస్తుండటం తెలిసిందే. 2035కల్లా దాన్ని ఐదు - మిగతా6లో

## ఆయన నక్సలైట్ల మద్దతుదారుడు



- జస్టిస్ సుదర్శన్‌రెడ్డి సల్వాజుడుంకు వ్యతిరేకంగా తీర్పు ఇచ్చారు
- నక్సలైట్లకు మద్దతివ్వడానికి సుప్రీంకోర్టును వాడుకున్నారు
- వామపక్షాల ఒత్తిడి వల్లే ఉప రాష్ట్రపతి అభ్యర్థిగా జస్టిస్ సుదర్శన్‌రెడ్డి
- కేంద్ర మంత్రి అమిత్ షా ఆగ్రహం

6

## శునకాలకు వీధుల్లో ఆహారం పెట్టొద్దు



- ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు
- మున్సిపాలిటీల్లో వార్డుల వారీగా ఫీడింగ్ కేంద్రాల ఏర్పాటు
- దేశమంతటికీ వర్తించేలా సుప్రీంకోర్టు మధ్యంతర తీర్పు
- సంతాన నిరోధక చికిత్సల తర్వాత వీధి కుక్కలను వదిలిపెట్టాలి
- దిల్లీలో నిషేధం ఉత్తర్వుల సవరణ



# ఇకపై ఏటా డీఎస్సీ

## 16,347 పోస్టులతో మెగా డీఎస్సీ విజయవంతం : విద్యాశాఖపై సమీక్షలో మంత్రి లోకేశ్

**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :**

రాష్ట్ర చరిత్రలో మొదటిసారి 16,347 పోస్టులతో మెగా డీఎస్సీని విజయవంతంగా నిర్వహించామని మానవ వనరుల అభివృద్ధి, విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ అన్నారు. ఇకనుంచి ప్రతి సంవత్సరం డీఎస్సీ ప్రకటించి ఎప్పటికప్పుడు ఖాళీలు భర్తీ చేస్తామని వెల్లడించారు. ఉండవల్లిలోని నివాసంలో శుక్రవారం ఆయన విద్యాశాఖపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... అనవసరమైన శిక్షణ కార్యక్రమాలతో ఉపాధ్యాయుల విలువైన సమయాన్ని వృథా చేయొద్దని అధికారులకు స్పష్టం చేశారు. ప్రభుత్వ విద్యా రంగంలో ప్రమాణాల మెరుగుదలకు 14 నెలలుగా అనేక సంస్కరణలు అమలుచేశామన్నారు. ఈ సంస్కరణల అంతిమ లక్ష్యం అభ్యసన ఫలితాలు సాధించడమేనని చెప్పారు. మెరుగైన ఫలితాలు సాధించాల్సిన బాధ్యత అధికారులు, టీచర్లపై ఉందన్నారు. అసర్ నివేదిక ప్రకారం ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ (ఎఫ్ఎల్ఎన్).. అంటే చదవడం, రాయడం, - మిగతా2లో

# సవాళ్ల వెనుక.. అవకాశాలు

-మొదటిపేజీ తరువాయి

పేర్కొన్నారు.
1991లో దేశంలో ఆర్థిక సంస్కరణలు మొదలయ్యాయి. 1995లో ముఖ్యమంత్రిగా నేను బాధ్యతలు చేపట్టాక ఆంధ్రప్రదేశ్‌లో రెండో తరం సంస్కరణలు ప్రారంభించాను. ప్రతి సంస్కరణా మా దగ్గర మొదలై ప్రయోజనాలు అందించింది. రాష్ట్ర విభజన ఇబ్బందులు, 2019–24 మధ్యలో గాడితప్పిన పాలన ఇప్పుడు మా ముందున్న పెద్ద సవాళ్లు. దశాబ్దాల క్రితం వ్యాపారవేత్తలు ఇచ్చిన సీఈవో బిరుదు అప్పట్లో నాకు నష్టం చేసింది. ముఖ్యమంత్రిగా రాష్ట్రాన్ని నడిపించడం తెలియదని నిందించారు.
ఐటీకి భవిష్యత్తు లేదన్నారు.. మేం పట్టు వదల్లేదు పాతికేళ్ల క్రితమే ఏపీలో ఐటీ విధానాన్ని తీసుకొచ్చాం. ఐటీకి భవిష్యత్తు లేదని అప్పట్లో ఎన్నో విమర్శలొచ్చినా పట్టు విడవలేదు. ఫలితంగా మైక్రోసాఫ్ట్ హైదరాబాద్‌కు వచ్చింది. దానివల్ల అక్కడ పనిచేసిన ఉద్యోగే ఆ సంస్థకు సీఈఓ కాగలిగారు. ప్రభుత్వ విధానాల ఫలితాలను మా రాష్ట్ర ప్రజలు ఎలా ఒడిసిపట్టుకుంటారో చెప్పడానికి ఇదో ఉదాహరణ. ప్రపంచంలో ఎక్కడికెళ్లినా భారతీయులు, అందులోనూ 30–35% మంది తెలుగువారు ఉంటున్నారు. ప్రభుత్వ విధానాల ద్వారా మేం తెలుగువారికి ఇచ్చిన కంట్రిబ్యూషన్ ఇది.
ఏడాదిలో రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులు తెచ్చాం గత ఏడాది కాలంలో రాష్ట్రానికి రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులు తెచ్చాం. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ నుంచి స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానానికి మళ్లడం వల్ల పెద్ద కంపెనీలు వస్తున్నాయి. లక్ష్మీమిత్తల్ రూ.లక్ష కోట్లతో స్టీల్ సిటీ నిర్మించబోతున్నారు. బీపీసీఎల్ రిఫైనరీ ద్వారా మరో రూ.లక్ష కోట్ల పెట్టుబడి వస్తుంది. టీసీఎస్, గూగుల్ లాంటి దిగ్గజ కంపెనీలు కూడా ఏపీకి వస్తున్నాయి. ఒక్క గ్రీన్ ఎనర్జీలోనే రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులు ఆకర్షించడానికి ప్రయత్నిస్తున్నాం.

**మా మద్దతుపై సందేహమేంటి?**
ఉప రాష్ట్రపతి ఎన్నికలో ఎన్డీయే అభ్యర్థికి మా మద్దతు విషయంలో సందేహం ఎందుకు వస్తుందని మీడియాను అడుగుతున్నా. ఒక అనుమానం సృష్టించి వ్యక్తులు, పార్టీల విశ్వసనీయతతో ఆడుకోవడం సరికాదు. ఓటర్ల జాబితా సవరణ నిరంతర ప్రక్రియ. రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఎన్నికల సంఘాలు స్వయంప్రతిపత్తితో పనిచేస్తున్నాయి. తప్పొప్పుల పరిశీలనకు రాజకీయ పార్టీల బూత్ స్థాయి ఏజెంట్లకు కూడా ఓటర్ల జాబితా ఇస్తాయి. అందువల్ల ఓటర్ల జాబితా తయారీపై అనుమానాలు అక్కర్లేదు.
దేవుడు నాకు సైబరాబాద్, అమరావతి నగరాలు నిర్మించే వరమిచ్చాడు. అంతర్జాతీయ ప్రమాణాలతో అత్యంత జీవనయోగ్యమైన నగరంగా అమరావతిని నిర్మిస్తున్నాం. వ్యక్తిగత ఏసీల అవసరం లేకుండా డిస్టింక్ట్ కూలింగ్ వ్యవస్థను ప్రవేశపెడుతున్నాం. సంతోషంగా జీవించాలనుకున్నవారు అమరావతికి వచ్చి స్థిరపడొచ్చు. భవిష్యత్తులో హైదరాబాద్, అమరావతిల మధ్యే ఉత్తమ నగరాల పోటీ ఉంటుంది.

**బిల్ క్లింటనే కోరి.. హైదరాబాద్ వచ్చారు**
‘గతంలో అమెరికా అధ్యక్షుడిగా ఉన్న బిల్‌క్లింటన్ ఇండియాకు వచ్చినప్పుడు హైదరాబాద్‌ను సందర్శించారు. వాస్తవానికి ఆయన్ను మేం ఆహ్వానించలేదు. అప్పటి కర్ణాటక సీఎం ఎస్ఎం కృష్ణ క్లింటన్‌ను బెంగళూరుకు తీసుకెళ్లాలనుకున్నారు. క్లింటన్ మాత్రం తాను హైదరాబాద్ రావాలనుకుంటున్నానని మాకు చెప్పి వచ్చారు. టైమ్స్, న్యూయార్క్ టైమ్స్, వాల్‌స్ట్రీట్ జర్నల్ వంటి పత్రికల్లో హైదరాబాద్ గురించి వార్తలు వస్తుంటే.. మనం భారత్‌కు వెళ్తే తప్పకుండా హైదరాబాద్‌కు వెళ్లాలని వైట్‌హౌస్ సిబ్బందికి చెప్పానని ఆయన అన్నారు. క్లింటన్ అమెరికా తిరిగి వెళ్లిన తర్వాత అక్కడి గవర్నర్లందర్నీ పిలిచి మనమేదో ఐటీలో గొప్ప అనుకుంటున్నాం.. కానీ హైదరాబాద్‌లో నాకు డ్రైవింగ్ లైసెన్స్ అప్పటికప్పుడే ఇచ్చారని చెప్పారు. ఆ రోజుల్లో ఎక్కడా ఆన్‌లైన్ ద్వారా డ్రైవింగ్ లైసెన్స్ ఇచ్చే విధానమే లేదు. తర్వాత క్లింటన్ చెప్పడంతో టోనీబ్లెయిర్ హైదరాబాద్ వచ్చారు. మనం మంచి పని చేస్తే అదే మనకు ప్రచారం తెస్తుంది’ అని చంద్రబాబు పేర్కొన్నారు. ‘మీరు ఉమ్మడి రాష్ట్రంలో సీఎంగా ఉన్నప్పుడు లండన్‌లోని హౌస్ ఆఫ్ లార్డ్స్‌ను ఉద్దేశించి ప్రసంగించారు. ఆ ఘనత సాధించిన తొలి ముఖ్యమంత్రి మీరే కదా?’ అని అప్పట్లో చంద్రబాబు వెంట ఆ కార్యక్రమంలో పాల్గొన్న ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డైరెక్టర్స్ (ఐఓడీ) ప్రతినిధి అడిగినప్పుడు ఆయన క్లింటన్ ఇండియా పర్యటన పూర్వాపరాలను గుర్తుచేశారు.

**మనం గేర్ మార్చాలి**
ప్రధాని మోదీ ఇప్పుడు తదుపరి తరం సంస్కరణల వైపు వెళ్తున్నారు. దీనివల్ల మరో ఏడాదిలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతాం. మనకంటే 4.5 రెట్లు, 7.5 రెట్ల పెద్దగా ఉన్న చైనా, అమెరికా ఆర్థిక వ్యవస్థలతో పోటీపడాలి. కాబట్టి మనం గేర్ మార్చాలి. ప్రపంచస్థాయి నాణ్యతతో కూడిన వస్తువుల భారీ ఉత్పత్తి దిశగా ప్రయత్నాలు మొదలుపెట్టాలి. దేశంలో తొలిసారి జనవరి నుంచి అమరావతిలో కృత్రిమమేధతో కూడిన క్వాంటమ్ వ్యాలీ ప్రారంభిస్తున్నాం. దీంతో పెద్ద ముందడుగు పడుతుంది.

# అందరి సమ్మతితోనే కావేరికి గోదావరి

అమరావతి



గోదావరి ట్రిబ్యునల్ కేటాయింపులకు భంగం వాటిల్లకుండా, ఏ రాష్ట్ర హక్కులకు విఘాతం కలగకుండా, పరివాహక ప్రాంతం (బేసిన్)లోని రాష్ట్రాల సమ్మతితో గోదావరి%–%కావేరి అనుసంధానం చేపడతామని నదుల అనుసంధానం టాస్క్ ఫోర్స్ కమిటీ, కేంద్ర జలసంఘం (సీడబ్ల్యూసీ) చైర్మన్ అతుల్ జైన్ స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో శుక్రవారం ఆయన అధ్యక్షతన టాస్క్ ఫోర్స్ కమిటీ ఆరో సమావేశం జరిగింది. గోదావరి%–%కావేరి, బెడ్తి%–%వరద అనుసంధానంపై ఏకాభిప్రాయసాధనే అజెండాగా నిర్వహించిన ఈ సమావేశంలో బేసిన్‌లోని తొమ్మిది రాష్ట్రాలు (ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, ఒడిశా, మహారాష్ట్ర, తమిళనాడు, కేరళ, కర్ణాటక), కేంద్రపాలిత ప్రాంతం పుదుచ్చేరి జలవనరులశాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ అనుసంధానంపై అతుల్ జైన్ తొలుత పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఇంద్రావతి సబ్ బేసిన్‌లో ఛత్తీస్‌గఢ్ కోటాలో వాడుకోని 148 టీఎంసీల గోదావరి జలాలను ఇచ్చంపల్లి నుంచి నాగార్జునసాగర్ (కృష్ణా), సోమశిల (పెన్నా), అరణియార్ రిజర్వాయర్ మీదుగా కావేరికి తరలిస్తామని చెప్పారు. దీన్లో అంతర్భాగంగా కర్ణాటకలో బెడ్తి%–%వరద అనుసంధానం చేపడతామన్నారు. కావేరికి తరలించే 148 టీఎంసీల గోదావరి జలాలు, బెడ్తి%–%వరద అనుసంధానంలో తరలించే 18.5 టీఎంసీలు వెరసి 166.5 టీఎంసీలలో.. తెలంగాణకు 43.65, ఆంధ్రప్రదేశ్‌కు 43.86, తమిళనాడుకు 40.93, కర్ణాటకకు 34.40, పుదుచ్చేరికి 2.19 టీఎంసీలు కేటాయిస్తామని వివరిటంచారు.
రెండోదశలో గంగా%–%మహానది, మహానది%–%గోదావరి అనుసంధానంతో కావేరికి మరిన్ని జలాలు తరలిస్తామని, అప్పుడు ఛత్తీస్‌గఢ్ కోటా 148 టీఎంసీలను ఆ రాష్ట్రానికే ఇస్తామని చెప్పారు. రెండోదశ అనుసంధానంలో రాష్ట్రాల అవసరాల మేరకు నీటిని కేటాయిస్తామన్నారు. తొలిదశ అనుసంధానానికి అన్ని రాష్ట్రాలు సమ్మతి వ్యక్తం చేస్తే తక్షణమే ప్రాజెక్టును చేపడతామని ఆయన చెప్పారు.

**ఏ రాష్ట్ర ప్రభుత్వం ఏమన్నదంటే..**
ఆంధ్రప్రదేశ్: గోదావరిలో నీటిలభ్యతపై సీడబ్ల్యూసీ మళ్లీ అధ్యయనం చేసి నికరజలాల్లో మిగులు తేల్చాలి. ఇచ్చంపల్లి నుంచి గోదావరి జలాలను తరలిస్తే ఏపీ హక్కులకు భంగం వాటిల్లుతుంది. పోలవరం ప్రాజెక్టు నుంచి గోదావరి%–%కావేరి అనుసంధానం చేపడితే ఏ రాష్ట్ర హక్కులకు భంగం వాటిల్లదు.
నికర, వరదజలాల సమస్య ఉత్పన్నం కాదు. నాగార్జునసాగర్, సోమశిల రిజర్వాయర్లను బ్యాలెన్సింగ్ రిజర్వాయర్లుగా వినియోగించుకుంటే వాటి ఆయకట్టు ప్రయోజనాలకు విఘాతం కలుగుతుంది. వరదల్లో కృష్ణా, పెన్నా నిర్వహణ కష్టమవుతుంది. ఈ నేపథ్యంలో నాగార్జునసాగర్, శ్రీశైలం, పులిచింతల, సోమశిల రిజర్వాయర్లపై సిమ్యులేషన్ స్టడీస్ నిర్వహించాలి.
తెలంగాణ: ఇచ్చంపల్లి నుంచి గోదావరి జలాల తరలింపునకు అభ్యంతరం లేదు. కానీ ఈ అనుసంధానంలో తరలించే జలాల్లో 50 శాతం నీటిని మాకు కేటాయించాలి. నాగార్జునసాగర్ ఆయకట్టుకు విఘాతం కలగకుండా చూడాలి.
ఛత్తీస్‌గఢ్: ఇంద్రావతి సబ్‌బేసిన్‌లో ప్రాజెక్టులు నిర్మిస్తున్నాం. మా కోటా 148 టీఎంసీలను తరలించడానికి అంగీకరించం.
మహారాష్ట్ర: ఇచ్చంపల్లి బ్యారేజీలో నీటిని వాడుకోవడానికి అనుమతి ఇవ్వాలి.
మధ్యప్రదేశ్: గోదావరి ట్రిబ్యునల్ అవార్డుకు విఘాతం కలగకుండా అనుసంధానించాలి.
ఒడిశా: గోదావరి%–%కావేరి అనుసంధానం రెండోదశలో మహానది%–%గోదావరి అనుసంధానాన్ని అంగీకరించం.
తమిళనాడు: మాకు నీటికేటాయింపు పెంచాలి.
కర్ణాటక: కృష్ణాజలాల్లో మా వాటా పెంచాలి.
కేరళ: కావేరి జలాల్లో మాకు అదనపు నీరు కేటాయించాలి.
పుదుచ్చేరి: మాకు నీటికేటాయింపు పెంచాలి.

**నదుల అనుసంధానంలో ఏకాభిప్రాయమే ముఖ్యం**
**పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీకి కేంద్రం వెల్లడి**
సాక్షి, న్యూఢిల్లీ: దేశంలో నదుల అనుసంధానంలో రాష్ట్రాల మధ్య ఏకాభిప్రాయ సాధనే ముఖ్యమని కేంద్ర జల శక్తి శాఖ పేర్కొంది. దీనిని విజయవంతం చేసేందుకు రాష్ట్రాలు ముందుకు రావాలని కోరింది. నదుల అనుసంధానంపై రాజీవ్ ప్రతాప్ రూఢీ నేతృత్వంలోని పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ లేవనెత్తిన పలు ప్రశ్నలకు కేంద్ర ప్రభుత్వం జవాబులు ఇచ్చింది. గోదావరి%–%కావేరి నదుల అనుసంధానాన్ని అత్యంత ప్రాధాన్యతగా తీసుకున్నట్లు కేంద్రం తెలిపింది. ఈ ప్రాజెక్టుకు సంబంధించి.. 147.98 టీఎంసీల నీళ్ల బదిలీ కోసం ముసాయిదా డీపీఆర్‌ను ఇప్పటికే అన్ని పరీవాహక రాష్ట్రాలకు అందించినట్లు తెలిపింది. నదుల అనుసంధానం అమలు కోసం ముసాయిదా మెమొరాండం ఆఫ్ అసోసియేషన్(ఎంవోఏ)ను తయారు చేసి.. గతేడాది ఏప్రిల్‌లో రాష్ట్రాలకు పంపించినట్లు పేర్కొంది. అనుసంధాన ప్రక్రియపై ఏకాభిప్రాయం కోసం ఐదుసార్లు సమావేశాలు నిర్వహించామని తెలిపింది. రాష్ట్రాల మధ్య ఏకాభిప్రాయ సాధన, ఎంవోఏపై సంతకాల కోసం కృషి చేస్తున్నట్లు కేంద్రం వెల్లడించింది. అలాగే దేశవ్యాప్తంగా చేపట్టనున్న నదుల అనుసంధానం ప్రతిపాదనలను కూడా కేంద్రం ప్రస్తావించింది. మొత్తంగా 30 ప్రాజెక్టులకు నివేదికలను సిద్ధం చేసినట్లు తెలిపింది.
ఇందులో కెన్%–%బెత్వా లింక్ ప్రాజెక్ట్, గోదావరి%–%కావేరి లింక్ (గోదావరి%–%కృష్ణా, కృష్ణా%–%పెన్నా, పెన్నా%–%కావేరి), పర్బతి%–%కలిసింద్%–%చంబల్ నదుల అనుసంధానాన్ని తొలి ప్రాధాన్యతగా గుర్తించినట్లు పేర్కొంది. 2030 నాటికి వీటిని పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించింది. ఈ ఏడాది రూ.4 వేల కోట్ల బడ్జెట్ కేటాయించినట్లు తెలిపింది. దీనిపై కమిటీ స్పందిస్తూ.. నీటి కొరత, కరువు నివారణ, వరద నియంత్రణకు ఆచరణీయమైన పరిష్కారాన్ని నదుల అనుసంధానం అందిస్తుందని అభిప్రాయపడింది. సంబంధిత రాష్ట్రాలకు దీనిపై అవగాహన పెంచి.. ఈ ప్రాజెక్టుల అమలును వేగవంతం చేయాలని సూచించింది.

## పాపం...కమ్మ నేతలు

విజయవాడ

తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తుంది. అయితే ప్రస్తుత మంత్రి వర్గంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అసంతృప్తిగా ఉన్నారు. ఇటీవల జరిగిన మంత్రివర్గ సమావేశంలో మంత్రులపై చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేసిన నేపథ్యంలో కొందరు నేతలు విస్తరణపై ఆశలు పెట్టుకున్నారు. సీనియర్ నేతలతో పాటు గుంటూరు, కృష్ణా జిల్లాకు చెందిన కమ్మ సామాజికవర్గం నేతలు కూడా తమ వంతు ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే ఈ రెండు జిల్లాలకు చెందిన కమ్మ సామాజికవర్గానికి చెందిన నేతలకు కేబినెట్ లో ఐదేళ్లు అవకాశం దక్కే ఛాన్స్ లేదంటున్నారు. కమ్మ సామాజికవర్గానికి చెందిన వారు కావడమే మంత్రి పదవి దక్కకపోవడానికి ప్రధాన కారణంగా చెప్పాలి.. ఇప్పటికే చంద్రబాబు నాయుడు మంత్రివర్గంలో ఐదు గురు కమ్మ సామాజికవర్గం నేతలు ఉండటమే అందుకు కారణం. ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు మంత్రులుగా నారా లోకేశ్, నాదెండ్ల మనోహర్, పయ్యావుల కేశవ్, గొట్టిపాటి రవికుమార్ లు కేబినెట్ లో ఉన్నారు. ఇందులో నలుగురు టీడీపీకి చెందిన వారు కాగా, ఒక్కరు జనసేనకు చెందిన వారు.ఇప్పుడు మంత్రి వర్గ విస్తరణ జరిగినా చంద్రబాబును తప్పిస్తే మిగిలిన నలుగురిని కేబినెట్ నుంచి తప్పించే అవకాశాలు లేవనే చెప్పాలి. ఎందుకంటే వీరు యాక్టివ్ గా ఉండటంతో పాటు ప్రాంతాల వారీగా పట్టున్న నేతలు. రాయలసీమలో పయ్యావుల కేశవ్, గుంటూరు జిల్లాలో నాదెండ్ల మనోహర్, నారా లోకేశ్, ప్రకాశం జిల్లా నుంచి గొట్టిపాటి రవికుమార్ లు ప్రాతినిధ్యం వహిస్తున్నారు.

## ఇకపై ఏటా డీఎస్సీ

-మొదటిపేజీ తరువాయి

గణితంలో ప్రాథమిక నైపుణ్యం సాధించడంలో రాష్ట్రం 14వ స్థానంలో ఉందని, ఈ ర్యాంకును మెరుగుపరిచేందుకు నిర్మాణాత్మక చర్యలు చేపట్టాలని కోరారు. దేశంలో తొలిసారిగా ప్రతి బిడ్డకూ ఎఫ్ఎల్ఎన్‌ను ఒక హక్కుగా అందిచబోతున్నామన్నారు. తల్లికి వందనం పథకంలో చివరి విడతగా పెండింగ్ దరఖాస్తులకు రూ.325 కోట్లు విడుదల చేసినట్లు తెలిపారు. 2024–25 ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. కొత్తగా మంజూరైన జవహర్ నవోదయ, కేంద్రీయ విద్యాలయాల ఏర్పాటుకు దాతల సహకారంతో భూసేకరణకు చర్యలు చేపట్టాలన్నారు. తమిళనాడు, పంజాబ్, గుజరాత్‌ల్లో అమలుచేస్తున్న విజయవంతమైన విధానాలను అధ్యయనం చేసి ఉత్తమ ప్రీస్కూల్ పాలసీ రూపొందించాలని సూచించారు. శాప్ సహకారంతో సైన్స్, స్పోర్ట్స్ ఫెయిర్‌లు నిర్వహించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, మోడల్ స్కూళ్లలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి దేశ విదేశాల్లో స్థిరపడిన ప్రముఖులు, దాతల సహకారం తీసుకోవాలన్నారు. ఆసక్తిగలవారు వారి గ్రామాల్లోని పాఠశాలలను దత్తత తీసుకునేలా ప్రత్యేక వెబ్‌సైట్ రూపొందించాలన్నారు. అనంతపురం, నెల్లూరు, ఏలూరు, కడప, చిత్తూరు జిల్లాల్లో ఆధునీకరించిన సైన్స్ కేంద్రాలను త్వరగా ప్రారంభించాలన్నారు. అమరావతిలో ఏర్పాటుచేసే సెంట్రల్ లైబ్రరీ దేశంలోనే అత్యుత్తమంగా ఉండాలన్నారు. 2 లక్షల చదరపు అడుగుల్లో నిర్మించే ఈ లైబ్రరీ నిర్మాణం ఏడాదిలో పూర్తిచేయాలన్నారు. విశాఖపట్నంలో ప్రతిపాదించిన ప్రాంతీయ లైబ్రరీ 50వేల అడుగుల్లో ఉండాలన్నారు. రాష్ట్రంలోని అన్ని గ్రంథాలయాలను అనుసంధానిస్తూ వెబ్‌సైట్ రూపొందించాలన్నారు. స్థానిక సంస్థల నుంచి రూ.213 కోట్ల సెస్ బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని లైబ్రరీల అభివృద్ధికి వినియోగించేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రభుత్వ లైబ్రరీల్లో అందుబాటులో ఉన్న పుస్తకాలతో సన్నద్ధమైన 350 మందికి కానిస్టేబుల్ ఉద్యోగాలు వచ్చాయన్నారు. లైబ్రరీల వల్ల కలిగే ప్రయోజనాలపై పెద్దఎత్తున ప్రచారం నిర్వహించాలన్నారు. పోటీ పరీక్షలకు సంబంధించిన అన్ని రకాల పుస్తకాలను లైబ్రరీల్లో అందుబాటులో ఉంచాలన్నారు. దృష్టిలోపం ఉన్న విద్యార్థులకు ఎంపీసీ, బైపీసీ గ్రూపుల్లో చేరేందుకు మంత్రి అనుమతి మంజూరు చేశారు. అక్షరాంధ్రలో భాగంగా 16లక్షల మంది వయోజనులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలన్నారు. సమీక్షలో ఉన్నతాధికారులు కోన శశిధర్, వి.విజయరామరాజు, కృతిక శుక్లా, బి.శ్రీనివాసరావు, దీవెన్‌రెడ్డి, కృష్ణమోహన్ పాల్గొన్నారు.

**రోల్ మోడల్‌గా నైపుణ్యం పోర్టల్**
యువత, పరిశ్రమలను అనుసంధానించేలా కూటమి ప్రభుత్వం ప్రతిష్మాత్మకంగా రూపొందిస్తున్న నైపుణ్యం పోర్టల్ దేశానికే రోల్ మోడల్‌గా ఉండాలని మంత్రి ఆదేశించారు. శుక్రవారం నైపుణ్య శా ఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. అక్టోబరులో నైపు ణ్యం పోర్టల్ ప్రారంభించాలన్నారు. పీఎం ఇం టర్న్‌షిప్ స్కీంతో నైపుణ్యం పోర్టల్‌ను అనుసంధానించాలన్నారు. దేశంలో ఎక్కడా నైపు ణ్యం పోర్టల్‌ను ఈస్థాయిలో అభివృద్ధి చేయలేదన్నారు. ఏడాదికి 50వేల మందికి శిక్షణ ఇవ్వొచ్చని అధికారులు తెలిపారు. ఇప్పటికే 36 రంగాల్లో 3వేలకు పైగా జాబ్ కేటగిరీలను పోర్టల్‌లో నమోదుచేశామన్నారు.

## తప్పుడు ప్రచారాలకు తావివ్వొద్దు

-మొదటిపేజీ తరువాయి

తాజా పరిస్థితులపై ఆరా తీశారు. రెండు నదులకు వస్తున్న ప్రవాహాలు, పలు ప్రాంతాల్లో నీట మునిగిన పంటలు, నివాస సముదాయాలకు సంబంధించిన పరిస్థితిని అధికారులు సీఎంకు వివరించారు. ఎగువ ప్రవాహాలతో కృష్ణా నదిలో శ్రీశైలం నుంచి 5.20 లక్షల క్యూసెక్కులు, నాగార్జున సాగర్ నుంచి 4.32 లక్షలు, పులిచింతల నుంచి 4.07 లక్షలు, ప్రకాశం బ్యారేజీ నుంచి 4.53 లక్షల క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. గోదావరి నదిలోనూ భారీగా వరద ప్రవాహాలు వస్తున్నాయన్నారు. ప్రస్తుతం ధవళేశ్వరం బ్యారేజీ నుంచి 13,42,307 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల అవుతోందని చెప్పారు. గోదావరి వరదల కారణంగా పరివాహక ప్రాంతాల్లోని లంక గ్రామాలు, పోలవరం ముంపు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయని వివరించారు. ఈ ప్రాంతాల్లో ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయడంతో పాటు అవసరమైన ఏర్పాట్లు చేయాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో ఎరువులు, పురుగు మందుల లభ్యత, సరఫరా అంశంపైనా సీఎం సమీక్ష చేశారు.

**పైప్ మొత్తం తనిఖీ చేయండి**
కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం ధరియాల తిప్ప సమీపంలో ఓఎన్జీసీ గ్యాస్ పైప్‌లైన్ లీక్ ఘటనపై ఆ జిల్లా కలెక్టర్, ఇతర అధికారులతో సీఎం మాట్లాడారు. గురువారం అర్ధరాత్రి దాటాక 1.30 గంటలకు గ్యాస్ లీక్‌తో మంటలు భారీగా ఎగిసి పడ్డాయనీ, గంటన్నర వ్యవధిలోనే సరఫరా నిలిపి వేసి, లీక్‌ను అరికట్టినట్లు అధికారులు తెలిపారు. ప్రాణ, ఆస్తి నష్టం జరగలేదని వివరించారు. లీకైన పైప్‌ను మొత్తం తనిఖీ చేసి, సమీప గ్రామాల ప్రజలు ఆందోళనకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను సీఎం ఆదేశించారు. పరిస్థితిని ఎప్పటికప్పుడు తనకు తెలియజేయాలని సూచించారు.

## అరుణ చుట్టూ రాజకీయం

నెల్లూరు

వైసీపీలో వైభోగం అనుభవించింది, కూటమి వచ్చాక పాత పరిచయాలతో రెచ్చిపోయింది. చివరకు జైలుకెళ్లింది. సింపుల్ గా ఇదీ అరుణ స్టోరీ. ఆమె జైలుకెళ్లడంపై రెండు పార్టీల నేతలు తీవ్ర వాదోపవాదాలు చేసుకుంటున్నారు. ఆమె వైసీపీ అంటే కాదు, టీడీపీ అంటున్నారు. మీ పార్టీ ఆమెను పెంచి పోషించిందంటే, మీ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఆమె ఆటలు సాగాయంటూ ఒకరిపై ఒకరు నిందలు వేసుకుంటున్నారు. ఆమెకు సహకరించిన నేతలు మాత్రం తేలుకుట్టిన దొంగల్లా సైలెంట్ అయ్యారు. నిడిగుండ అరుణ సోషల్ మీడియా అకౌంట్లు చూస్తే మాత్రం ఆమె ఏ పార్టీనో, ఏ పార్టీకి మద్దతిస్తారో, ఏయే అధికారులతో ఫొటోలు దిగారనేది స్పష్టంగా తెలిసిపోతుంది. వైసీపీ హయాంలో వైభోగం.. నిడిగుండ అరుణ అలియాశ్ దిశ అరుణ.. వైసీపీ హయాంలో ఆమె తనను తాను దిశ వెల్ఫేర్ ప్రొటెక్షన్ ఫోర్స్ అధ్యక్షురాలిగా చెప్పుకునేది. అందుకే ఆమె దిశ అరుణ అయ్యారు. దిశ అరుణగా రాజకీయ నాయకులతో కలసి మెలసి తిరిగేది, వారి బర్త్ డే వేడుకలకు హాజరై కేక్ తినిపించేది. ఆ వీడియోలు, ఫొటోలన్నీ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి. వైసీపీ ఆఫీస్ లో ఆమె పెట్టిన ప్రెస్ మీట్ వీడియోలు కూడా ఇప్పుడు వైరల్ గా మారాయి. వైసీపీ పార్టీ నేతగా అరుణ ప్రచారం చేసుకున్నారని, ఆ పార్టీ నేతలు కూడా ఆమెకు సహకరించారని టీడీపీ వెటకారం చేస్తోంది. అయితే ఇక్కడ వైసీపీకి తప్పించుకునే అవకాశం కూడా లేదు. ఫొటోలు, వీడియోలు, అన్నీ పగడ్బందీగా ఉండటంతో సోషల్ మీడియా దెబ్బకి వైసీపీ తేలు కుట్టిన దొంగలా మారింది. టీడీపీ సంగతేంటి..? వైసీపీ హయాంలో ఆమె తప్పులు చేసింది సరే, మరి కూటమి వచ్చాక అయినా ఆ తప్పులకు లెక్కలు చెప్పాలి కదా. కానీ ఇప్పుడు కూడా అదే జరిగింది. వాస్తవానికి అరుణ ప్రియుడు శ్రీకాంత్ పెరోల్ పై విడుదల కావడం మరింత సంచలనంగా మారింది. మీడియా హడావిడి వల్ల అసలు విషయం బయటకు పొక్కడంతో ప్రభుత్వం నష్టనివారణ చర్యలు తీసుకుంది. శ్రీకాంత్ పెరోల్ రద్దయింది, బెదిరింపుల కేసులో అరుణ అరెస్టై జైలుకెళ్లింది. అయితే ఈ పెరోల్ కోసం టీడీపీ ఎమ్మెల్యేలు కొందరు కృషి చేశారనే ఆరోపణలు పార్టీని ఇబ్బంది పెట్టాయి. తనకే సంబంధం లేదని, తన నియోజకవర్గానికి చెందిన వారు వస్తే పెరోల్ కోసం సిఫారసు చేశానని, అయినా తన లేఖ వల్ల పెరోల్ రాలేదంటూ గూడూరు ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ ప్రెస్ మీట్ పెట్టి మరీ వివరణ ఇచ్చారు. మరికొందరు నేతల పేర్లు వినపడుతున్నా వారు బయటకు రావడానికి జంకుతున్నారు. అంతా ఆ ఫోన్లలోనే.. అరెస్ట్ సమయంలో నిడిగుండ అరుణ నుంచి పోలీసులు రెండు ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఆ ఫోన్లలో అసలు వ్యవహారం అంతా ఉందని తెలుస్తోంది. పోలీస్ అధికారుల వ్యవహారాలు కూడా అందులో ఉన్నాయట. అదే సమయంలో రాజకీయ నాయకులతో ఆమె దిగిన ఫొటోలు, ఆడియో కాల్స్ రికార్డింగ్ లు కూడా ఉన్నాయని ప్రచారం జరుగుతోంది. ఇందులో నిజం ఎంతున్నా.. అందులోని సమాచారం అంతా బయటకు వస్తుందని ఆశించలేం.

# విశ్వం వాయిస్

అవినీతిపై- అక్షరసమరం...



కాకినాడ తూర్పు గోదావరి

డా బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ

శనివారం 23 ఆగస్టు 2025




www.viswamvoice.com

# పెద్దమ్మ తల్లి ఆలయంలో శ్రావణ శుక్రవారం విశేష పూజలు

**పెద్ద ఎత్తున మహిళ భక్తులు పాల్గొన్నారు...**

**మండపేట టౌన్... విశ్వం వాయిస్ న్యూస్...** కోరిన కోరికలు తీర్చే తల్లి, అమ్మలు గన్న అమ్మ ముగ్గురమ్మల మూలపుటమ్మ మండపేట ఏడిద రోడ్ లో కొలువైవున్న పెద్దమ్మ తల్లి ఆలయం వద్ద శ్రావణమాసం శుక్రవారం పర్వదినం పురస్కరించుకుని అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా తెల్లవారుజాము నుంచి అమ్మవారికి మహిళలు చీర,గాజులు పసుపు, కుంకుమ పువ్వులు సమర్పించి పూజలు చేశారు.శ్రావణ మాసం ఆఖరి శుక్రవారం అమ్మవారి ఆలయం వద్ద అమ్మవారికి మహిళలు బూరెలు, గారెలు, పులిహోర , పాయసం, స్వీట్లు అప్పాలు వంటి రకరకాల వంటలతో సారి పెట్టారు. ఈ సందర్భంగా ఎవరికి తోచిన విధంగా వారు స్వీట్లు తీసుకువచ్చి అమ్మవారి ఆలయంలో సమర్పించారు పూజల అనంతరం ఈ స్వీట్లు అమ్మవారి ప్రసాదంగా భక్తులకు అందించనున్నట్లు ఆలయ చైర్మన్ వాలిన వీరబాబు తెలిపారు. కొందురు భక్తులు పెద్దమ్మ తల్లి ఆలయ సన్నిధిలో నేలపై రూపాయి కాయిన్ నిలబడితే తాము కోరుకున్న కోరికలు తీరతాయని భక్తుల నమ్మకం. ఈ నేపథ్యంలో కొందరు భక్తులు కాయిన్ నిలబెట్టి పరీక్షించుకున్నారు. అదేవిధంగా ఆలయ ప్రాంగణంలో



ముడుపులు కట్టి తమ మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో మండపేటకు చెందిన రెడ్డి పద్మ భజన బృందం మరియు అవధూత భజన బృందం సభ్యులు పెద్దమ్మ తల్లి భక్తి గీతాలు ఆలపించారు. మండపేట మండలం అర్తమూరు గ్రామానికి చెందిన కొవ్వూరి సత్యనారాయణ రెడ్డి (చిన్నఅబ్బు) గతంలో అమ్మవారిని తాను కోరుకున్న కోరిక తీరడంతో ఆలయం వద్ద భక్తులకు భారీ అన్న



సమారాధన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఆలయం వద్ద చైర్మన్ వాలిన వీరబాబు బూరెలు ఎగురవేశారు. బూరెలు ప్రసాదం తీసుకునేందుకు మహిళలు ఎగబడ్డారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.ఈ కార్యక్రమంలో మండిపూడి చంద్రశేఖర్, కేతిన శ్రీనివాస్,అడ్డాల సత్తిబాబు, శివరామ్ ఆలయ వాలంటీర్లు భక్తులు పాల్గొన్నారు.

## ఘనంగా మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకలు



**అంబాజీపేట విశ్వం వాయిస్ న్యూస్** అంబాజీపేటలో మెగాస్టార్ డాక్టర్ చిరంజీవి 70 వ జన్మదినోత్సవ వేడుకలను అంబాజీపేటలో చిరంజీవి అభిమానులు ఘనంగా నిర్వహించారు. స్థానిక జడ్పీ హైస్కూల్ ఎదురుగా మదర్ తెరిసా విగ్రహానికి , రియల్ స్టార్ శ్రీహరి విగ్రహానికి , వంగవీటి మోహన రంగా విగ్రహాలకు పూలమాలవేసి నివాళులర్పించారు. చిరంజీవి అభిమానులు ఏర్పాటు చేసిన కేకు ను కట్ చేసి అభిమానులకు పంచారు. మెగాస్టార్ చిరంజీవి జన్మదిన మహోత్సవాలలో భాగంగా స్థానిక ప్రముఖ సామాజిక సహజకవి, కవిరత్న వెంకట్ పొలమూరి ని మెగాస్టార్ అభిమానునులు ఘనంగా సత్కరించారు. వెంకట్ పొలమూరి పుర ప్రముఖులకు, మెగాస్టార్ చిరంజీవి అభిమానులకు అందరికీ వెంకట్ పొలమూరు ప్రతి ఒక్కరికి ధన్యవాదములు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కొర్లపాటి వెంకటేశ్వరరావు ( ఢిల్లీ), శిరిగినీడి వెంకటేశ్వరరావు , కొర్లపాటి గోపి ,నాగాబత్తుల శాంతకుమారి సుబ్బారావు,అరిగెల సూరిబాబు, దొమ్మేటి వెంకటేశ్వరరావు, దొమ్మేటి సాయికృష్ణ ,రవణం రాము, ఉందుర్తి నాగబాబు , ముత్తాబత్తుల ప్రశాంత్ .గోసంగి సత్యనారాయణ,సుంకర బాలాజీ, మైపాల తాతాజీ, మేడిది జానకీ ప్రసాద్,పత్తి దత్తుడు, సుంకర పేరయ్య నాయుడు, సూదాభత్తుల రాము, కొప్పినీడి ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## ఎక్సైజ్ స్టేషన్‌లో జిల్లా ప్రొహిబిషన్ ఆధ్వర్యంలో సమావేశం

**రామచంద్రపురం విశ్వం వాయిస్ న్యూస్ :-** రామచంద్రపురం ఎక్సైజ్ స్టేషన్‌లో జిల్లా ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆధ్వర్యంలో జనరల్ బార్ లైసెన్స్‌ల కోసం కొత్త విధానాలు,వార్షిక రుసుము 35 లక్షలు మరియు కల్లుగీత కార్మికులకు రోజువారీ రుసుము 17 లక్షలుగా నిర్ణయించడం జరిగింది.ఎ 4 దుకాణాలకు ప్రభుత్వ నిబంధనలు,వీటిలో ప్రతి దుకాణానికి 55 లక్షల వార్షిక రుసుము,ప్రతి దుకాణానికి 5 లక్షల రూపాయల సెక్యూరిటీ డిపాజిట్ మరియు 65 లక్షల వార్షిక రుసుము ఉన్న దుకాణాలకు 7.5 లక్షల రూపాయల సెక్యూరిటీ డిపాజిట్ ఉన్నాయని,అలానే ద్వైమాసిక రుసుము 55 లక్షల వార్షిక రుసుముతో ఎ 4 దుకాణాలకు ద్వైమాసిక రుసుము 83,333 రూపాయలు మరియు 65 లక్షల వార్షిక రుసుముతో దుకాణాలకు 1,25,000 రూపాయలు అని తెలిపారు. ఈ సమావేశంలో రామచంద్రపురం మునిసిపాలిటీ మరియు రూరల్ నుండి లైసెన్స్ హోల్డర్లు,పి.శ్రీనివాస్, సియోన్ కె.సుబ్బారావు, టి.వి.రామారెడ్డి వంటి ఎక్సైజ్ స్టేషన్ అధికారులు పాల్గొన్నారు.

## ఆదర్శలో చిరంజీవి జన్మదిన వేడుకలు...



**మండపేట టౌన్... విశ్వం వాయిస్ న్యూస్...** మెగాస్టార్ పద్మ విభూషణ్ చిరంజీవి 70వ జన్మదిన వేడుకలు మండపేటలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అఖిలభారత చిరంజీవి యువత మండపేట అధ్యక్షులు కొంతం ప్రసాద్ ఆధ్వర్యంలో ఈ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా మండపేట ఆదర్శ హెల్పింగ్ హాండ్స్ నందు అన్నదాన కార్యక్రమం నిర్వహించి కేక్ కట్ చేసి తమ అభిమానాన్ని చాటుకున్నారు. అనంతరం శెట్టి రవి మాట్లాడుతూ మెగాస్టార్ సినీ రంగానికి పెద్దగా ఉంటూనే తన అభిమానాలను తమ్ముళ్లుగా చూసుకునే ఆయన తీరు ఆదర్శనీయం అన్నారు. ఆయన అభిమానులుగా పుట్టడం తమ అదృష్టంగా భావించారు. ఈ కార్యక్రమంలో మొరం బాలాజీ , గోపికృష్ణ సాయి, బండారు సతీష్, మోటుపల్లి వీరబాబు, వైజయంతి రాజు, నిమ్మ రమేష్, చోడిశెట్టి దుర్గాప్రసాద్, మామిడాల మనో కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## వినాయక మండపాలు ఏర్పాటుకు అనుమతులు తప్పనిసరి

**అల్లర్లు, ఘర్షణలకు తావులేకుండా గణేష్ ఉత్సవాలు నిర్వహించాలి**

**రామచంద్రపురం డిఎస్పీ రఘువీర్ సూచన**



**రాయవరం, విశ్వంవాయిస్ న్యూస్:** వినాయక చవితి ఉత్సవాలలో భాగంగా, మండపాలు, పందిళ్ళు ఏర్పాటు చేసుకునే నిర్వాహకులు తప్పనిసరిగా అనుమతులు పొందాలని రామచంద్రపురం డి ఎస్పి రఘువీర్ శుక్రవారం ప్రకటన ద్వారా తెలిపారు. గణేష్ మండపాల ఏర్పాటుకు ఎటువంటి చలానా లు చెల్లించనవసరం లేదని ఆయన తెలిపారు. సింగిల్ విండో విధానం ద్వారా సులభంగా అనుమతులు పొందవచ్చునని తెలియచేస్తూ నమోదు విధానాన్ని వివరించారు. గణేష్ ఉత్సవాలు నిర్వహించబోయే వ్యక్తులు ముందుగా ఒక కమిటీగా ఏర్పడి, ప్రభుత్వం ప్రవేశపెట్టిన సింగిల్ విండో విధానం ద్వారా https://ganeshutsav.net క్లిక్ చేసి అనుమతులు పొందాలన్నారు. ఈ విధానం ద్వారా గణేష్ ఉత్సవాల నిర్వహణ, మండపాల ఏర్పాటు, ఊరేగింపులు, నిమర్జనం లకు అనుమతులను సులభంగా పొందవచ్చని పేర్కొన్నారు.

లి దరఖాస్తు చేయు విధానం

తొలుత Ganeshutsav.net వెబ్సైటులోకి వెళ్లి న్యూ అప్లికేషన్ అనే ఆప్షన్ పైన క్లిక్ చేయాలి. మొబైల్ నంబర్ ఎంటర్ చేసి ఓటిపి ద్వారా వెరిఫికేషన్ పూర్తయ్యాక దరఖాస్తు విండో ఓపెన్ అవుతుంది.

**దరఖాస్తు ఫారంలో నమోదు చేయాల్సిన వివరాలు**

దరఖాస్తుదారుని పేరు, మొబైల్ నంబర్, ఈమెయిల్ అడ్రస్, చిరునామా. అసోసియేషన్/కమిటీ పేరు.

గణేష్ మండపం స్థలం, విగ్రహం ఎత్తు, మండపం ఎత్తులను తెలిపి, ఏ సబ్ డివిజన్, ఏ పోలీస్ స్టేషన్ పరిధిలో వస్తుందో పొందు పరచాలి. ఉత్సవ కమిటీ సభ్యుల పేర్లు, ఫోన్ నంబర్లు.

గణేష్ నిమర్జనం తేది, సమయం, వాహన వివరాలను వివరించి, దరఖాస్తు సమర్పణ అనంతరం సంబంధిత పోలీసులు ప్రాంగణాన్ని పరిశీలించి అనుమతులను మంజూరు చేస్తారని వివరించారు. నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ డౌన్లోడ్ చేయు విధానం

కమిటీ సభ్యుల వివరాలను https://ganeshutsav.net/applicationStatus సైట్ లోకి వెళ్లి మొబైల్ నంబర్ ఎంటర్ చేస్తే, నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ (ఎన్.వో.సి) ను, పాటించాల్సిన నిబంధనలతో కూడిన క్యూఆర్ కోడ్ ను డౌన్లోడ్ చేసుకోవాలని, ప్రింట్ తీసి, ల్యామినేషన్ చేసి మండపంలో ఉంచడం ద్వారా తనిఖీకి వచ్చే అధికారులు వీటిని పరిశీలిస్తారని తెలిపారు. గణేష్ ఉత్సవాలను శాంతియుతంగా, ఎటువంటి అల్లర్లు, ఘర్షణలకు తావులేకుండా నిర్వహించేందుకు ప్రజలందరూ పోలీసు శాఖకు సహకరించాలని రామచంద్రపురం డిఎస్పీ రఘువీర్ ప్రజలను కోరారు.

## ఎక్సైజ్ స్టేషన్‌లో జిల్లా ప్రొహిబిషన్ ఆధ్వర్యంలో సమావేశం



**రామచంద్రపురం విశ్వం వాయిస్ న్యూస్ :-**రామచంద్రపురం ఎక్సైజ్ స్టేషన్‌లో జిల్లా ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆధ్వర్యంలో జనరల్ బార్ లైసెన్స్‌ల కోసం కొత్త విధానాలు,వార్షిక రుసుము 35 లక్షలు మరియు కల్లుగీత కార్మికులకు రోజువారీ రుసుము 17 లక్షలుగా నిర్ణయించడం జరిగింది.ఎ 4 దుకాణాలకు ప్రభుత్వ నిబంధనలు,వీటిలో ప్రతి దుకాణానికి 55 లక్షల వార్షిక రుసుము,ప్రతి దుకాణానికి 5 లక్షల రూపాయల సెక్యూరిటీ డిపాజిట్ మరియు 65 లక్షల వార్షిక రుసుము ఉన్న దుకాణాలకు 7.5 లక్షల రూపాయల సెక్యూరిటీ డిపాజిట్ ఉన్నాయని,అలానే

**ద్వైమాసిక రుసుము**

55 లక్షల వార్షిక రుసుముతో ఎ 4 దుకాణాలకు ద్వైమాసిక రుసుము 83,333 రూపాయలు మరియు 65 లక్షల వార్షిక రుసుముతో దుకాణాలకు 1,25,000 రూపాయలు అని తెలిపారు. ఈ సమావేశంలో రామచంద్రపురం మునిసిపాలిటీ మరియు రూరల్ నుండి లైసెన్స్ హోల్డర్లు,పి.శ్రీనివాస్, సియోన్ కె.సుబ్బారావు, టి.వి.రామారెడ్డి వంటి ఎక్సైజ్ స్టేషన్ అధికారులు పాల్గొన్నారు.

## ఘనంగా జయహో రథసారథి ఐదవ వార్షికోత్సవ వేడుకలు

**ముఖ్యఅతిథిగా అమలాపురం పట్టణం సీఐ వీరబాబు**



**అమలాపురం టౌన్ విశ్వం వాయిస్ న్యూస్ ఆగస్టు 22** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం పట్టణ స్టాండ్ వద్ద డ్రైవర్స్, క్లీనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంద రామకృష్ణ అధ్యక్షతన జయహో రథసారథి 5 వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు . ఈ కార్యక్రమానికి ముఖ్య అధితులుగా పట్టణ సీఐ వీరబాబు,ట్రాఫిక్ ఎస్ఐ యేసుబాబు హాజరై కేక్ కట్ చేయగా డ్రైవర్ అసోసియేషన్ సభ్యులు భారీ బాణాసంచాకాల్చి స్వీట్స్ పంచి సంబరాలు జరుపుకున్నారు అధ్యక్షుడు మంద రామకృష్ణ సీఐ వీరబాబు కి పుష్పగుచ్చం అందించి దుస్సాలువాలతో సిఐ, ఎస్సై యేసు బాబు ను సత్కరించారు ఈ సందర్భంగా పట్టణ సీఐ వీరబాబు మాట్లాడుతూ డ్రైవర్లు తీసుకోవలసిన జాగ్రత్తలు,సేఫ్టీ డ్రైవింగ్ రోడ్ నిబంధాలను డ్రైవర్లకు వివరించారు . డ్రైవర్ల అసోసియేషన్ అధ్యక్షుడు మందారామకృష్ణ మాట్లాడుతూ డ్రైవర్లకు వెల్ఫేర్ స్కీమ్ లాంటివి అవసరమని 50 సంవత్సరాలు నిండిన డ్రైవర్లకు ప్రభుత్వం పెన్షన్ పథకం అమలుచేసే విధంగా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమానికి పట్టణ డ్రైవర్లు ,కార్మికులు హాజరయ్యారు

# 'చింత'లమయంగా చింతలతోట కాలనీ

**త్రాగునీరు, డ్రైనేజీ,రహదారి సౌకర్యాలు లేక ప్రజలు పాట్లు**

**చీకటి పడితే అంధకారమే, విష సర్పాలు,దోమల తో పోరాటం**

**పాడైన పోతున్న ఆరోగ్యం పరిష్కారం చూపాలని అధికారులకు విన్నపాలు**



**రాయవరం, విశ్వంవాయిస్ న్యూస్:** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, రాయవరం మండలంలోనే మేజర్ పంచాయతీ అయిన చెల్లూరు గ్రామానికి చెందిన చింతలతోట, క్రొత్త కాలనీ ప్రాంతాలలో ప్రజలంతా కలిసి తాము ఎదుర్కొంటున్న పలు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ చెల్లూరు గ్రామ పంచాయతీ కార్యదర్శి ఎన్. ధనలక్ష్మి కి వినతిపత్రం అందజేశారు. తమ సమస్యలను వారు వివరిస్తూ గత ప్రభుత్వ పాలనలో ఇచ్చిన స్థలములలో గృహాలను నిర్మించుకుని నివసిస్తున్నామని, తాము నివసిస్తున్న ప్రాంతంలో నడిచేందుకు రోడ్డు సౌకర్యం లేక వర్షా కాలంలో పాఠశాల కు వెళ్ళి వచ్చే విద్యార్థులు,ఇతర అవసరాల నిమిత్తం గ్రామంలోని కి వచ్చే సమయంలో బురదమయమైన మార్గాలలో ప్రయాణించడానికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, ముఖ్యంగా డ్రైనేజీల సౌకర్యం లేక దుర్వాసన లోనే బ్రతుకుతున్నామని, కాలువలు లేక అవస్థలు పడుతున్నామని అన్నారు, ముఖ్యంగా ఆ ప్రాంతమంతా వీధి దీపాల సౌకర్యం లేక వేదన పడుతున్నామని, చీకటి పడితే అంధకారంలో మగ్గుతూ, విష సర్పాల భయంతో బ్రతుకీడుస్తున్నామని వాపోయారు. మంచినీటి ట్యాంకు నిర్మించి త్రాగునీటి కొరకు వేదన పడుతున్న మాకు ఊరట కల్పించాలని కోరారు. కనీసం సౌకర్యాలు లేని ప్రాంతం కావడం వలన దోమల తీవ్రత అధికంగా ఉండి, విష జ్వరాలు, డెంగ్యూ , మలేరియా వంటి వ్యాధులకు గురై, తీవ్ర అనారోగ్యానికి లోనవుతున్నామని ఆవేదన వ్యక్తం చేసారు. అధికారులు స్పందించి తమ సమస్యలకు పరిష్కారం చూపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో చింతలతోట, క్రొత్త కాలనీ ప్రాంతాలకు చెందిన ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## స్టంట్ డ్రైవర్లకు పోలీసుల కౌన్సిలింగ్

**హైదరాబాద్ :** గత కొన్ని రొజుల క్రితం జూ పార్కు నుండి అరాం ఘర్ ఫ్లై ఓవర్ బ్రిడ్జి పై మూడు వాహనాల పై ఆరుమంది స్టంట్స్ చేస్తున్న విడియో వైరల్ గా మారింది. యువత అమూల్యమైన జీవితాన్ని పొకిరి చేష్టలతొ, రీల్స్ తీసి, పైశాచిక ఆనందం పొందుతున్నారు.. మంచి కి చెడుకి మధ్య తేడా ఏమిటొ తెలుసుకొలేని విధంగా కాలాన్ని గడుపుతున్నారు. వృద్ధాప్యంలొ తమకు అండగా నిలుస్తాడు, మాకు బాధ లేకుండ చూస్తాడు అంటు ఎన్నొ ఆశలతొ తల్లిదండ్రులు తిండి పెట్టి పొషిస్తారు... కాని ఈ మైనర్లు తల్లిదండ్రుల ఆశలను అడియాషలు చేస్తున్నారు. కొన్ని నెలల క్రితం ముగ్గురు మైనర్లు అతి స్పీడుగా వాహనం నడుపుతు డివైడరును ఢీ కొని మృతి చెందారు. ఆ సమంలొ పాతబస్తిలొ మొత్తము విషాధఛాయలు అలుముకున్నాయి. ఇలాంటి ఘటనలు పునరావృత్తం కాకుండ ఉండటానికి మొన్న ఈ బ్రిడ్జి పైనే స్టంట్స్ చేసిన ఆరు మందిని వారి తల్లిదండ్రుల సమక్షంలొ బహదూర్ పురా పొలిసులు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ కుర్రాళ్లు మళ్లీ ఎప్పుడు ఇలాంటి స్టంట్స్ చేయమని తెలిపారు.

## గ్రేటర్ హైదరాబాద్ ప్రజా సమస్యలపై సెక్రటేరియట్ వద్ద బిజేపి నిరసన

**చేవెళ్ల పర్యటనలో ఉన్న సమయంలో మొయినాబాద్ వద్ద రాంచందర్ రావు పోలీసులు అరెస్ట్**

**హైదరాబాద్(మొయినాబాద్ ) ఆగష్టు 22** గ్రేటర్ హైదరాబాద్ ప్రజా సమస్యలపై సెక్రటేరియట్ వద్ద నిరసన కార్యక్రమానికి పిలుపునిచ్చిన నేపథ్యంలో, బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు గారు చేవెళ్ల పర్యటనలో ఉన్న సమయంలో మొయినాబాద్ వద్ద పోలీసులు అరెస్ట్ చేశారు.ఈ సందర్భంగా రామచంద్ర రావు మాట్లాడుతూ అక్రమ అరెస్టులతో రాష్ట్ర ప్రభుత్వం తన వైఫల్యాలను కప్పిపుచ్చుకోవాలని ప్రయత్నిస్తోందని విమర్శించారు. ప్రజా సమస్యల పరిష్కారం

## విద్యార్థి దశ నుంచి నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి

**మాజీ వింగ్ కమాండర్ సందీప్ సింగ్ జగ్గి**

**హైదరాబాద్ :** విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణతో కూడా నాయకత్వ లక్షణాలు కలిగి ఉండాలని మాజీ వింగ్ కమాండర్ సందీప్ సింగ్ జగ్గి అన్నారు. మెరీడియన్ స్కూల్లో మోడల్ యునైటెడ్ నేషన్స్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు వివిధ దేశాల ప్రతినిధులుగా వ్యవహరిస్తూ చర్చించేందుకు ఇలాంటి వేదిక ఏర్పాటు చేసుకోవడం అభినందనీయమని ఇలాంటి కార్యక్రమాల వల్ల ప్రపంచ వ్యాప్తంగా వివిధ దేశాల్లో ఏం జరుగుతుందో తెలుసుకునే అవకాశం ఉంటుందని ఆయన అన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ కరణం భవాని మాట్లాడుతూ మూడు రోజుల పాటు నిర్వహించే ఈ మోడల్ యునైటెడ్ నేషన్స్ సెషన్స్లో నగరంలోని 40 పాఠశాలల నుంచి 500 మందికి పైగా విద్యార్థులు పాల్గొంటున్నారని తెలిపారు. వీరు వివిధ దేశాల రాయబారులుగా, ప్రతినిధులు ఆయా దేశాల్లోని నిధులు, నియామకాలు, సమస్యలు, పర్యావరణ సమస్యలు, సహజ వనరులపై చర్చిస్తారని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు తొలి రోజు తమ దేశాల ఎజెండాలను ప్రవేశ పెట్టి ఒక్కో అంశంపై చర్చించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

## పాలస్తీనాకు మద్దతుగా పాతబస్తీలో శాంతి నిరసన

**హైదరాబాద్ :** పాలస్తీనాకు మద్దతుగా శుక్రవారం ప్రార్థనల తర్వాత మక్కా మసీదు వద్ద (ఎామో) స్టూడెంట్స్ ఇస్లామిక్ సంస్థ శాంతి నిరసన చేపట్టింది. భారత ప్రభుత్వం పాలస్తీనాకు మద్దతు ఇవ్వాలని మరియు ఇతర దేశాలు ఇజ్రాయెల్కు ఆయుధాలు సరఫరా చేయవద్దని వారు డిమాండ్ చేశారు

మరిన్ని వార్తా విశేషాలకై... www.viswamvoice.com

# ఎడిటర్ వాయిస్

## చంద్రయాన్ విజయోత్సవం భారతావనికి గర్వ కిరీటం

భారతదేశం శాస్త్రసాంకేతిక రంగంలో సాధించిన విజయాలలో అంతరిక్ష పరిశోధనకు ఒక ప్రత్యేక గౌరవ స్థానం ఉంది. ప్రపంచం లోని అగ్రరాజ్యాల సరసన నిలబడి, స్వంత ఉపగ్రహాలను ప్రయోగించి, చంద్రుడి వైపు దూసుకెళ్లిన భారత్, 2023 ఆగస్టు 23న ఒక అపూర్వ ఘట్టాన్ని సృష్టించింది. ఆ రోజు చంద్రయాన్-3 విజయవంతంగా చంద్రుడి దక్షిణ ధ్రువంపై దిగింది. ఇది భారత అంతరిక్ష పరిశోధన చరిత్రలో మాత్రమే కాకుండా, ప్రపంచ అంతరిక్ష చరిత్రలోనూ కొత్త అధ్యాయాన్ని ప్రారంభించిన ఘనత. ఈ సంఘటనకు గుర్తుగా భారత ప్రభుత్వం ప్రతి సంవత్సరం ఆగస్టు 23న "జాతీయ అంతరిక్ష దినోత్సవం"గా జరుపుకోవాలని నిర్ణయించింది. భారత అంతరిక్ష పరిశోధన ప్రయాణం 1962లో విక్రమ్ సారాభాయ్ దూరదృష్టితో ప్రారంభమైంది. 1975లో తొలి ఉపగ్రహం ఆర్యభటను కక్ష్యలో ప్రవేశపెట్టడం ద్వారా భారత్ అంతరిక్ష శాస్త్రంలో తన అడుగులు వేసింది. అప్పటి నుంచి ఇస్రో వందలాది ఉపగ్రహాలను ప్రయోగిస్తూ వాతావరణ అంచనాలు, టెలి కమ్యూనికేషన్, రిమోట్ సెన్సింగ్, వ్యవసాయం, విపత్తు నిర్వహణ వంటి రంగాల్లో అపారమైన సహకారం అందిస్తోంది. 2013లో మంగళ యాన్ మిషన్ విజయంతో అమెరికా, రష్యా, యూరప్ తరువాత మంగళ గ్రహాన్ని చేరుకున్న నాలుగో దేశంగా భారత్ నిలిచింది. ఈ మిషన్ కేవలం 450 కోట్ల రూపాయల వ్యయంతో పూర్తయి, ప్రపంచాన్ని ఆశ్చర్య పరిచింది. 2023లో చంద్రయాన్-3 మిషన్ ద్వారా భారత్ మరొక మైలురాయిని చేరుకుంది. అమెరికా, రష్యా, చైనా తరువాత చంద్రుడి మీద దిగిన నాలుగో దేశం భారత్. కానీ చంద్రుడి దక్షిణ ధ్రువంలో విజయవంతంగా ల్యాండింగ్ చేసిన ప్రపంచంలోనే మొదటి దేశం భారత్ కావడం ఈ విజయానికి అపూర్వతను తెచ్చింది. 3.84 లక్షల కిలోమీటర్ల దూరంలో ఉన్న చంద్రునిపై "విక్రం ల్యాండర్" క్షణాల్లో సాఫల్యంగా దిగడం, "ప్రజ్ఞాన్ రోవర్" పరిశోధనలకు శ్రీకారం చుట్టడం, చంద్రుని ఉపరితలంలో సల్ఫర్, అల్యూమినియం, కాల్షియం, ఇనుము వంటి మూలకాల జాడలు గుర్తించడం వంటి విజయాలు ప్రపంచాన్ని భారత ప్రతిభ వైపు మరల్చాయి. ఇది కేవలం 615 కోట్ల రూపాయల వ్యయంతో పూర్తవడం, అమెరికా లేదా రష్యా మిషన్ల ఖర్చుతో పోలిస్తే చాలా తక్కువ కావడం ఇస్రో సామర్థ్యానికి నిదర్శనం. ఈ విజయాన్ని గుర్తు చేసుకోవడమే కాక, దేశ భవిష్యత్తు తరాలకు ప్రేరణనివ్వడం కోసం ఆగస్టు 23న జాతీయ అంతరిక్ష దినోత్సవం జరుపుకోవడం నిర్ణయాత్మకం. ఈ దినోత్సవం శాస్త్రవేత్తల అంకితభావానికి గౌరవం మాత్రమే కాదు, దేశవ్యాప్తంగా విద్యార్థుల్లో శాస్త్రాసక్తిని పెంపొందించే అవకాశం కూడా. పాఠశాలలు, కళాశాలల్లో శాస్త్ర ప్రదర్శనలు, వ్యాసరచన పోటీలు, ఖగోళ పరిశీలన కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా యువతకు పరిశోధనా తపన కలిగించవచ్చు.అంతరిక్ష సాంకేతికత కేవలం శాస్త్ర ప్రగతికే పరిమితం కాదుబీ అది సామాజిక-ఆర్థిక అభివృద్ధికి మూల స్తంభం. ఉపగ్రహాల సహాయంతో గ్రామీణ ప్రాంతాల్లో టెలి మెడిసిన్, ఆన్‌లైన్ విద్య, వాతావరణ హెచ్చరికలు అందుబాటులోకి వచ్చాయి. వ్యవసాయ రంగంలో రిమోట్ సెన్సింగ్ ద్వారా పంటల స్థితి, నీటి వనరుల వినియోగం సమర్థవంతంగా జరుగుతోంది.




ఎడిటర్ : కె. సునీల్‌కుమార్

# ఆంధ్రులకు గర్వకారణం 'ఆంధ్రకేసరి'



టంగుటూరి ప్రకాశం పంతులు సుప్రసిద్ధ స్వాతంత్ర్య సమర యోధులు, ఆంధ్ర రాష్ట్రానికి మొదటి ముఖ్యమంత్రి. నిరుపేద కుటుంబంలో పుట్టి, వారాలు చేసుకుంటూ చదువుకుని, ఆంధ్ర రాష్ట్ర మొదటి ముఖ్యమంత్రి అయిన కృషీవలుడు. 1940, 50లలోని ఆంధ్ర రాజకీయాల్లో ప్రముఖంగా వెలుగొందిన వ్యక్తుల్లో ప్రకాశం ఒకరు. మద్రాసులో సైమన్ కమిషన్ వ్యతిరేక ప్రదర్శనలో తుపాకి కెదురుగా గుండెనుంచి ఆంధ్రకేసరి అని పేరు పొందినవారు. ప్రత్యేకాంధ్ర రాష్ట్ర సాధనలో నిర్ణాయక పాత్ర పోషించారు. టంగుటూరి ప్రకాశం 1872 ఆగష్టు 23 న ఇప్పటి ప్రకాశం జిల్లా వినోద రాయుని పాలెము గ్రామంలో నియోగి బ్రాహ్మణులైన సుబ్బమ్మ, గోపాల కృష్ణయ్య దంపతులకు జన్మించారు. పదకొండో యేట తండ్రి మరణించడంతో, పిల్లలను తీసుకుని తల్లి ఒంగోలు చేరింది. ఒంగోలులో ఆమె భోజనశాల నడప వలసి వచ్చింది. ఆ రోజుల్లో ఇలాంటి వృత్తి చేసే వారిని సమాజంలో చాలా తేలికగా చూసేవారు. పూటకూళ్ళ వ్యాపారం చేసే తల్లి సంపాదన చాలక, ప్రకాశం ధనికుల ఇళ్ళల్లో వారాలకు కుదిరారు. పిన్న వయసులోనే ప్రకాశం నాటకాలు వేసేవారు. వల్లూరులో ప్రకాశం ప్రాథమిక విద్య సాగింది. అల్లరి చిల్లరి సావాసాల వల్లా, నాటకాల వ్యాపకం వల్లా, ప్రకాశానికి మెట్రిక్ పాస్ అవడం కష్టమయ్యింది. మిషను పాఠశాల ఉపాధ్యాయుడైన ఇమ్మానేని హనుమంతరావు నాయుడు చలవతో ప్రకాశం ఫీజు లేకుండా ప్రీ మెట్రిక్ లో చదివారు. నాయుడు రాజమండ్రికి నివాసం మారుస్తూ, ప్రకాశాన్ని తనతో తీసుకువెళ్ళి, అక్కడ ఎఫ్.ఏ.లో చేర్పించారు. తరువాత మద్రాసుకు పంపించి, న్యాయశాస్త్రం చదివించారు. ప్రకాశం 1890లో తన అక్క కూతురైన హనుమాయమ్మను పెళ్ళి చేసుకున్నారు. ఆ తరువాత కొద్దికాలం పాటు ఒంగోలులో న్యాయవాద వృత్తి చేసి, 1894లో మళ్ళీ రాజమండ్రి చేరారు. వృత్తిలో పేరూ, పుష్కలంగా సంపద సంపాదించారు. తన 35వ ఏట రాజమండ్రి పురపాలక సంఘానికి అధ్యక్షుడయ్యారు. అప్పట్లో ప్రకాశం సెకండ్ గ్రేడ్ ప్లీడరు. కనుక పై స్థాయి కోర్టులలో వాదించడానికి అర్హత లేదు. బారిస్టరులకు మాత్రమే ఆ అర్హత ఉండేది. ఒకసారి ప్రకాశం ప్రతిభ గమనించిన ఒక బారిస్టరు ప్రకాశాన్ని కూడా బారిస్టరు అవమని ప్రోత్సహించారు. ఆ సలహా నచ్చి, ప్రకాశం 1904లో సాంప్రదాయాలను పక్కనపెట్టి, ఇంగ్లాండు వెళ్ళారు. వెళ్ళే ముందు మహాత్మా గాంధీ లాగానే మద్యం, మాంసం, పొగాకు ముట్టనని తల్లికి మాట ఇచ్చి ఒప్పించారు. దీక్షగా చదివి బారిస్టరు అయ్యారు. ప్రకాశం మద్రాసు హైకోర్టులో ప్రాక్టీసు ప్రారంభించారు. అప్పట్లో మద్రాసులో ప్రసిద్ధి చెందిన బారిష్టరులందరూ ఆంగ్లేయులు లేదా తమిళులు. పేరుపొందిన తెలుగు బారిష్టరులలో ఈయనే ప్రప్రథముడు. ప్రకాశం జాతీయోద్యమం పట్ల ఆకర్షితులయ్యారు. అప్పటికి ఇంకా భారత రాజకీయ రంగంలో గాంధీజీ ప్రవేశించనే లేదు. ప్రకాశం సత్యాగ్రహోద్యమంలో ముమ్మరంగా పాల్గొన్నారు. పలుమార్లు జైలుకు వెళ్లారు. గాంధీజీని సైతం లెక్క చేయని ఆంధ్ర నాయకులలో మొదటి వారు ప్రకాశం. 1908లో ప్రముఖ జాతీయ నాయకుడు బిపిన్ చంద్రపాల్ మద్రాసుకు వచ్చారు. ఆయన సభకు అధ్యక్షత వహించుటకు ప్రముఖులు భయ పడ్డారు. పిడుగులు కురిసినట్లు, వడగండ్ల వానలా చేసిన, బిపిన్ పాల్ గంభీరోపన్యాసం మద్రాసు ప్రజల్లో నూతన చైతన్యం కల్గించింది. ఆనాటి నుండి ప్రకాశం తన జీవితాన్ని దేశసేవకు అంకితం చేశారు. జాతీయ భావాలను ప్రచారం చేయటానికి మద్రాసులో 'స్వరాజ్య' పత్రికను 1921 అక్టోబర్ 29న దినపత్రికగా ప్రారంభించారు. ఖాసా సుబ్బారావు, కోటంరాజు పున్నయ్య, జి.వి. కృపానిధి మున్నగు గొప్ప పాత్రికేయులు 'స్వరాజ్య' లో పని చేశారు."స్వరాజ్య" పన్నెండేళ్ళు నడిచింది. లక్షల్లో అప్పులు చేశారు ప్రకాశం. తన బంగళాలను అమ్మి అప్పులు తీర్చారు. ప్రభుత్వాన్ని నిశితంగా విమర్శించే వారాయన. "గాలితో నైనా పోట్లాడే స్వభావం కలవాడు ప్రకాశం"అన్నారు అయ్యదేవర కాళేశ్వరరావు. 1929లో సైమన్ కమీషన్ మద్రాసుకు వచ్చింది. మద్రాసులో అతనిని బహిష్కరించటం వద్దన్నారు గాంధీజీ. గాంధీగారి ఆదేశం ప్రకాశంగారికి నచ్చలేదు. రాజాజీ తప్పుకున్నారు. ప్రకాశం పంతులు, దుర్గాబాయ్, రంగయ్య నాయుడు, వేలాది ప్రజలతో వూరేగింపు వెళ్తూ 'సైమన్ గోబ్యాక్' అని గర్జించారు. బ్రిటీష్ తొత్తులైన సైనికులు తుపాకులతో కాలుస్తాం అని కేకలు వేశారు. ఒక అజ్ఞాత దేశభక్తుడు తుపాకి గుళ్లకు బలి అయ్యాడన్న వార్త దావానలంలా వ్యాపించింది. ప్రకాశం సింహంలా ముందు కురికారు. చొక్కా గుండీలు విప్పి"రండిరా యిదె కాల్చు కొండిరా"అని గుండె చూపిన వేళ...తుపాకులు తలలు వంచాయి. అంతటితో ప్రకాశం పేరు దేశమంతటా మార్మోగింది. 1937లో కాంగ్రెసు అధికారం లోకి వచ్చినపుడు, రాజాజీ మంత్రి వర్గంలో ఆయన రెవిన్యూ మంత్రిగా ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. 1945లో జైలు నుండి విడుదలైన తర్వాత రాష్ట్రమంతటా పర్యటించారు. 1946లో మద్రాసు రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఎన్నికై, 13 నెలలపాటు ఆ పదవిలో కొనసాగారు. ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టారు. స్వంత పార్టీలోని అంతర్గత రాజకీయాలకు ఆయన ప్రభుత్వం బలయ్యాక, పార్టీ నుండి బయటకు వచ్చి, స్వంతంగా ప్రజాపార్టీని స్థాపించారు.సామాన్య ప్రజల సంక్షేమార్థమై ప్రకాశం, తన వ్యక్తిగత భద్రతను, జవహర్ లాల్ నెహ్రూ చేసిన హెచ్చరికలనూ, లెక్కచేయకుండా 1948లో నిజాం పాలనలో ఉన్న హైదరాబాదు రాష్ట్రాన్ని సందర్శించారు. నిజాం సహాయ సహకారాలతో సామాన్య ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్న రజాకార్ల నాయకుడు ఖాసిం రిజ్వీని కలిసి, రిజ్వీ తన అదృష్టాన్ని చాలా దూరం లాగుతున్నాడని హెచ్చరిక చేశారు. ప్రకాశం ధైర్యానికి మెచ్చుకోలుగా రజాకార్లు ఆయనకు గౌరవ వందనం సమర్పించారు. 1953 అక్టోబర్ 1 న ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం ఏర్పడినప్పుడు దానికి తొలి ముఖ్యమంత్రిగా ప్రకాశం నియమితులు అయినారు. రాష్ట్రావతరణ మొదటి వార్షికోత్సవ సమయంలో 2000 మంది ఖైదీలకు క్షమాభిక్ష, తిరుపతిలో శ్రీ వేంకటేశ్వర విశ్వ విద్యాలయం స్థాపన, సేద్యపు నీటి ప్రాజెక్టుల నిర్మాణం, విజయవాడ వద్ద కృష్ణా నదిపై బారేజి నిర్మాణం వీటిలో ప్రముఖమైనవి. ప్రకాశం లక్షలార్జించినా, చివరికి ఏమీ దాచుకోలేదు. చరమ దశలో రాష్ట్ర ప్రభుత్వం ప్రకాశంకు నెలకు రు.750/- గౌరవభృతి సొంత వాడకానికి ఒక కారు ఇచ్చింది. దానిలో పెట్రోల్ పోయించు కోలేని దయనీయ స్థితి ఆయనది. ఆంధ్రజాతికి తిరుగులేని నాయకుడుగా వెలిగిన ప్రకాశం తెలుగు ప్రజల హృదయాలలో సుస్థిర స్థానాన్ని పొంది, 1957 మే నెల 20వ

# తొలి తెలుగు క్రైస్తవ కవి



ఆంధ్రక్రైస్తవ సంకీర్తనా పితా మహులు, తెలుగు క్రైస్తవ సంఘ పితామహుడు అని పిలువబడే కవిశేఖరుడు చౌదరి పురుషోత్తం పేరు వినని, ఆయన పాట గానం చేయని తెలుగు క్రైస్తవులు ఉండరంటే అతిశయోక్తి కాదేమో. ప్రముఖ వాగ్గేకారుల, ముఖ్యంగా త్యాగ రాయ కృతులతో గేయకవిత శిఖరాయమాన ప్రాభవాన్ని సంతరించుకొన్న 19వ శతాబ్దిలో, హిందూ దేవుళ్ళనే కీర్తించేందుకు కృతులుగాని, కీర్తనలు గాని కోకొల్లలుగా జన బాహుళ్యానికి అందుబాటులోకి వచ్చిన తరుణంలో 19వ శతాబ్ది పూర్వార్థం లోనే మొట్ట మొదటి సారిగా అన్య మతానికి చెందిన దేవుని కీర్తించేందుకు కీర్తనలను రచించిన కవి పురుషోత్తమ చౌదరి. 19వ శతాబ్దిలో క్రైస్తవ మతాన్ని స్వీకరించి, మనసా, వాచా, కర్మణా, క్రైస్తవ మత ప్రచారా ర్థం రచనలు చేసిన తొలి తెలుగు క్రైస్తవ కవి పురుషో త్తమ చౌదరి. అనేక క్రైస్తవ పద్య కృతులను, కీర్తనలను రచించి ఆంధ్ర క్రైస్తవ సార్వభౌముడు'గా ఖ్యాతి నొందారు. పురుషోత్తం చౌదరి (సెప్టెంబరు 5, 1803 - ఆగష్టు 23, 1890) తెలుగు క్రైస్తవ పదకవితా పితామహుడు. తొలి తెలుగు క్రైస్తవ వాగ్గేయకారులు. సి.పి. బ్రౌన్, త్యాగరాజుకు సమకాలి కులు. తాను రాసిన కీర్తనలను స్వయంగా గానం చేస్తూ ప్రజా బాహుళ్యానికి అందించారు. శ్రీకాకుళం జిల్లా తెంబూరు (పాతపట్నం) శివారు మదనా పురం (తెంబూరు (పాతపట్నం) లో 1803, సెప్టెంబరు 5 న బెంగాలీ బ్రాహ్మణ కుటుంబానికి చెందిన సుభద్రాదేవి, కూర్మా నాథ చౌదరి దంపతులకు జన్మించారు. తల్లి వీరి పూర్వీకులు పశ్చిమ బెంగాలు నుండి ఒరిస్సా ప్రాంతానికి వచ్చి స్థిరపడిన బెంగాల్ బ్రాహ్మణులు. తమ మతాచారాల ప్రకారం పురుషోత్తమ చౌదరికి ఏడు సంవత్సరాలప్పుడే ఉపనయన సంస్కారం జరిపి, గాయత్రీ మంత్రాన్ని ఉపదేశించారు. పురుషోత్తం చౌదరి బాల్యం నుండే మతనిష్ట కలిగి ఉండేవారు. నిరంతర విగ్రహారాధన, తీర్థ యాత్రలతో పాటు భుజాలపై వైష్ణవ మత సూచకాలైన శంఖు చక్రాల్ని కూడ కాల్పించు కొన్నారు. 1823 లో తన మేనమామ కుమార్తె యైన రాధామణి దేవిని వివాహం చేసికొన్నారు. సంస్కృతం, ఒరియా, తెలుగు భాషల్లో ప్రావీణ్యతను సంపాదించి, 20 సంవత్సరాలకే కవిత్వం రాయడం ఆరంభిం చారు. క్రైస్తవ్యాన్ని స్వీకరించక మునుపు చాలా హిందూ మత సంబంధిత భక్తి రచనల్ని చేశారు. ఆయన తన అన్న గారి పాఠశాలలో పనిచేస్తుండే వారు. అప్పుడే క్రైస్తవ్యం పట్ల ఆసక్తి కలిగి, దాని గురించి తెలుసు కోవాలనే తపనతో అన్వేషిం చడం మొదలు పెట్టారు. అదే సమయంలో ఆధునిక ప్రేషిత పితామహుడుగా పేరుగాంచిన విలియమ్ కేరీ తెలుగులో వ్రాసిన కరపత్రం ఒకటి పురుషోత్తంకు చేతికి అందింది. అది చదివిన పురుషోత్తంకు క్రీస్తు గురించి మరి యెక్కువగా తెలుసు కోవాలని పించింది. దైవ సంకల్పం ప్రకారం మిషనరీ హెలెన్ నాట్, విలియమ్ డాసన్ మొదలైన క్రైస్తవ ప్రముఖులతో పరిచయం కలిగటం, అప్పటికే రెవ. ప్రిచెట్ (1818) తెలుగు లో అనువదించిన నూతన నిబంధన తన చేతికందటంతో ఆయన ఆశ నెరవేరింది. పురుషోత్తం చౌదరి దాన్ని బాగా చదివారు. 1829 లో విశాఖ పట్నంలో క్రైస్తవ సాహిత్యాన్ని అధ్యయనం చేశారు. 1833 అక్టోబరు 6 వ తేదీన క్రీస్తుని అనుసరించాలని నిర్ణయించు కొన్నారు. 1833లో 'కులాచార పరీక్ష' అనే పత్రికను రాసి, కుల వ్యవస్థను ఖండించారు. 1833 అక్టోబరులో కటక్‌లో 'బాప్తిస్మం' తీసుకొని, క్రైస్తవ మత ప్రచారం ప్రారంభించారు. 18 రోజులు కాలినడకన పాటలు పాడు కుంటూ ప్రచారం చేస్తూ మద్రాసు వెళ్లారు. 1833 అక్టోబరు 6 వ తేదీన అదే రోజు తన తోటి క్రైస్తవులతో కలిసి ఆరాధిస్తూ..."మా యేసుక్రీస్తుని - మరుగు గల్గెనురా, నా యాత్మ ఘన రక్ష - నగము నెక్కెనురా"...అనే కీర్తనను పాడారు. అది తెలుగులో వెలువడిన మొట్టమొదటి క్రైస్తవ గీతం. పురుషోత్తం క్రైస్తవుడవ్వడంతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యుల నుండి ఎంతో వ్యతిరేక తను, మరెన్నో అవరోధాలను ఎదుర్కోవలసి వచ్చింది. కాని ఈ శోధనలన్నీ తనలో నిరాశను కలిగించడానికి బదులుగా తాను పొందిన రక్షణాను భవాన్ని ఇతరులకు ప్రకటించా లనే తృష్ణను పెంచాయి. 1836 ఏప్రిల్ 3 వ తేదీన ఆయన భార్య రాధామణి దేవి కూడా క్రైస్తవ్యాన్ని స్వీకరించారు. ఆ సంవత్సరమే చౌదరిని మిషనరీగా అభిషేకించారు. అనేక శ్రమలకు, తిరస్కారాలకు గురైనప్పటికీ, విశ్వాసంలో వెనుకడుగు వేయక, వేలకొలది మైళ్ళు కాలినడకను ప్రయాణిం చి, ఆంధ్ర దేశంలో అధికభాగం పర్యటిస్తూ విస్తృత సేవ చేసి, తెలుగు క్రైస్తవ సంఘ పితా మహుడయ్యారు. చౌదరి విరచిత ఆణిముత్యాల లాంటి పాటలన్నీ కేవలం భక్తిపూరిత మైనవే కాకుండా, సాహితీ సంపదతో తుల తూగు తుంటాయి. కేవలం కీర్తనల్ని మాత్రమే గాక " క్రైస్తవ నీతి ప్రకాశం, సత్య వేద సార సంగ్రహం, "కులాచార పరీక్ష" ఇత్యాది ఎన్నో గ్రంథాల్ని కూడా రచించారు. ఆయన రచనల్లో ఎక్కువగా విగ్రహారా ధనని ఖండించారు. ఆయన వ్రాసిన ప్రతి పాట స్వీయ జీవితానుభవ లోతుల్లో నుండి పెల్లుబికినదే. అందుకే అవి ఈ నాటికీ తెలుగు క్రైస్తవ సాహిత్యంలో సజీవ సంకీర్తన లుగా నిలిచి పోయాయి. 1882 లో కనుచూపు పూర్తిగా మందగించిన సమయంలో తన కుమార్తెను పిలిపించుకొని, "సకలేంద్రియములారా - చాలు మీ పనిదీరె" అనే పాటను పాడి, ఆమెచే వ్రాయించారు. చివరకు 1890, ఆగష్టు 23 న తన 87 వ యేట ప్రభువుని చేరుకొన్నారు. చౌదరి కవి ఎన్నో కీర్తనలు రచించారు. పద్య కావ్యాల రచనలలో పద్య కృతులు ఐదు లభిస్తున్నాయి. వాటిలో రెండు శతకాలు - ఒకటి 'యేసు నాయక శతకము'బీ రెండవది 'యేసు క్రీస్తు ప్రభు శతకము'. ఇక, 'పంచ చామర పన్నములు' పంచ చామర ఛందస్సులో మకుట సహితంగా యెహెరీవాను దలతున్" అన్న కీర్తనను పొందు పరిచాడు కవి. సాగిన అర్థశతి. 'పంచ రత్నములు' ఐదు సీస పద్యాల సంకలనం. క్రైస్తవ నీతి ప్రకాశము, 'సత్యవేద సార సంగ్రహము' అనేవి పద్య కావ్యాలు, వీటిలో క్రీ.శ. 1845లో వెలువడిన 'యేసు నాయక శతకము' తెలుగు శతక వ్మాయంలో మొట్ట మొదటి క్రైస్తవ శతకం. ప్రస్తుతం చౌదరి రాసిన కీర్తన వినిపించని చర్చి, క్రైస్తవుల ఇళ్లు లేవు. 1933లో చౌదరి శతజయంతి ఉత్సవాలు ఆంధ్రా - ఒరిస్సాలో ఘనంగా నిర్వహించారు. పురుషోత్తమ చౌదరి స్వహస్తాలతో శ్రీకాకుళం చిన్న బజారులోని తెలుగు బాప్తిస్టు చర్చిని దాదాపు 150 ఏళ్ల క్రితం నిర్మించారు. ఆయన భార్య శ్రీకాకుళంలోనే మరణించారు.

విశ్వం వాయిస్
అక్షరమే ఆయుధం...
తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎడిషన్

శనివారం 23 ఆగస్టు 2025
www.viswamvoice.com





## అమ్మ బ్లడ్ ఆర్గనైజేషన్‌కు దక్కిన జాతీయ సేవా పురస్కారం

**మదర్ థెరిస్సా జాతీయ సేవ పురస్కారం అందుకోనున్న తాడి రాము..**




**విశ్వం వాయిస్ న్యూస్ రావులపాలెం** ఆగస్టు 24న రావులపాలెంలో సభలో అందుకోనున్న పురస్కారం.. తూర్పు గోదావరి జిల్లా పెరవల్లి మండలం కానూరు గ్రామానికి చెందిన అమ్మ బ్లడ్ ఆర్గనైజేషన్ చైర్మన్ డా”తాడి రాము మదర్ థెరిస్సా ఎడ్యుకేషనల్ సొసైటీ జాతీయ సేవా పురస్కారం-2025 సంవత్సరమునకు గాను ఎంపికయ్యారు. ఈ అవార్డును హేమసుందర్ ఈ నెల 24 ఆదివారం రావులపాలెంలోని సి. ఆర్. సి ఫంక్షన్ హాల్లో జరిగే అవార్డుల ప్రధానోత్సవంలో ముఖ్య అతిథులచే అందుకోనున్నారు. వివిధ సామాజిక రంగాలలో సేవలు అందిస్తున్న సేవాపరులకు మదర్ థెరిస్సా ఎడ్యుకేషన్ సొసైటీ రావులపాలెం ఆధ్వర్యంలో జాతీయ సేవా పురస్కారం- 2025 ప్రముఖులచే ప్రధానం చేయనున్నట్లు ఆ సంస్థ అదినేత దిడ్ల కిషోర్ తెలియజేసారు. అందులో భాగంగా 6 దశాబ్దాలకు పైగా సమాజానికి అందిస్తున్న నిస్వార్ధ సేవలను గుర్తించి ఈ అవార్డుకు ఎంపిక చేసినట్లు డా.దిడ్ల కిషోర్ తెలిపారు.

## అమలాపురంలో ఘనంగా చిరంజీవి 70వ జన్మదిన వేడుకలు.





**అమలాపురం టౌన్ విశ్వం వాయిస్ న్యూస్** అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలో మెగాస్టార్ చిరంజీవి 70వ జన్మదిన వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. గడియార స్థంభం సెంటర్ వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనంద రావు, అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు చిరంజీవి సినీ రంగ విజయాలతో పాటు, రక్తదానం, అవయవదానం, కోవిడ్ సమయంలో చేసిన సేవలను కొనియాడారు. అమలాపురంలో చిరంజీవి పేరుతో పార్క్ ఏర్పాటు చేయనున్నట్లు జనసేన నాయకుడు నల్లా శ్రీధర్ ప్రకటించగా, ఎమ్మెల్యే సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. తరువాత అభిమానులు కేక్ కట్ చేసి, నిరుపేదలకు వస్త్రాలు, పండ్లు, స్వీట్స్ పంపిణీ చేసి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో మెగా అభిమానులు పాల్గొన్నారు.

## ఘనంగా జరిగిన మెగాస్టార్ చిరంజీవి 70 వ జన్మదిన వేడుకలు.



**అమలాపురం టౌన్ విశ్వం వాయిస్ న్యూస్** శుక్రవారం అమలాపురం గడియార స్తంభం సెంటర్ నందు మెగాస్టార్ చిరంజీవి 70వ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగినవి. ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన చిరంజీవి అభిమాన సంఘ సభ్యులు నల్లా చిట్టిబాబు, ఏడిద శ్రీను, నల్లా నాయుడు, ఆహ్వానం మేరకు కేకేసి అధికార ప్రతినిధి, పట్టణ అధ్యక్షులు వంటెద్దు బాబి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అభిమానులు బర్త్డే కేక్ ని కట్ చేసి పేదల మహిళలకు చీరలు పంపిణీ చేశారు. అనంతరం బీదలకు అన్న సమారాధన ఏర్పాటు చేయడం జరిగినది. ఈ సందర్భంగా అభిమాన సంఘ నాయకులు ఈ కార్యక్రమానికి హాజరైన బాబీని శాలువా కప్పి చిరంజీవి 70 బర్తడే షీల్డ్ ని బహికరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కుడుపూడి శ్రీనివాస్, ఏలేశ్వరపు రాధాకృష్ణ, మొల్లేటి వెంకటేశ్వరరావు , తదితరులు పాల్గొన్నారు.

## రేషన్ డిపోని ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆర్డీఓ అఖిల



**రామచంద్రపురం విశ్వం వాయిస్ న్యూస్ :-** రామచంద్రపురం పట్టణం స్థానిక ధనమ్మ గుడి సమీపంలో వున్న రేషన్ డిపోని ఆర్డీఓ అఖిల ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అఖిల రేషన్ డిపోలో వున్న పలు రికార్డులు పరిశీంచారు. అలానే వివరాలు పట్టికలో సరుకులు యొక్క వివరాలు నమోదు చేసారో లేదో అని పరిశీలించారు. ప్రజలకు ఉచిత సరుకులు సకాలంలో అందుతున్నాయో లేదో అని అఖిల ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో ఆమెతో పాటు ఎమ్మార్వో మరియు మండల సివిల్ సప్లై అధికారి పాల్గొన్నారు.

# గణేష్ ఉత్సవాలకు అనుమతులు తప్పనిసరి



**మండపేట టౌన్, విశ్వం వాయిస్ న్యూస్. :** గణేష్ ఉత్సవాలు సందర్భంగా మండపాలు నిర్వహించే ఆయా నిర్వాహకులు పోలీస్ అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని రామచంద్రపురం డీఎస్పీ రఘువీర్ విజ్ఞప్తి చేశారు. మండపాల ఏర్పాటుకు నిర్వాహకులు ఎటువంటి రుసుం చెల్లించవలసిన అవసరం లేదన్నారు. కేవలం అనుమతులు తీసుకుంటే సరిపోతుందన్నారు. ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని సింగిల్ విండో విధానం ద్వారా సులభంగా అనుమతులు మంజూరు చేస్తామన్నారు. వినాయక చవితి ఉత్సవాలు నిర్వహించే కమిటీ సభ్యులు గణేష్ ఉత్సవ్ నెట్ వెబ్ సైట్ లోకి వెళ్లి కొత్త దరఖాస్తు క్లిక్ చేయాలన్నారు. మొబైల్ నెంబర్ ఎంటర్ చేసి ఓ టి పి ద్వారా వెరిఫికేషన్ పూర్తయ్యాక దరఖాస్తు విండో ఓపెన్ అవుతుందన్నారు. దరఖాస్తుదారుని పేరు, మొబైల్ నంబర్, ఈమెయిల్ అడ్రస్, చిరునామా, అసోసియేషన్, కమిటీ సభ్యుల వివరాలు, వారి ఫోన్ నెంబర్లు వెబ్ సైట్ లో నమోదు చేయాల్సి ఉంటుందన్నారు. చవితి మండపం స్థలం, విగ్రహం ఎత్తు, మండపం ఎత్తు, నిమజ్జనం తేదీ, ఉపయోగించే వాహనాలు తదితర వివరాలు అందులో నమోదు చేయించాల్సి ఉంటుందన్నారు. దరఖాస్తు చేసుకున్న అనంతరం సంబంధిత ప్రాంగణాన్ని పోలీసులు పరిశీలించి అనుమతులు మంజూరు చేస్తారన్నారు. చవితి ఉత్సవాలను శాంతియుతంగా, ఎటువంటి అల్లర్లు, ఘర్షణలకు తావులేకుండా నిర్వహించేందుకు ప్రజలందరూ పోలీసు శాఖకు సహకరించాలని డీఎస్పీ రఘువీర్ కోరారు.జజ

## వరద ప్రభావం తగ్గే వరకు అధికారులు అప్రమత్తంగా ఉండాలి

**ఆర్డీవో మాధవి.**



**అల్లవరం విశ్వం వాయిస్ న్యూస్ ఆగస్టు 22:** వరద ప్రభావం తగ్గే వరకూ అప్రమత్తంగా ఉండాలని డిఆర్ఓ కొత్త మాధవి అధికారులను ఆదేశించారు. శుక్రవారం అల్లవరం మండల పరిధిలోని పల్లిపాలెం బోడసకుర్రు గ్రామాలలోనీ వరద ముంపు ప్రభావిత ప్రాం తాలలో పర్యటించి వరద ఎక్కువైతే సహాయక చర్యలు చేపట్టేందుకు అధికారులు సిద్ధం కావాలన్నారు.వరద తాజా పరిస్థితిపై స్థానిక అధికారులతో సమీక్షించా రు.గోదావరి వరద ప్రభావం తగ్గే వరకు అధికా రులు అంతా అప్రమత్తంగా వ్యవహరించాల ని ఆదేశించారు. వరద తాజా పరిస్థితి,పై రెవిన్యూ విద్యుత్తు, వైద్య ఆరోగ్య శాఖ, ఫిషరీస్, ఐసిడియస్, తదితర శాఖల అధికారులతో చర్చించారు 8, 9 నెలల గర్భిణీ స్త్రీలను సమీప పిహెచ్సీ, సిహెచ్సి లకు తరలించాలని, ఒక్క గర్భిణీ కూడా ఇంటి వద్ద ఉండకుండా మరొక సారి పరిశీలన చేసుకోవాల న్నారు. నివాస ప్రాంతాల్లో పర్యటించి బాధితులకు భరోసాను ఇచ్చారు. విద్యుత్తు సరఫరా, నిత్యవసరా సహాయక భద్రత చర్యల కొరకు సిబ్బందిని నియమించడం జరిగిందన్నారు .గోదావరి నదీ పరీవాహక ప్రాంతాలలోని లోతట్టు గ్రామ ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గ్రామాలలో సీజనల్ వ్యాధుల నియంత్రణ ఫీవర్ సర్వే ముమ్మరంగా సాగుతుందన్నారు.నదిలో ప్రయాణించడం, వరద నీటిలో ఈతకు వెళ్ళడం, చేపలు పట్టడం, స్నానాలకు వెళ్ళడం లాంటివి చేయ రాదనీ సూచించారు. ముంపు బారినపడిన కాజు వేలు కాలువలు దాటే ప్రయత్నం చేయరాదని సూ చించారు. ముంపు ప్రాంత వాసులకు రక్షిత మంచి నీటి సరఫరాలో సంబంధిత అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఇప్ప టికే మూడు నెలలకు సరిపడా నిత్యావసర సరుకులను ఆయా నివాస ప్రాంతాల రేషన్ దుకా ణాలలో సిద్ధంగా ఉంచామ న్నారు. పల్లి పాలెంలో రేషన్ డిపోను సందర్శించి నిల్వలను పరిశీలించారు. వరద హెచ్చరికలకు అనుగుణంగా వరద పరిస్థితి పై స్థానిక బృందాలు సహాయక చ ర్యలు చేపడతాయన్నరు.ప్రజలు ఎవరికి ఎలాంటి సహాయం కావాలన్నా, స్థానిక అధికారుల దృష్టికి తీసుకువస్తే సత్వరమే స్పందించడం జరుగు తుందని ఆమె స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ నరసింహారావు, అదనపు డి ఎం అండ్ హెచ్ ఓ సి హెచ్ వి భరత లక్ష్మి, వైద్యులు డాక్టర్ స్పందన, స్థానిక అధికారులు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## సల్మాన్ హుస్సేన్ మేకపోతు గాంభీర్యం ప్రదర్శించకుండా ఉంటే మంచిది...



**మండపేట టౌన్... విశ్వం వాయిస్ న్యూస్...** టీడీపీ నాయకులు సల్మాన్ హుస్సేన్ తన ద్వంద వైఖరి, మేకపోతు గాంభీర్యం ప్రదర్శిం చకుండా ఉంటే మంచిదని వైసిపి ఆర్టిఐ యాక్ట్ నియోజకవర్గ కన్వీనర్ 8వ వార్డ్ కౌన్సిలర్ మందపల్లి రవి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సల్మాన్ హుస్సేన్ మీడియా కి ఇచ్చిన స్టేట్మెంట్ లో వైసిపి మునిగిపోతుందని ఇచ్చారని కానీ నిజానికి మునిగిపోయేది వైసిపి పార్టీ కాదని కూటమి ప్రభుత్వమే అని అన్నారు. నిన్న గాక మొన్న మీరే సాక్ష్యాత్తు మీ నోటితోనే మీ పార్టీ వైఫల్యాలను దుయ్యబట్టారని అర్హులకు పింఛన్లు తీసేయడం మంచిది కాదని మీరే ఏడ్చి గగ్గోలు పెట్టారని దీన్ని ప్రజలు అన్నీ గమనిస్తున్నారని వాళ్ళు ఏమైనా అమాయకులు అనుకుంటున్నారా అని ఎద్దేవా చేశారు. ప్రజలు జ్ఞానులని వాళ్లకి అన్నీ తెలుసని మీ పార్టీ వైఫల్యాలను మీరే బయటపెట్టినందుకు మిమ్మల్ని మనసారా అభినందిస్తున్నాను అని అన్నారు. మీ పార్టీ అర్హులకు అన్యాయం చేస్తూ తూతూ మంత్రంగా పథకాలు అమలు చేస్తూ లేని గొప్పలు చెప్పుకుంటునారని ఒకప్పుడు షరతులు లేని పథకాలు అమలు చేస్తాం అని నేడు ప్రతి పథకంలోనూ ఏరివేత పెట్టీ తీవ్ర అన్యాయం చేస్తున్నారాని ఇందుకు మీ స్టేట్మెంట్ టే సాక్ష్యంగా పరిగణలోకి తీసుకొని మీ కూటమి నేతలు అందరూ సిగ్గు తెచ్చుకోవాలని, రాబోయే రోజుల్లో ప్రజలు వైయస్సార్ పార్టీకి పట్టం కట్టేందుకు సిద్ధంగా ఉన్నారని హితవు పలికారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన దగ్గర నుండి ప్రజలను మోసం చేసి నట్టేట ముంచిందని ఏ పథకం కూడా పూర్తిస్థాయిలో అమలు చేయలేదని ఆరకూరగా అమలు చేసి గొప్పలు చెప్పుకోవడం సరికాదని అన్నారు.

## కాకినాడ జిల్లాలో విలీనం చేస్తేనే రామచంద్రపురం నియోజక వర్గం భవిష్యత్ సాధ్యం

**అఖిల పక్ష జాయింట్ యాక్షన్ కమిటీ**




**రామచంద్రపురం నియోజకవర్గం విశ్వం వాయిస్ న్యూస్ :-** ,రామచంద్రపురం నియోజకవర్గ అఖిల పక్ష జాయింట్ యాక్షన్ కమిటీ (జె.ఏ.సీ) ఆధ్వర్యంలో గంగవరం మండల పరిషత్ కార్యాలయం ఎదుట ధర్నా జరిగింది.ప్రజల న్యాయమైన డిమాండ్ అయిన రామచంద్రపురం నియోజకవర్గాన్ని కాకినాడ జిల్లాలో విలీనం చేయాలి అని నినాదాలు చేశారు. అనంతరం రామచంద్రపురం నియోజకవర్గ అఖిల పక్ష జె.ఏ.సీ తరఫున కన్వీనర్ మాగాపు అమ్మిరాజు, కో-కన్వీనర్ బి.సిద్ధూ, సీపీఐ నాయకులు పి.రాము,జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి బుంగ రాజు,రామచంద్ర పురం నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కోట శ్రీను,విక్టర్ నంద తదితరులు మాట్లాడుతూ అమలాపురం జిల్లా కేంద్రం రామచంద్రపురం నుండి దాదాపు 60 కి.మీ. దూరంలో ఉండడం వల్ల ప్రజలు పరిపాలన,వైద్యం, విద్య,రవాణా, ఉద్యోగావకాశాల విషయంలో తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వరదలు,తుఫానులు వంటి విపత్తుల సమయంలో గోదావరి నది పొంగిపోవడం వలన రహదారులు మూసుకుపోతాయని, ప్రజలు ఆసుపత్రులకు వెళ్లడం కూడా కష్టమవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.మరోవైపు కాకినాడ జిల్లా కేంద్రం రామచంద్రపురానికి కేవలం 25 కి.మీ. దూరంలో ఉందని,అక్కడే ఆధునిక వైద్య సదుపాయాలు, విశ్వవిద్యాలయం, కళాశాలలు,ఉపాధి అవకాశాలు,పరిపాలన అందుబాటులో ఉన్నాయని వివరించారు. అందువల్ల రామచంద్రపురం కాకినాడ జిల్లాలో విలీనం అవ్వడం అత్యవసరమని జె.ఏ.సీ గట్టిగా డిమాండ్ చేసింది. గతంలో కూడా రామచంద్రపురాన్ని కాకినాడ జిల్లాలో చేర్చే ప్రతిపాదన ఉన్నప్పటికీ, 2022%-%23లో జిల్లాల పునర్విభజనలో కోనసీమ జిల్లాలో చేర్చడం ప్రజలపై జరిగిన ఘోర అన్యాయం అని పేర్కొన్నారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన జిల్లాల పునర్విభజన సబ్ కమిటీలో ఈ తప్పును సరిదిద్దుతూ రామచంద్రపురం నియోజకవర్గాన్ని కాకినాడ జిల్లాలో చేర్చాలని నాయకులు డిమాండ్ చేశారు. జె.ఏ.సీ ప్రతినిధులు గంగవరం మండల పరిషత్ అధ్యక్షురాలు పంపన నాగ మణి, ఎంపీపీలకు, గ్రామ సర్పంచ్ లకు వినతిపత్రాలు సమర్పించి, మండల పరిషత్ కౌన్సిల్‌లో తీర్మానం చేయాలని కోరారు . పంపన నాగమణి, పంపిన సుబ్బారావు బాలాంత్రం సర్పంచ్ చాగంటి సాంబశివరావు, తామరపల్లి సర్పంచ్ తోకల శ్రీనివాస్ సానుకూలంగా స్పందించారని అన్నారు. ఇప్పటికే అనేక గ్రామాలు రామచంద్రపురం కాకినాడ జిల్లాలో విలీనం కావాలని తీర్మానాలు చేశాయని, మిగతా గ్రామాలు కూడా ఈ పోరాటంలో భాగం కావాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు వెంటపల్లి భీమా శంకరం, అంబటి కృష్ణ, సీపీఐ నాయకులు శారద, జనసేన నాయకులు నల్లా వెంకటేష్, సుధాకర్, నున్న చిట్టిబాబు, జర్నలిస్టు వెంకట రమణ, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఖాన్, ఏ.ఐ.కె.ఎం.ఎస్ గంగవరం మండల నాయకులు రాజా రెడ్డి,కాశీ లెనిన్, లక్ష్మణ్, సంజయ్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ దేవతలకు చీర సారే



**విశ్వం వాయిస్ న్యూస్ రావులపాలెం :** స్థానిక రావులపాలెం మండలం పొడగట్లపల్లి గ్రామ దేవతలైన పోలేరమ్మ సోమలమ్మ లకు శ్రావణమాసం ఆఖరి శుక్రవారం ఈ విశిష్టమైన రోజున గ్రామదేవతలైన పోలేరమ్మ సోమాలమ్మ లకు ఊరి ఆడపడుచులు అందరూ ఊరి అభివృద్ధికి ప్రజలు ఆరోగ్యంగా ఉండాలని మా పిల్ల పాపలను చల్లంగా చూడమని గ్రామ దేవతలకు మొక్కుతూ గ్రామ మహిళలందరూ చీర సారే సమర్పించి భక్తిశ్రద్ధలతో అమ్మవార్లను కొలుచుకున్నారు. ఈ కార్యక్రమంలో మహిళా భక్తులు పొడగట్లపల్లి గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## పేద విద్యార్థుల కళ్ళల్లో “ఆనందం “

**డిగ్రీ కళాశాల సాధించిన అయితాబత్తుల**



**అమలాపురం టౌన్ విశ్వం వాయిస్ న్యూస్** అమలాపురం నియోజకవర్గ అభివృద్ధిలో మరో ముందడుగు పడింది. ప్రైవేట్ డిగ్రీ కళాశాలల్లో అధిక ఫీజులతో నలిగిపోతున్న పేద విద్యార్థులకు ఊరట లభించింది. అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు దశాబ్ద కాలంగా కంటున్న కలకు ప్రతి రూపం ఏర్పడింది.డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురానికి ప్రభుత్వ డిగ్రీ కళాశాల మంజూరు చేస్తూ కార్యదర్శి కోనా శశిధర్ ఉత్తర్వులు జారీ చేసారు. జి. ఒ ఎం ఎస్ 64 విడుదల చేశారు. అమలాపురానికి డిగ్రీ కళాశాల సాధించాలని ఎమ్మెల్యే ఆ నందరావు 2014 లో ప్రయత్నం చేశారు. ఆ తదుపరి మాజీ మంత్రి విశ్వరూప్ ఎటువంటి ప్రయత్నం చేయలేదు. 2024 లో ఎమ్మెల్యే అయినా నాటి నుంచి ఆనందరావు పట్టువదలకుండా ప్రయత్నం చేశారు. మంత్రి లోకేష్ కి అమలాపురంలో ఉన్న పరిస్థితులు వివరించి డిగ్రీ కళాశాల సాధనలో ఎనలేని కృషి చేశారు. ఈ కళాశాలను పేరూరు హై స్కూల్ గ్రౌండ్ లో నిర్మించనున్నారు

## అమలాపురం సుబ్బాలమ్మ దేవాలయంలో ఘనంగా జరిగిన వరలక్ష్మీ వ్రతం



**అమలాపురం టౌన్ విశ్వం వాయిస్ న్యూస్** అమలాపురం పట్టణం దేవా%శీ%గుల వీధిలో వేంచేసియున్న శ్రీ సుబ్బాలమ్మ అమ్మవారి ఆలయ ప్రాంగణంలో శ్రావణ మాస చివరి శుక్రవారం నిర్వహించిన సామూహిక వరలక్ష్మీ వ్రత కార్యక్రమంలో దాదాపు 900 మంది పాల్గొన్నారు. అర్చకులు కాల్దారి శర్మ. పర్యవేక్షణలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ ఈవో ఆర్ రఘు. ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ అప్పన వీరన్న. పెద్దిరెడ్డి సాయి పుల్లయ్య నాయుడు. యుర్రం శెట్టి మూర్తి అరిగెల చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు

## సహాయక చర్యలు అందేలా చూడండి

**డాక్టర్ పినిపే శ్రీకాంత్.**



**అల్లవరం విశ్వం వాయిస్ న్యూస్:** అమలాపురం నియోజకవర్గం అల్లవరం మండలం బోడసకుర్రు పల్లెపాలెం గ్రామం నందు వరద ప్రవాహం ఎక్కువ అవ్వడం తో శుక్రవారం నాయకులు ,కార్యకర్తలతో కలిసి గ్రామ లోటు పాట్లు పరిశీలించి అందరికి సహాయక చర్యలు సరైన సమయంకు అందేలా చూడాలని అమలాపురం నియోజకవర్గ కో ఆర్డినేటర్ డాక్టర్ పినిపే శ్రీకాంత్ ప్రభుత్వ అధికారులను హెచ్చరించారు .గ్రామం లో ఉన్న ప్రతి వ్యక్తికి మేము ఉన్నాం అనే భరోసాను శ్రీకాంత్ కల్పించారు .ఆయనతో పాటు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు, అల్లవరం మండలం ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు,, మండల పార్టీ అధ్యక్షులు కొనుకు బాపూజీ,మరియు ఎంపీటీసీ లు అలాగే వైఎస్ఆర్సిపి నాయకులు,తదితరులు పాల్గొన్నారు .

## నల్ల వెంకటేష్ జన్మదిన వేడుకలు



**రామచంద్రపురం విశ్వం వాయిస్ న్యూస్ :-** జనసేన నాయకులు నల్ల బ్రదర్స్ వెంకటేస్ జన్మదిన వేడుకలు రామచంద్రపురం పట్టణంలో జనసేన యువత ఆధ్వర్యంలో తొగరు బ్రహ్మాజీరావు, దొడ్డ దుర్గాప్రసాద్,నున్న చిట్టిబాబు,బుంగ రాజు, కోట శ్రీనివాసరావు,ఆర్డి ఖాన్ వీరన్న శెట్టి తదితరులు రాజగోపాల్ సెంటర్ లో కేక్ కట్ చేసి మిఠాయిలు పంచారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ రోజు మెగాస్టార్ జన్మదిన సందర్భంగా పలు సేవా కార్యక్రమాలతో పాటుగా నల్ల వెంకటేష్ జన్మదిన వేడుకలు కూడా ఘనంగా నిర్వహించడం ఆనందంగా ఉందని అన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కోట శ్రీనివాస్ ఆర్డి ఖాన్ వీరన్న శెట్టి,అక్కిరెడ్డి శీను,ఆకుల పెద్ద,మేడిశెట్టి జేజి బాబు, పోలిశెట్టి గుణ,పసుపులేటి శ్రీనివాసు తదితరులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.



# ఆటో కార్మికులకు అండగా జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్

**ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ,జ్యోతుల నవీన్ చేతులమీదుగా 1740 మందికి ఒక్కొక్కరికి 25 కేజీల బియ్యం పంపిణీ**





**జగ్గంపేట :విశ్వం వాయిస్ న్యూస్** కాకినాడ జిల్లా జగ్గంపేట స్థానిక గోకవరం రోడ్డులోని కాపు కళ్యాణ మండపం లో శ్రీ శక్తి ఉచిత బస్సు పథకం కారణంగా ఆటో కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని కాకినాడ జిల్లా టిడిపి అధ్యక్షులు, నియోజవర్గ అభివృద్ధి కమిటీ చైర్మన్ జ్యోతుల నవీన్ అన్నారు. జగ్గంపేట నియోజకవర్గం 4 మండలాలకు సంబంధించిన 1740 మంది ఆటో కార్మికులకు ఒక్కొక్కరికి 25 కేజీలు బియ్యం జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా జ్యోతుల నవీన్ మాట్లాడుతూ ఆటో కార్మికులకు జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నామని అందులో భాగంగా ఆటో కార్మికులకు చిరు సహాయం అందించాలని ఈ కార్యక్రమం తీసుకున్నానని అన్నారు. అదేవిధంగా ఆటో కార్మికులకు ఇన్సూరెన్స్ సౌకర్యం అందించడమే కాకుండా ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ సహకారంతో ప్రభుత్వం ద్వారా మూడు సెంట్లు ఇళ్ల స్థలం అందించడం జరుగుతుందన్నారు. ఆటో కార్మికులకు ఆటోలు నిలుపుదల చేసుకునేందుకు స్థలం, ఆఫీసు ఏర్పాటు చేసుకోవడానికి కూడా సహాయ సహకారాలు అందిస్తానన్నారు. ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ ఈరోజు జ్యోతుల నవీన్ ఇస్తున్న ఈ సాయం తాత్కాలిక ఉపశమనం అని మీకు ప్రభుత్వ ద్వారా మీ సమస్యలను పరిష్కరిస్తానని ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా మీకు సహాయం చేయడానికి సిద్ధంగా ఉన్నారని అన్నారు. జగ్గంపేట గోకవరం రోడ్డులోని మినీ ఇండస్ట్రియల్ పార్కులో అర్హులైన వారికి ఉద్యోగాలు, వ్యాపారాలు చేసుకునేందుకు అవకాశం కల్పిస్తానని నీకు ఎప్పుడు ఏ సమస్య వచ్చినా ముందుంటానని ఎమ్మెల్యే నెహ్రూ హామీ ఇచ్చారు. అనంతరం ప్రతి ఆటో వద్దకు వెళ్లి బియ్యం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జ్యోతుల అనీష్ నెహ్రూ, ఎస్వీఎస్ అప్పలరాజు, అడపా భరత్, ఆర్యవైశ్య డైరెక్టర్ కొత్త కొండబాబు, జీను మణిబాబు, పోతుల మోహనరావు, మారిశెట్టి భద్రం, వీరంరెడ్డి కాశి బాబు, పిల్ల చంటిబాబు పుష్కర ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ అడబాల భాస్కరరావు, సొసైటీ చైర్మన్ లు, క్లస్టర్ ఇన్చార్జులు, సర్పంచులు, ఎంపీటీసీలు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, రాష్ట్ర, జిల్లా, నియోజవర్గ టిడిపి నాయకులు పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు



**కాకినాడసిటీ : విశ్వం వాయిస్ న్యూస్** శ్రావణమాసం ఆఖరి శుక్రవారం సందర్భంగా స్థానిక సూర్యారావుపేటలో వేంచేసియున్న శ్రీ బాలాత్రిపురసుందరీ సమేత శ్రీ రామలింగేశ్వర స్వామి వారి ఆలయంలో మహిళలు సామూహిక వరలక్ష్మీ వ్రతాలు అత్యంత వైభవంగా భక్తిశ్రద్ధలతో ఆచరించారు. ఆలయ కమిటీ సభ్యులు, కార్యనిర్వహణాధికారి ప్రవేశ కూపన్లు ముద్రించి ముందుగానే పంపిణీ చేసినప్పటికీ కూపన్లు లేని మహిళలు కూడా వ్రతాలకు తరలిరావడంతో ఆలయం వెలుపల కొద్దిసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. కమిటీ సభ్యులు కూపన్లు గల మహిళలను ఆలయ ప్రాంగణంలోనికి అనుమతించారు.వరుస క్రమంలో వచ్చిన మహిళలు ప్రశాంత వాతావరణంలో శాస్త్రోక్తంగా వ్రతమాచరించారు.కమిటీ అధ్యక్షుడు గ్రంధి నారాయణరావు(బాబ్జి) కమిటీ సభ్యులు,కార్యనిర్వహణాధికారి వుండవిల్లి వీర్రాజు చౌదరి ఆధ్వర్యంలో మహిళలకు చీర,రవిక,రూపు, పసుపు కుంకుమ, తదితర పూజా సామగ్రి సమకూర్చారు.ప్రధాన అర్చకులు సన్నిధిరాజు సుబ్రహ్మణ్యం, విజయకుమార్ శర్మ తదితర అర్చక బృందం సంకల్పవిధి, కథాపూర్వక విధానం సోదాహరణ పూర్వకంగా వివరిస్తూ మహిళలచే వ్రత మాచరింపజేశారు.అనంతరం భక్తులకు ప్రసాద వితరణ గావించారు. ఈసందర్భంగా కమిటీ అధ్యక్షుడు బాబ్జి మాట్లాడుతూ దాతలు, దేవాదాయ శాఖ అధికారులు సహకారంతో జరిగిన ఈ కార్యక్రమంలో మహిళలు పెద్ద ఎత్తున హాజరై వ్రతమాచరించారని తెలిపారు. స్థలాభావం వలన కేవలం రెండు వేల మందికే అవకాశం కలిగిందని అన్నారు. మహిళలు సంతృప్తిగా వ్రాతమాచరించి, అమ్మవారిని దర్శించి వెళ్ళారని అన్నారు. ఇంతటి బృహత్తర కార్యక్రమంలో చిన్న చిన్న లోపాలు,పొరబాట్లు సహజమన్నారు. అందరి సహకారంతో కార్యక్రమం దిగ్విజయంగా ముగిసిందన్నారు. ఈవో చౌదరి మాట్లాడుతూ సామూహిక వ్రతాలకు భక్తులు తరలివచ్చారని, అందరి సహకారంతో సంతృప్తిగా ముగిసిందన్నారు. దర్శనాలకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకున్నామని అన్నారు. రాబోయే వినాయక చవితి, దసరా ఉత్సవాలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.ఈ కార్యక్రమం విజయవంతం చేసిన ప్రతిఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు.

# రూరల్‌కి ఇంచార్జ్‌ను నియమించండి..

**కుడుపూడి, కటకంశెట్టిని తొలగించాలంటూ కార్యకర్తల డిమాండ్....**

**కాకినాడ రూరల్ టీడీపీ విభేదాలపై కార్యకర్తల ఫిర్యాదు...**



**కాకినాడ రూరల్:విశ్వం వాయిస్ న్యూస్** కాకినాడ రూరల్ నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ కార్యకర్తల మధ్య విభేదాలు తీవ్రరూపం దాలుస్తున్నాయి. ఈ నేపథ్యంలో 49 గ్రామాల అధ్యక్షులు, కార్యదర్శులు, కార్యకర్తలు కలిసి రాజ్యసభ సభ్యులు ఎంపీ సానా సతీష్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజా దర్బార్‌లో కార్యాలయ ఇంచార్జి మేకా లక్ష్మణ్ రావు కి, పిఠాపురం ఇన్చార్జి , రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్ వి ఎస్ ఎన్ వర్మ కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా పలువురు గ్రామ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు మాట్లాడుతూ.... ఎన్నికల సమయంలో పార్టీ అధిష్టానం పిల్లి సత్యనారాయణ మూర్తిని కోఆర్డినేటర్‌గా, కటకంశెట్టి ప్రభాకర్ (బాబీ)ని కో–కోఆర్డినేటర్‌గా నియమించిందని తెలిపారు. అయితే బాబీ ఎమ్మెల్యే అభ్యర్థిత్వం కోసం కృషి చేస్తూ తన ప్రలోభాలకు ఆకర్షితులైన సుమారు పది మంది కార్యకర్తలను తనవైపు తిప్పుకోని గ్రూప్ రాజకీయాలకు తెరలేపడంతో..నియోజకవర్గంలోని 49 గ్రామాల అధ్యక్షులు, కార్యదర్శులు, ముఖ్య నేతలు అంతా కో ఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే పిల్లి సత్యనారాయణ మూర్తి అనంతలక్ష్మి దంపతులతో కలసి ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, పార్టీ కార్యక్రమాల్లో పనిచేయడం జరిగిందన్నారు. కో కో ఆర్డినేటర్ బాబి తన వద్ద ఉన్న ఆ పది మంది అనుచరులతో పిల్లి అనంతలక్ష్మి, సత్యనారాయణ మూర్తి దంపతులపై లేనిపోని ఆరోపణలు చేయించడం,కంప్లైంట్లు విభేదాలకు కారణమవుతోందన్నారు. ఇలాంటి సందర్భాల్లో మాజీ ఎమ్మెల్యే పిల్లి సత్యనారాయణ మూర్తి (సత్తిబాబు) తమను క్రమశిక్షణలో ఉంచి, ఇతర పార్టీల వద్ద తాము చులకన కాకుండా నిలిపేవారని తెలిపారు.అందువలనే తాము ఏనాడు పిల్లి సత్యనారాయణ మూర్తి మాట కాదని ఎవరిపైనా విమర్శలకు పునుకోలేదని పిల్లి దంపతులపై లేనిపోని ఆరోపణలు చేస్తూ నాయకులుగా చెలామణి అయ్యేవారు తమకు ఆ నాయకత్వం ఎవరి వలన వచ్చిందో గుర్తెరిగి మాట్లాడాలని హితవు పలికారు.

అలాగే నియోజకవర్గ పరిశీలకుడు, రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు కూడా ఈ పరిస్థితులను తనకు అనుకూలంగా మార్చుకుంటూ, వ్యక్తిగత వర్గాన్ని పెంచుకునే ప్రయత్నం చేస్తున్నారని కార్యకర్తలు ఆరోపించారు. కార్యకర్తలకు ఫోన్‌లు చేయడం, వాట్సాప్ గ్రూపులు సృష్టించడం, తానే నియోజక ఇన్‌చార్జ్ రేసులో ఉన్నట్లు చెప్పడం, కో–కోఆర్డినేటర్ బాబీకి బహిరంగ మద్దతుగా వ్యవహరించడం వంటి చర్యలు కేడర్‌లో గందరగోళం సృష్టిస్తున్నాయని వారు తెలిపారు. ఇటీవల మండల అధ్యక్షుల ఎన్నికలో కూడా పరిశీలకుడి వైఖరి బాబీకి అనుకూలంగా ఉందని, పార్టీలో లేని “సీల్డ్ కవర్” విధానం ప్రస్తావనపై తామంతా తీవ్రంగా అభ్యంతరం వ్యక్తం చేశామని, దీనిపై ఆరోజే కేంద్ర పార్టీ కార్యాలయం కి ఫిర్యాదు చేయడం జరిగిందని పేర్కొన్నారు. కాకినాడ రూరల్‌లో విభేదాలకు కారణమవుతున్న కో–కోఆర్డినేటర్ కటకంశెట్టి ప్రభాకర్ (బాబీ), పరిశీలకుడు కుడుపూడి సత్తిబాబును తప్పించాలని డిమాండ్ చేస్తూ అధిష్టానం ఇప్పటికైనా నిర్ణయం తీసుకుని నియోజకవర్గానికి ఇన్‌చార్జ్‌ను నియమించాలంటూ రాష్ట్ర పార్టీ నాయకత్వాన్ని కోరుతున్నామని కార్యకర్తలు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాలకు చెందిన గండి వెంకటేశ్వర రావు, కొండా వినాయక్,జక్కి అప్పన్న, గుబ్బల సత్య శివ లింగం,మాత లక్షణ్,కోడి సీతారామయ్య,రామసత్యనారాయణ, పంపన కన్నరావు, గొల్లపల్లి త్రిమూర్తులు,కేసుబోయిన ఏడుకొండలు, పెండెం శ్యామ్ ,గొల్లపల్లి లక్ష్మి, ఓరిపల్లి విజయ్, కమ్మ శ్రీను,మెడిశెట్టి లోవ బాబు, పట్టెం వెంకటేశ్, వాసంశెట్టి లోవరాజు, అడపా రాజు బాబు,సత్తిరాజు, కృష్ణ, ఉదయ్, రాయుడు అనిల్, త్రివేణు కుమార్, పిల్లి రాంబాబు, వెంకటేష్, పిల్లి అప్పారావు, కోట శ్రీను తదితర గ్రామ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## జగ్గంపేట మండల టిడిపి అధ్యక్షుడు జీను మణిబాబుకు రావులమ్మ తోపుడుబండ్ల చిన్న వర్తకుల సంఘం ఘన సత్కారం




**జగ్గంపేట :విశ్వం వాయిస్ న్యూస్** కాకినాడ జిల్లా జగ్గంపేట స్థానిక జెవిఆర్ అపార్ట్మెంట్ లో జగ్గంపేట మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు జీను మణిబాబుని జగ్గంపేటశ్రీ రావులమ్మ తల్లి తోపుడుబండ్ల చిన్న వర్తకుల సంక్షేమ సంఘం అధ్యక్షులు వానశెట్టి తాతాజీ, సెక్రెటరీ బొడ్డు కొండ వెంకటరమణ ఆధ్వర్యంలో మర్యాదపూర్వంగా కలిసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మా అభిమాన నాయకుడు జీను మణి బాబు మండల టిడిపి అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన శుభ సందర్భంగా ఆయనను మర్యాదపూర్వంగా కలిశామని అన్నారు. ఈ సందర్భంగా సంక్షేమ సంఘం అధ్యక్షులు తాతాజీ మాట్లాడుతూ 132 మంది సెంటర్లో చిన్న చిన్న వ్యాపారాలు చేసుకుంటూ జీవనోపాధి సాగిస్తున్నామని మాలో ఇల్లు లేని వారికి ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ గారి సహకారంతో మా అందరికీ ఇళ్ల స్థలాలు ఇప్పించాలని మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు జీను మణిబాబుని కోరమని అన్నారు. మణిబాబు మాట్లాడుతూ ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, అభివృద్ధి కమిటీ చైర్మన్ జ్యోతుల నవీన్ సాకారంతో మీ అందరి సమస్యలను పరిష్కరించి మీకు ఇళ్ల స్థలాలు ఇచ్చే విధంగా కృషి చేస్తానని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రావులమ్మ తల్లి తోపుడుబండ్ల చిన్న వర్తకుల సంక్షేమ సంఘం సభ్యులందరూ పాల్గొన్నారు.

## 31 వేల ఎకరాలకు జీవధారం

## తాళ్లూరు లిఫ్ట్ మరమ్మతులకు 52 కోట్ల నిధుల మంజూరు

**ముఖ్యమంత్రి చంద్రబాబుకు, ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూకు రైతులు చేసిన పాలాభిషేకంతో ప్రతిధ్వనించిన కృతజ్ఞత**



**జగ్గంపేట :విశ్వం వాయిస్ న్యూస్** కాకినాడ జిల్లా గండేపల్లి మండలం తాళ్లూరులో గల పుష్కర అంతర్భాగం తాళ్లూరు లిఫ్ట్ మరమ్మతులకు ప్రభుత్వం 52 కోట్ల రూపాయలు విడుదల చేసిన సందర్భంగా తాళ్లూరు లిఫ్ట్ వద్ద పుష్కర ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ అడబాల భాస్కరరావు, ఆధ్వర్యంలో రైతులతో కలిసి పాలాభిషేకం చేసి ముఖ్యమంత్రి చంద్రబాబుకు, ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూకు కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూను రైతులందరూ కలిసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ గత ఆరు సంవత్సరాలుగా పుష్కర అంతర్భాగమైన తాళ్లూరు లిఫ్ట్ సిమెంట్ పైపులు పూర్తిగా పాడై 31 వేల ఎకరాలకు సాగునీరు అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారని వైసిపి ప్రభుత్వం దీనిని పూర్తిగా నిర్లక్ష్యం చేయడంతో గత ఎన్నికల్లో చంద్రబాబు జగ్గంపేట ఎన్నికల ప్రచారానికి వచ్చినప్పుడు తాళ్లూరు లిఫ్ట్ పూర్తిస్థాయిలో మరమ్మతులు చేసేందుకు హామీ ఇవ్వాలని కోరడం ఆయన వెంటనే స్పందించి హామీ ఇచ్చిన సందర్భంలో ప్రభుత్వం ఏర్పడిన దగ్గర్నుండి ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అనేకసార్లు రాజధాని వెళ్లి ముఖ్యమంత్రిని ఇరిగేషన్ మంత్రిని అనేకసార్లు కలిసి నిధులు కోరడం తో ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందించి 52 కోట్లు శాంక్షన్ చేసి క్యాబినెట్ ఆమోదం పొందడం జరిగిందని అన్నారు. అనంతరం డి ఈ శ్రీనివాసరావు మాట్లాడుతూ తాళ్లూరు లిఫ్ట్ లో పూర్తిగా పాడైన సిమెంటు పైపులు స్థానం ఐరన్ పైపులు ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం 52 కోట్లు సాంక్షన్ చేసి క్యాబినెట్ ఆమోదం చేసిందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్వీఎస్ అప్పలరాజు, పోతుల మోహనరావు, అడప భారత్, ఆర్యవైశ్య డైరెక్టర్ కొత్త కొండబాబు, జీను మణిబాబు, మారిశెట్టి భద్రం, కందుల చిట్టిబాబు, బుర్రి సత్తిబాబు, సుంకవిల్లి రాజు, బొల్లం రెడ్డి రామకృష్ణ, పైడిపాల సూరిబాబు, రేఖ బుల్లి రాజు, అవసరాల బాలసుబ్రమణ్యం, బద్దిరెడ్డి అచ్చన్న దొర, దాపర్తి సీతారామయ్య, కురుకూరివీర వెంకట చౌదరి, యర్రం శెట్టి బాబ్జి, శిలామంతుల వీరబాబు, అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

## విశ్వంభరుడికి జన్మదిన శుభాకాంక్షలు. డాక్టర్ బొండా సూర్యారావు - జనసేన నాయకులు




**కాకినాడ రూరల్( కరప): విశ్వం వాయిస్ న్యూస్.** కరప గ్రామం మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలు ఆధ్వర్యంలో తెలుగు సినిమా చలనచిత్ర రంగంలో రారాజు పద్మవిభూషన్ మాజీ కేంద్ర మంత్రి (కొణిదెల శివవరప్రసాద్ ) మెగాస్టార్ చిరంజీవి 70వ జన్మదిన కార్యక్రమాన్ని కూటమి నాయకులు మరియు అభిమానుల మధ్య ఘనంగా జరిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కాకినాడ రూరల్ జనసేన నాయకులు జన ఆదరణ ఉన్న నేత డాక్టర్ బొండా సూర్యరావు హాజరయ్యారు. అభిమానుల సమక్షంలో కేక్ కట్ చేశారు ఆయన మీడియాతో మాట్లాడుతూ మెగాస్టార్ చిరంజీవి సినిమా రంగంలో కష్టపడి పైకి వచ్చిన మనిషి అని, ప్రజలకు సేవ చేయాలి అని రాజకీయాలలోకి కూడా వచ్చారు.రక్తదానం నేత్రదానం అనేక ప్రజా సేవలు చేశారని, ఇప్పటికీ ఆ సేవలు కొనసాగుతూనే ఉన్నాయని ఆయన చేసినటువంటి సేవలు ఎవరు ఎప్పటికీ మర్చిపోలేరని గుర్తు చేశారు. మెగాస్టార్ చిరంజీవికి 70వ జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రతి సంవత్సరం కరప గ్రామంలో చిరంజీవి జన్మదినవేడుకలు అభిమానులు సమక్షంలో జరగడం చాలా ఆనందంగా ఉందని భగవంతుడు ఆయనకు మంచి ఆరోగ్యాన్ని ఇవ్వాలని త్వరలో విడుదల కాబోతున్న విశ్వంభరుడు సినిమా సక్సెస్ అవ్వాలని తెలిపారు ఈ కార్యక్రమమును నిర్వహిస్తున్నటువంటి తాతీలును అభినందించారు. అనంతరం అక్కడ ఉన్న కొంతమంది నిరుపేదలకు నిత్యవసర వస్తువులను స్వీట్లు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో వేములవాడ సొసైటీ ప్రెసిడెంట్ దూడల నారాయుడు, కరప మండలం నీటి సంఘం అధ్యక్షులు పుణ్యమంతుల గంగ సత్యనారాయణ, దేవు వెంకన్న, జనసేన నాయకులు మెండుగోవింద్, భోగి రెడ్డి గంగాధర్, మోకన అశోక్ కుమార్, జల్ల శివ,ముత్యాలరావు, తదితరులు పాల్గొన్నారు.

## విద్యారంగ సమస్యలు పరిష్కారానికి చలో కలెక్టరేట్ జయప్రదం చేయండి....




**కాకినాడసిటీ: విశ్వం వాయిస్ న్యూస్** భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో కాకినాడ పి.ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎదుట విద్యా రంగం సమ్యసలు పరిష్కారం చేయాలనీ డిమాండ్ చేస్తూ పోస్టర్ విడుదల చేయడం జరిగింది.ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ కాకినాడ జిల్లా అధ్యక్షులు జి శ్రీకాంత్ ,జిల్లా కార్యదర్శి యం.గంగాసూరిబాబు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వ విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తున్నాయని విమర్శించారు. పేద మధ్య తరగతి విద్యార్థులకు విద్యను అందించవలసిన ప్రభుత్వాలు విద్యను అందని దక్షగా తయారు చేస్తున్నాయని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి రాకముందు విద్యారంగాన్ని అభివృద్ధి చేస్తామని చెప్పి నేడు విద్యారంగాన్ని కనీసం పట్టించుకోలేని పరిస్థితి ఉందని విమర్శించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నూతన జాతీయ విద్యా విధానం పేరు చెప్పి విద్యను మొత్తం ప్రైవేటీకరణ కేంద్రీకరణ కషాయికరణ చేస్తున్నాయని అన్నారు. ప్రభుత్వ విద్యారంగంలో ఉన్న పెండింగ్ లో ఉన్న 64 వేల కోట్ల రూపాయల ఫీజు రీయింబర్స్మెంట్లను తక్షణమే విడుదల చేయాలని, జీవో నెంబర్ 77ను రద్దుచేసి ప్రైవేట్ కాలేజీలో పీజీ చదివే విద్యార్థులకు ఫీజు రీయంబర్స్మెంట్ పథకాన్ని వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. హాస్టల్ విద్యార్థులకు మెస్ చార్జీలు 3000 రూపాయలకు పెంచి, హాస్టల్ కు శాశ్వత భవనాలు నిర్మించాలని డిమాండ్ చేశారు. ఏడేడు విద్యాసంస్థలకు గుడ్డిబంధగా ఉన్నటువంటి జీవో నెంబర్ 42 35ను రద్దుచేసి ఏడేడు కళాశాలలో చదివే పేద మధ్య తరగతి విద్యార్థులకు పార్టీ పుస్తకాలు మధ్యాహ్నం భోజనం పథకాన్ని అమలు చేయాలని, తల్లికి వందనం డబ్బులు అందరికీ ఇవ్వాలని, విద్యాసంస్థల్లో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులు భర్తీ చేయాలని, విద్యార్థులందరికీ ఉచిత బస్సు పాసులు కల్పించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో విద్యార్థులను ఐక్యం చేసి పోరాటాన్ని ఉధృతం చేస్తామని అన్నారు. కార్యక్రమంలో నగర అధ్యక్షుడు ఎ.వాసుదేవ్ ,జిల్లా కమిటీ సభ్యులుచిన్ని జైరామ్ నగర నాయకులు సత్యం, ఆదర్శ్ కార్తీక్, తేజ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా పద్మవిభూషణ్ చిరంజీవి జన్మదిన వేడుకలు....



**కాకినాడసిటీ: విశ్వం వాయిస్ న్యూస్** పద్మ విభూషణ్ డాక్టర్ చిరంజీవి జన్మదిన వేడుకలు కాకినాడలోని చాణిక్య చంద్రగుప్త థియేటర్లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. చిరంజీవి యువత జనసేన నాయకులు నల్లం శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మెగా బ్రదర్ ఎమ్మెల్సీ నాగేంద్రబాబు భార్య పద్మజ హాజరయ్యారు. ఈ సందర్భంగా పద్మజాకు జనసేన నాయకులు డీసీసీ బ్యాంక్ అధ్యక్షుడు తుమ్మల రామస్వామి (బాబు), ఆకుల వెంకటరమణ తదితరులు హాజరై పుష్పగుచ్చంతో స్వాగతం పలికారు. ఈ కార్యక్రమాన్ని చేపట్టిన నల్లం శ్రీనివాస్ అతని మిత్రులను పద్మజ అభినందించారు. అనంతరం భారీ ఎత్తున కేక్ కట్ చేసి చిరు జన్మదిన వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చిరంజీవి, పవన్ కళ్యాణ్ అభిమానులు జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

# అంగరంగ వైభవంగా కొవ్వూరు చైర్మన్ నాదేళ్ల శ్రీరామ్ చౌదరి ప్రమాణ స్వీకారం మహోత్సవం

**విశ్వం వాయిస్ న్యూస్, కొవ్వూరు** రాష్ట్రంలో రైతన్నల అభివృద్ధి సంక్షేమమే లక్ష్యంగా ఎన్డీఏ కూటమి ప్రభుత్వం పని చేస్తుందని కొవ్వూరు శాసనసభ్యులు ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు.
తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు ఏఎంసీ చైర్మన్ గా నాదెళ్ల శ్రీరామ్ చౌదరి ప్రమాణస్వీకారం అంగరంగ వైభవంగా జరిగింది. గురువారం చాగల్లు మండలం చాగల్లు నుంచి పంగిడి దొమ్మేరు మీదుగా బైక్, కార్లు, ట్రాక్టర్ల ర్యాలీతో కొవ్వూరు పట్టణంలోని పరిమి కళ్యాణమండపంలో ప్రమాణ స్వీకారం చేశారు. ముందుగా అన్న ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి సభను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ అభివృద్ధి సంక్షేమ పథకాలతో కూటమి ప్రభుత్వం సుపరిపాలన సాగిస్తుందని, పార్టీకి అండగా ఉంటూ కష్ట కాలంలో పార్టీని ఆదుకున్న వారికి ఎప్పటికీ తెలుగుదేశం పార్టీ మర్చిపోదని తెలిపారు. యువకులను ప్రోత్సహించే దిశగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని అందుకు నిదర్శనమే ఈ ఏఎంసి చైర్మన్ పదవిని అన్నారు. జగన్మోహన్ రెడ్డి రైతులను పూర్తిగా విస్మరించాడని, నిరుద్యోగులను దగా చేశాడని అన్నారు. రాబోయే పంచాయితీ మున్సిపాలిటీ జడ్పిటిసి ఎంపీటీసీ



ఎలక్షన్లలో వైసీపీకి డిపాజిట్లు కూడా రావని ఎద్దేవా చేశారు. నూతనంగా ఎన్నికైన ఏఎంసీ చైర్మన్ నాదెళ్ల శ్రీరామ్ మాట్లాడుతూ కుల మత పార్టీ బేదం లేకుండా తన కర్తవ్యాన్ని నిర్వహిస్తానని, వ్యవసాయ కమిటీ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు. తణుకు ఎమ్మెల్యే అరిమిల్లి రాధాకృష్ణ మాట్లాడుతూ మరొక 15 సంవత్సరాలు కూటమీ ప్రభుత్వం అధికారంలో ఉంటుందని, ఆంధ్రప్రదేశ్ ని అభివృద్ధి పథంలో కూటమి ప్రభుత్వం నడిపిస్తుందని, మనమందరం ఐక్యతతో ముందుకు నడవాలని తెలిపారు. ఏఎంసీ చైర్మన్ నాదెళ్ల శ్రీరాం కు కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కొవ్వూరు తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు పెండ్యాల అచ్యుతరామయ్య, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కో-ఆపరేటివ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు, ద్వి సభ్య కమిటీ సభ్యులు కంటమణి రామకృష్ణ, జొన్నలగడ్డ సుబ్బరాయ చౌదరి, కొవ్వూరు మాజీ మున్సిపల్ చైర్మన్ సూరపనేని చిన్ని, కొవ్వూరు మున్సిపల్ చైర్పర్సన్ భావన రత్నకుమారి, అర్బన్ బ్యాంక్ అధ్యక్షులు మద్దిపట్ల శివరామకృష్ణ, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు సూర్యదేవర రంజిత్ కుమార్ తూర్పుగోదావరి జిల్లా బిజెపి అధ్యక్షులు పీక్కి నాగేంద్ర, కొవ్వూరు మండలం టిడిపి అధ్యక్షులు వట్టికూటి వెంకటేశ్వర్లు, తాళ్లపూడి తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు అల్లూరి విక్రమాదిత్య, చాగల్లు టిడిపి సీనియర్ నాయకులు ఆళ్ల హరిబాబు, జనసేన మండల అధ్యక్షులు సుంకర సత్తిబాబు, జనసేన పట్టణ అధ్యక్షులు దేగల రాము, బిజెపి మండల అధ్యక్షురాలు దేగల సునీత, జనసేన తాళ్లపూడి మండల అధ్యక్షులు గంటా కృష్ణ, చాగల్లు మండల జనసేన అధ్యక్షులు ఉప్పులూరి చిరంజీవి తదితర ఎన్డీఏ కూటమి నాయకులు కార్యకర్తలు, అభిమానులు భారీ ఎత్తున పాల్గొన్నారు.

# మదర్ థెరిస్సా జాతీయ సేవా పురస్కారానికి డా. ద్వారపూడి శ్రీను ఎంపిక

- సి.సి.యమ్.ట్రస్టుకు దక్కిన జాతీయ సేవా పురస్కారం.
- ఆగస్టు 24న రావులపాలెం లో ప్రధానం

**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్:** తూర్పుగోదావరిజిల్లా రాజమండ్రి రూరల్ బుచ్చియ్యనగర్ కు చెందిన సి.సి.యమ్.ట్రస్టు ఫౌండర్ %డ% చైర్మన్ డా.ద్వారపూడి శ్రీను మదర్ థెరిస్సా ఎడ్యుకేషనల్ సొసైటీ జాతీయ సేవా పురస్కారం -2025 సంవత్సరమునకు గాను ఎంపికయ్యారు.ఈ అవార్డును అందజేస్తునట్లు మదర్ థెరిస్సా ఎడ్యుకేషన్ సొసైటీ రావులపాలెం సంస్థ అదినేత డా.దిడ్ల కిషోర్ తెలియజేసారు. ఈ నెల 24 ఆదివారం రావులపాలెంలోని సీ.ఎస్. ఆర్ ఫంక్షన్ హాల్లో జరిగే అవార్డుల ప్రధానోత్సవంలో ముఖ్య అతిథులుగా డా.బిర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్, రావిరాల మహేష్ కుమార్, ఆర్. డి.ఓ శ్రీకర్ రానున్నారు.వివిధ సామాజిక రంగాలలో సేవలు అందిస్తున్న సేవాపరులకు మదర్ థెరిస్సా ఎడ్యుకేషన్ సొసైటీ రావులపాలెం ఆధ్వర్యంలో జాతీయ సేవా పురస్కారం- 2025 ప్రముఖులచే ప్రధానం చేయనున్నట్లు ఆ సంస్థ అదినేత డా, దిడ్ల కిషోర్ తెలియజేసారు.



అందులో భాగంగా 6 దశాబ్దాలకు పైగా సమాజానికి అందిస్తున్న నిస్వార్ధ సేవలను గుర్తించి ఈ అవార్డుకు ఎంపిక చేసినట్లు డా.దిడ్ల కిషోర్ తెలిపారు. డా.ద్వారపూడి శ్రీను మాట్లాడుతూ మథర్ థెరీస్సా జాతీయ సేవా పురస్కారం 2025 సంవత్సరమునకు ఎంపిక చేసిన డా.దిడ్ల కిషోర్ గారికి కృతజ్ఞతలు తెలిపారు. మథర్ థెరీస్సా అవార్డు తీసుకోవాలనే నా కల ఈరోజు ఫలిస్తున్నందుకు చాల చాల ఆనందంగా ఉందన్నారు.

## మిధున్ రెడ్డితో రామచంద్రారెడ్డి ములాఖత్

- ఆరోగ్యంగా,ధైర్యంగానే ఉన్నాడు



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్:** రిమాండ్ లో తన కుమారుడు మిధున్ రెడ్డి ఆరోగ్యంగా,ధైర్యంగానే ఉన్నాడని మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు.శుక్రవారం తన కుమారుడు మిధున్ రెడ్డితో ములాఖత్ అయిన రామచంద్రారెడ్డి జైలు బయట మీడియాతో మాట్లాడారు.కక్ష సాధింపునకు కేరాఫ్ గా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నిలుస్తారని,దానికి ఉదాహరణ రాజమండ్రి సెంట్రల్ దగ్గర వాతావరణమేనని అన్నారు.సెంట్రల్ జైలు చుట్టూ అనవసరంగా బారికేడ్లు ఏర్పాటు చేసి హంగామా సృష్టిస్తున్నారని, గతంలో చంద్రబాబు అరెస్టు అయినప్పుడు ఇటువంటి పరిస్థితులు లేవని పేర్కొన్నారు. మిథున్ రెడ్డికి వసతులు కల్పించమని కోర్టు స్పష్టంగా చెప్పినా అమలు చేయడం లేదని,.తొందర్లోనే తన కుమారుడు నిర్దోషిగా బయటకు వస్తారని అన్నారు. రామచంద్రారెడ్డి తో పాటు మిథున్ రెడ్డి బంధువులు విటల్ రెడ్డి, రాజారెడ్డి ములాఖత్ అయ్యారు.జైలు బయట మాజీ ఎంపి మార్గాని భరత్,మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, వైసిపి యువనేత జక్కంపూడి గణేష్, న్యాయవాదులు హాసన్,దుడాల శ్రీనాథ్, కానబోయిన సాగర్, మార్తి లక్ష్మి ఉన్నారు.

## అంగన్వాడి వేతనాలు పెంచాలని మండల అధికారులకు వినతిపత్రం అందజేత

**సీతానగరం విశ్వం వాయిస్ న్యూస్** తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండల తహసిల్దార్ కార్యాలయం వద్ద వేతనాలు పెంచాలని అంగన్వాడీ సిబ్బంది నినాదాలు చేస్తూ



బ్లాక్ డే నిరసన చేపట్టి మండల తహసిల్దార్ కు ఎంపీడీవోకు వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా అంగన్వాడీ ప్రధాన కార్యదర్శి సుబ్బలక్ష్మి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 2014 నుండి అంగన్వాడీ వేతనాలు పెంచలేదని, ఇప్పుడు పని భారం పెరిగిందని 42 రోజుల చారిత్రాత్మక సమ్మె సందర్భంగా 2024 జూలైలో వేతనాలు పెంచుతామని మాట ఇచ్చారనీ, అయినా ఇంతవరకు రాష్ట్ర ప్రభుత్వం దాని గురించి పట్టించుకోలేదని అంగన్వాడీ సెంటర్లో నిర్వహణకు ఇచ్చిన ఫోన్లు పనిచేయడం లేదని, అంగన్వాడీ టీచర్లు అనేక ఇబ్బందులు పడుతున్నారని సరుకులు కూడా ఒకసారిగా రావడం లేదని ప్రస్తుతం అధికారంలో ఉన్న ప్రభుత్వం తక్షణం అమలు చేయాలని డిమాండ్ చేశారు. పాలకులు మారినప్పటికీ ప్రభుత్వాలు చేసుకొన్న ఒప్పందాలు మారవని పోరాడితే తప్ప సమస్యలు పరిష్కారం కావని అన్నారు. ఈ కార్యక్రమంలో అంగనవాడి ఇతరులు,కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# సమాజంలో సమస్యలపై ప్రశ్నించే పౌరులు తయారవ్వాలి

ఆర్ టి ఐ 20వసంతాల వేడుకల్లో ఏక్సిక్యూటివ్ ఇంజనీర్ తిలక్ కుమార్

**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్:** సమాజంలో సమస్యలపై ప్రశ్నించే పౌరులు తయారవ్వాలి,చట్టాన్ని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని దాని ద్వారా మంచి సమాజం ఏర్పాటు అయ్యేలా చూడాలని ఏ పి ఈ పి డి సి ఎల్ ఏక్సిక్యూటివ్ ఇంజనీర్ కె. తిలక్ కుమార్ విద్యార్థులకు సూచించారు.శుక్రవారం స్థానిక ఎస్ కె వి టి డిగ్రీ కళాశాల ఆడిటోరియంలో ఎస్ కె వి టి డిగ్రీ కళాశాల మరియు గార్డ్స్ ఫర్ ఆర్ టి ఐ సంయుక్త అధ్యర్యంలో ఆర్ టి ఐ 20 వసంతాల వేడుక జరిగింది.ఈ కార్యక్రమంలో ఏ పి ఈ పి డి సి ఎల్ ఏక్సిక్యూటివ్ ఇంజనీర్ కె. తిలక్ కుమార్, గుత్తుల మురళీధరరావు, గార్డ్స్ జాతీయ కన్వీనర్ నాగేశ్వరరావు, అడ్వొకేట్ ఉమామహేశ్వరి,గార్డ్స్ జాతీయ కన్వీనర్ ఆకుల విజయభారతి,ఎస్ కె వి టి డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ బి. వి.తిరుపణ్యం,గార్డ్స్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ పి వి బి సంజీవరావు,తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భం గా తిలక్ కుమార్ మాట్లాడుతూ రాజ్యాంగంలో ఆర్టికల్19 ప్రకారం భావ ప్రకటన స్వేచ్ఛ ప్రాకారంలో సమాజంలో జరిగే రుగ్మతను ప్రశ్నించాలని అన్నారు. ఉన్న స్వేచ్ఛను ఉపయోగించుకొని మంచి సమాజం కోసం విద్యార్థులు కృషి



చేయాలనీ సూచించారు. మరో అతిధి గుత్తుల మురళీధరరావు విద్యార్థులు తమ ప్రాంతంలో ఉన్న సమస్యలను ఆర్ టి ఐ ద్వారా వెలుగులోకి తీసుకురావచ్చని అన్నారు. గార్డ్స్ జాతీయ కన్వీనర్ నాగేశ్వరరావు మాట్లాడుతూ చట్టాన్ని ఉపయోగించి పాలనలో పాదదర్శకత తీసుకురావచ్చని మంచి సమాజ నిర్మాణంలో విద్యార్థులు పాలీ భాగస్తులు కావాలని ఆర్ టి ఐ వినియోగించడంలో సందేహాలు వస్తే సంప్రదించవచ్చని తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పిల్లి నిర్మల, డాక్టర్ వై స్వర్ణశ్రీ, కుసుమ గాంధీ,రాజ్ కుమార్,ఎం రవికృష్ణ, పద్మజ,తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకలు

- వృద్ధులకు పండ్లు, చీరలు పంపిణీ
- సంజీవిని బ్లడ్ బ్యాంక్ లో రక్తదాన
- రాజమహేంద్రవరం జనసేన పార్టీ నగర అధ్యక్షులు వై.శ్రీను

**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్:** ప్రతీ ఒక్కరూ సేవామార్గంలో నడవాలని రాజమహేంద్రవరం జనసేన పార్టీ నగర అధ్యక్షులు వై. శ్రీను పేర్కొన్నారు. మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకలను రాజమహేంద్రవరం సిటీ మెగాప్యాన్ అధ్యక్షులు కుడుపూడి వెంకట చలపతిరావు ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన ఆయన అభిమానుల హర్ష ధ్వానాలమధ్య కేక్ కట్ చేసి చిరంజీవి పుట్టినరోజును ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా అనంతరం ఆయన మాట్లాడుతూ తెలుగు చిత్రసీమలో స్వయం కృషితో ఎదిగిన వారి జాబితాలో ముందు గుర్తొచ్చే పేరు చిరంజీవి మాత్రమేనని తన నటనతో, డాన్సులతో ప్రేక్షకులను అలరించి, నటునిగా ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకొని, అందరి చేతా మెగాస్టార్ గా ముద్ర వేయించుకున్న చిరంజీవికి చిన్ననాటి నుండి అభిమానులుగా ఉన్నామన్నారు. చిత్ర పరిశ్రమ చిరంజీవికి ముందు చిరంజీవికి తర్వాత అనేక మార్పులు చేసుకున్నాయన్నారు. ప్రతీ ఒక్కరు సేవా మార్గంలో నడవాలని నడవాలనే సదుద్దేశంతో ఐ బ్యాంక్, బ్లడ్ బ్యాంక్ ద్వారా లక్షలాది మంది సేవలను వినియోగించుకుంటున్నారన్నారు.సేవాకార్యక్రమాల్లో కూడా ముందు ఉన్నవాళ్లే నా అభిమానులని మమ్మల్ని సేవామార్గం వైపు




నడిపించిన ఘనత చిరంజీవికి దక్కుతుంద న్నారు. మెగాస్టార్ చిరంజీవి అభిమానులని చెప్పుకోవడానికి మేము ఎంతో గర్వపడుతున్నా మన్నారు. గత వారం రోజులుగా మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకలను పురస్కరించుకుని పలు సేవాకార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, ఈరోజు ఉదయం సంజీవిని బ్లడ్ బ్యాంక్ నందు రక్తదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చెయ్యడం, వృద్ధులకు చీరాలు పంచి పెట్టడంతో పాటు పండ్లు వితరణ కూడా జరిగిందన్నారు. చిరంజీవి ఫ్యాన్స్ ఎక్కడికి వెళ్లినా ఒక గుర్తింపు ఉంటుందన్నారు. రాజమహేంద్రవరం సిటీ మెగాప్యాన్ అధ్యక్షులు కుడుపూడి వెంకట చలపతిరావు మాట్లాడుతూ మెగా అభిమానులు అంటే క్రమశిక్షణకు మారుపేరని, ప్రతిఒక్కరు సేవా కార్యక్రమాల్లో పాల్గొనేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జామి సత్యనారాయణ,8వ వార్డు జనసేన ఇంచార్జ్ అక్కిరెడ్డి ప్రసాద్,దాసరి గురునాధం, టి సోమశేఖర్,భాష,నాని, అదిబాబు, జగన్ తదితరులు పాల్గొన్నారు.

## కోరుకొండ ఎస్సైగా నాగార్జున.

**కోరుకొండ విశ్వం వాయస్ న్యూస్** కోరుకొండ పోలీస్ స్టేషన్ ఎస్సైగా నాగార్జున బాధ్యతలు స్వీకరించారు. శుక్రవారం కోరుకొండ ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన నాగార్జున మర్యాద పూర్వకంగా పోలీసు ఉన్నతాధికారులను కలిశారు. ఈయన రాజా నగరం పోలీస్ స్టేషన్ నుండి బదిలీపై కోరుకొండ పోలీస్ స్టేషన్ కు వచ్చారు. ఇక్కడ ఎస్సైగా పనిచేసిన నాగరాజు విఆర్ కు వెళ్లారు. బాధ్యతలు స్వీకరించిన నాగార్జునకు పోలీస్ సిబ్బంది, తదితరులు ఘనంగా స్వాగతం పలికారు.



## కొవ్వూరు ప్రభుత్వా డిగ్రీ కళాశాలలో మెగా జాబ్ మేళా

**విశ్వం వాయిస్ న్యూస్, కొవ్వూరు** నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడమే కూటమి ప్రభుత్వం లక్ష్యమని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. కొవ్వూరు పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల నందు నిర్వహించిన జాబ్ మేళాలో ఎమ్మెల్యే



ముప్పిడి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో యువతకు 20 లక్షల ఉద్యోగాలు కల్పించడమే లక్ష్యంగా ఎన్డీఏ కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని అన్నారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి జాబ్ మేళా నిర్వహించడం జరుగుతుందని, దీనిని నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. జాబ్ మేళాలో 10 కంపెనీలు పాల్గొన్నాయని,మొత్తం 67 మంది పాల్గొన్నారని 28 మంది ఎంపిక అయ్యారని తెలిపారు. అన్నారు. ఈ కార్యక్రమంలో ద్వి సభ్య కమిటీ సభ్యులు కంటమణి రామకృష్ణ, మాజీ మున్సిపల్ చైర్మన్ సూరపనేని చిన్ని, మున్సిపల్ చైర్ పర్సన్ భావన రత్నకుమారి, కళాశాల ప్రిన్సిపల్ జొన్నకూటి సునీత, టిడిపి నాయకులు సూర్యదేవర రంజిత్ కుమార్,క్లస్టర్ ఇంచార్జ్ పెనుమాక జయరాజు తదితరులు పాల్గొన్నారు.

## కొవ్వూరులో మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకలు...

**విశ్వం వాయిస్ న్యూస్, కొవ్వూరు** నటనపై మక్కువతో సినిమాల్లో నటించాలని సంకల్పంతో అలుపెరగని శ్రమతో చిన్న చిన్న పాత్రలను చేస్తూ తెలుగు విని వినిలాకాశంలో రారాజుగా కోట్లాదిమంది ప్రేక్షకాధారణ



పొందిన నటుడు మెగాస్టార్ చిరంజీవి అని కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వర రావు అన్నారు. జనసేన నాయకులు కళ్ళేపల్లి ప్రభాత్ ఆధ్వర్యంలో మెగాస్టార్ చిరంజీవి 70వ జన్మదిన వేడుకలను కొవ్వూరు పట్టణంలోని బస్టాండ్ సెంటర్ వద్ద ఉన్న అన్న క్యాంటీన్ నందు ఘనంగా నిర్వహించారు. ముందుగా భారీ కేక్ ను ఏర్పాటు చేసి మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకలను నిర్వహించారు. అనంతరం అన్న క్యాంటీన్ ద్వారా పేదలకు ఉచిత అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సామాన్య నటుడిగా సినీరంగ ప్రవేశం చేసి అసమానతమైన నటను కనుపర్చి అంచలంచెలుగా ఎదుగుతూ తెలుగు సినీ ప్రపంచంలో మెగాస్టార్ గా ఎదిగిన నటుడు మెగాస్టార్ చిరంజీవి ఎందరో యువతకు ఆదర్శమని అన్నారు. మెగాస్టార్ చిరంజీవి నటుడుగానే కాకుండా సమాజ సేవలో తనదైన గుర్తింపు తెచ్చుకున్నారన్నారు. రక్తదానం నేత్రదానం ఎందరో నిర్భగ్యులకు ఆదరణ కల్పించిన సామాజిక సేవా తత్పరుడు మెగాస్టార్ చిరంజీవి అన్నారు ఆయన పుట్టినరోజులను జరపటమే కాకుండా అభిమానులు ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కొవ్వూరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ద్వి సభ్య కమిటీ సభ్యులు కంటమణి రామకృష్ణ, సూరపనేని చిన్ని, సూర్యదేవర రంజిత్, మున్సిపల్ చైర్పర్సన్ భావన రత్నకుమారి, జనసేన పార్టీ పశ్చిమగోదావరి జిల్లా పోగ్రామ్ కమిటీ మెంబర్ కళ్లేపల్లి ప్రభాత్, బిజెపి మోర్చా నాయకులు గండ్రోతు పవన్, జనసేన పార్టీ కొవ్వూరు మండల అధ్యక్షులు కాపవరం %రాజు% చైర్మన్ సుంకర సత్తిబాబు,%వీజ% డైరెక్టర్ గంగుమళ్ల స్వామి,జనసేన పార్టీ పశ్చిమగోదావరి జిల్లా పోగ్రామ్ కమిటీ మెంబర్ మాణిక్ రెడ్డి తేజ, కొవ్వూరు జనసేన పార్టీ నాయకులు చౌటుపల్లి శివ, కొవ్వూరు మండల ప్రధాన కార్యదర్శి మైగాపుల బాలకృష్ణ, కొవ్వూరు టౌన్ నాయకులు పోలిశెట్టి శివ, కొవ్వూరు మండల సంయుక్త కార్యదర్శి బోడసింగి రాంబాబు కొవ్వూరు మండల సంయుక్త కార్యదర్శి కాపకాయల సతీష్, జెట్టి సత్యనారాయణ మరియు చిరంజీవి అభిమానులు పాల్గొన్నారు.

## రాజకీయాలలో విలువల లేని వ్యక్తి జగన్

- ఎన్డీయే అభ్యర్థికి జగన్ మద్దతు సమంజసం కాదు
- జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు డాక్టర్ టీ.కే విశ్వేశ్వరరెడ్డి ఆక్షేపణ

**రాజమహేంద్రవరం,విశ్వం వాయిస్ న్యూస్:** ఉపరాష్ట్రపతి ఎన్నిక బరిలో ఉన్న ఎన్డీయే అభ్యర్థికి జగన్ మోహన్ రెడ్డి మద్దతు ఇవ్వడం సమంజసం కాదని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు టీ.కే విశ్వేశ్వర రెడ్డి ఆక్షేపించారు. రాజకీయాలలో విలువల లేని వ్యక్తి జగన్ అని వ్యాఖ్యానించారు.ఈ మేరకు ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. జగన్ ఎన్డీఏ కూటమికి వ్యతిరేకంగా ఉండాలని, ఎందుకంటే ఎన్ డి ఏ కూటమి వారు అతనికి సంబంధించిన మిత్రులందరిపైన కేసులు పెట్టి



జైల్లో వేస్తున్నారని తెలిపారు.అయినప్పటికీ సిగ్గు లేకుండా ఎన్డీఏ నిలబెట్టిన ఉపరాష్ట్రపతి అభ్యర్థికి ఓటు వేస్తానంటున్నారని విమర్శించారు . ఇవాళ ఈ రాష్ట్రంలో ఉన్న రెడ్లు అందరూ అతనికి సపోర్ట్ చేయడానికి కారణం అతను వారి కులానికి సంబంధించిన వ్యక్తి కావడమే అని గుర్తు చేశారు.కానీ ఈయన తన కులానికి చెందిన సుదర్శన్ రెడ్డి ఉపరాష్ట్రపతిగా పోటీ చేస్తే సపోర్ట్ చేయడం లేదన్నారు. నిజంగా ఈయన ఎన్డీఏ కూటమిలో ఉండి ఉంటే మద్దతు ఇవ్వడంలో తప్పులేదని తెలిపారు. జగన్ చేస్తున్న ఈ వ్యవహారాన్ని రాష్ట్రంలో ఉన్న రెడ్డి సోదరులందరూ అర్థం చేసుకుని ఇతని నైజం తెలుసుకోవాలని కోరారు.

## మార్కెట్ యార్డ్ చైర్మన్ తనకాల దంపతులను సత్కరించిన బత్తుల.

**కోరుకొండ విశ్వం వాయిస్ న్యూస్:** రాజానగరం మార్కెట్ యార్డ్ చైర్మన్ తనకాల వెంకటరమణమ్మ నాగేశ్వరరావు దంపతులకు రాజానగరం శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ అభినందనలు తెలియజేశారు. శుక్రవారం తనకాల స్వగృహం శ్రీరంగప



ట్నంలో రాజానగరం శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ, జనసైనికులు, పలువురు ఎన్డీఏ నాయకులు రాజానగరం మార్కెట్ చైర్మన్గా నూతనంగా ఎన్నిక కాబడిన తనకాల వెంకటరమణమ్మ నాగేశ్వరరావు దంపతులకు గజమాలు వేసి సాలువతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా బత్తుల మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, రాజమహేంద్రవరం మార్కెట్ యార్డ్ చైర్మన్, జడ్పిటిసి, రాష్ట్ర రైతు విభాగం, తెదేపా రాష్ట్ర కార్యదర్శి వంటి ఎన్నో పదవులు అవలీలగా అధిరోదించిన, తనకాల దంపతుల ఆధ్వర్యంలో రాజానగరం మార్కెట్ యార్డ్ ను మరింతగా అభివృద్ధి చేస్తూ రైతులకు వెన్నుదన్నుగా నిలవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు, పలువురు ఎన్డీఏ నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## విభిన్న ప్రతిభావంతుల పెన్షన్లు వెంటనే పునరుద్ధరించాలి

**పిడిఎస్ యు రాష్ట్రప్రధాన కార్యదర్శి కిరణ్ కుమార్ డిమాండ్.**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్:** ఎన్డీఏ కూటమి ప్రభుత్వం లో అర్హులైన విభిన్న ప్రతిభావంతుల పెన్షన్లను వెంటనే పునరుద్ధించాలని పిడిఎస్ యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.కిరణ్ కుమార్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కిరణ్ కుమార్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని టీడీపీ,జనసేన, బిజెపి సంకీర్ణ ఎన్డీఏ ప్రభుత్వం అర్హులైన,విభిన్న ప్రతిభావంతులైన వికలాంగుల పెన్షన్లు తగ్గించాలని వివిధ జిల్లాల అధికారులకు ఆదేశాలు ఇవ్వడం ప్రజావిరుద్ధ చర్య అని ఆరోపించారు.రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల, శ్రామికులు మరియు అణగారిన వర్గాల అభివృద్ధి కోసం పని చేస్తామని ఒకవైపు నమ్మబల్కుతూ , వాస్తవంగా ఆచరణలో సంపన్నులు మరియు కార్పొరేట్ల,ఇండస్ట్రీల అధిపతుల ప్రయోజనాల కోసం క్విట్ ప్రోకో అంతర్గత పాలసీని అమలు చేస్తోందని విమర్శించారు. వికలాంగుల పెన్షన్లుకు కోత విధించడం క్రూరమైన చర్య అని దానిని తక్షణం ఉపసంహరించుకోవాలన్నారు. విభిన్న ప్రతిభావంతుల పెన్షన్లు ఎవరి దయాదాక్షిన్యాలతో వచ్చినవి కావని, పోరాటాల,ఉద్యమల కృషి తో విభిన్నప్రతిభావంతులైన వికలాంగులు సంపాదించుకున్న కనీస హక్కులు అని తెలిపారు. ఈ హక్కులు ప్రజా ఉద్యమాలు, ప్రజాస్వామ్య పోరాటాల ఫలితంగా అందబడ్డాయి అని గుర్తు చేశారు. పెన్షన్లను తగ్గించడం ద్వారా ప్రభుత్వం వికలాంగుల్లో అత్యధికమైన అణగారిన వర్గాలపై, నేరుగా దాడి చేస్తోందని ఆరోపించింది. ఇది వారిని ఇంకా అధిక పేదరికంలోకి నెట్టడం, చిన్న చూపు చూపడమని పేర్కొన్నారు. ఎన్డీఏ ప్రభుత్వం "సామాజిక న్యాయం", "అవసరమైన వారికి మద్దతు" అనే మాటలతో వచ్చిందని, ఒకటిన్నర ఏడాది పూర్తి కాకముందే ప్రభుత్వం నిజమైన ప్రజా వ్యతిరేక ఎజెండా బయటపడిందని విమర్శించారు. పేదల సబ్సిడీలను తగ్గిస్తూ, కాంట్రాక్టర్లు, రియల్ ఎస్టేట్ లాబీలు, కార్పొరేట్ మిత్రులకు రాయితీలు అందించడం. పన్నుల మినహాయింపులు, పెద్ద పారిశ్రామికవేత్తలకు ఉచిత సదుపాయాలు ఇవ్వడం "ఆర్థిక నియంత్రణ" పేరిట పేదలపై చేస్తున్న కుట్రపూరిత దాడిగా పేర్కొన్నారు. ఇది కేవలం సంక్షేమ సమస్య కాదని, పేద, మధ్యతరగతి ప్రజలపై భారాలు వేసి పన్నుల రూపంలో తీసుకుని, ధనవంతులకు ఇవ్వాలన్న నెయోలిబరల్ పాలసీలకు వ్యతిరేకంగా పోరాటం చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. పిల్లల చదువు, వైద్యం ఖర్చులు తీవ్రంగా ప్రతి పేద మధ్యతరగతి కుటుంబాలలో పెరిగిపోవడంతో, కార్మికులు, రైతులు, మహిళలు, యువత ఇప్పుడు నలిగిపోతున్నారని వివరించారు. ప్రభుత్వం తక్షణమే పెన్షన్లను బేశరత్తుగా పునరుద్ధరించాలి, పెంచిన పర్సంటేజీ వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. పేద, దిగువ మధ్యతరగతి అన్ని వర్గాలకు న్యాయం కల్పించాలని డిమాండ్ చేశారు.విభిన్న ప్రతిభావంతులైన వికలాంగుల హక్కుల కోసం పోరాడుతున్న సంస్థలతో కలిసి పిడిఎస్ యు పోరాటం చేస్తుందని తెలిపారు. రాష్ట్రంలో కొలువుతీరి ఉన్న ఎన్డీఏ ప్రభుత్వంలోని ప్రజా వ్యతిరేక విధానాలను తీవ్రంగా ఖండించారు.

## అవంతి నగర్ ఐరన్ బ్రిడ్జికి అన్నీ కష్టాలే

# వాహనదారులకు తీవ్ర ఇక్కట్లు





**కాకినాడ రూరల్: విశ్వం వాయిస్ న్యూస్.** తిమ్మాపురం గ్రామపంచాయతీ శివారుగా ఉన్న అవంతి నగర్ పేట కాలువ గట్టున అపార్ట్మెంట్ వాసులు సొంత నిధులతో ఏర్పాటు చేసుకున్న ఐరన్ బ్రిడ్జి రోజు రోజుకు శిథిలావస్థకు చేరు చేరుకుంది. ముఖ్యంగా వర్షాకాలంలో అటు నుంచి రమణయ్యపేట ఐశ్వర్యాంబిక గుడికి వెళ్లే వాహనదారులకు ఈ బ్రిడ్జి ఎంతో ఉపయోగకరంగా ఉండేది. ఎందుకంటే ఈ బ్రిడ్జి వైపుగా కాలనీలోని ఉద్యోగస్తులు, రిటైర్డ్ పోలీస్ ఉద్యోగులు, అక్కడ పూరిగుడిసెల్లో వున్న ప్రజలకు ఇదే దగ్గర దారి మార్గం, ఈ బ్రిడ్జి నిర్మాణ విషయంలో పాలకులు ఎంతమంది మారినా గత 15 సంవత్సరాలుగా నేటికీ ప్రభుత్వం నుంచి బ్రిడ్జి నిర్మాణానికి అనుమతుల రాకపోవడం అప్పటి అవంతి నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రజా ప్రతినిధులను ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా నేటికీ ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా ఉంది. దానికి తోడు ఇటీవల సొంత ఖర్చులతో అపార్ట్మెంట్ వాసులు వేసుకున్న ఈ బ్రిడ్జికి కన్నం పడడంతో అటుగా వెళుతున్న వాహనదారులకు తీవ్ర ఇక్కట్లు పడవలసి వస్తుంది, అంతేకాకుండా రాత్రిపూట విద్యుత్తు లైట్లు లేకపోవడం వలన ఇటుగా ప్రయాణం చేస్తే ఆదమరిస్తే అంతే సంగతి అన్నట్లుగా వుంది, ఇప్పటికైనా అభివృద్ధి పథంలో దూసుకు వెళుతున్న తిమ్మాపురం గ్రామపంచాయతీ కి సంబంధించిన ఈ బ్రిడ్జి నిర్మాణం కూటమి ప్రభుత్వంలోనైనా నిర్మిస్తే అవంతి నగర్ వాసులకు ఎంతో ఉపయోగంగా ఉంటుందని కాలనీవాసులు కోరుచున్నారు.

# జాంపేట బ్యాంకు శత వసంతాల వార్షికోత్సవాలు

- ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి
- 35 వేలమంది సభ్యులకు డివిడెండ్ ఇస్తున్నాం
- చైర్మన్ బొమ్మన జయ కుమార్ వెల్లడి




**రాజమహేంద్రవరం,విశ్వం వాయిస్ న్యూస్:** దేవాంగ ప్రముఖుడు, ప్రముఖ వస్త్ర వ్యాపారి కీ.శే.శీలా వీరభద్రుడు ఆధ్వర్యంలో 1926 ఆగస్టు 22 వ తేదీన చిన్న సహకార సంస్థగా ప్రస్థానం ప్రారంభించిన జాంపేట కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు 99 సంవత్సరాల సుదీర్ఘ సేవా చరిత్రలో 100వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న శుభ సందర్భంగా ఏడాది పాటు శత వార్షికోత్సవాలు ఘనంగా నిర్వహిం చాలని నిర్ణయించామని బ్యాంకు చైర్మన్ బొమ్మన జయకుమార్ చెప్పారు. శుక్రవారం బ్యాంకులో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ వచ్చే ఏడాది ఆగస్టు 22 వ తేదీన బ్యాంకు శత వార్షికోత్సవం ఇక్కడే నిర్వహిస్తామని ఈలోగా నెలకు ఒక బ్రాంచి లో శత వసంతాల వేడుకలు నిర్వహింస్తామని వివరించారు.ఈ సందర్భంగా ఒక సావనీరు ద్వారా తమ బ్యాంకు నూరేళ్ళ ప్రగతిని,సాధించిన విజయాలను ప్రజలకు తెలియచేస్తామని ఆయన చెప్పారు.శత వసంతాల ప్రారంభం సందర్భంగా డిపాజిట్ దారులకు ప్రతి రూ.లక్ష డిపాజిట్ కు రూ.10 వేలు చొప్పున షేరు ధనం మంజూరు చేయాలని తమ పాలకవర్గం తీర్మానం చేసినట్లు బొమ్మన జయకుమార్ తెలిపారు.ఈ విధంగా మంజూరు చేసే షేరు ధనంపై ఒక్కొక్కరికి రూ.1,50 ,000 మించ కూడదని నిర్ణయించామని ఆయన అన్నారు.ప్రస్తుతం ఉన్న 13 బ్రాంచీలు ద్వారా రూ.793బీకోట్ల వ్యాపారం జరుగుతోందని,ప్రతి సంవత్సరం బ్యాంకు లాభాలను ఆర్జిస్తూ సభ్యులకు క్రమం తప్పకుండా డివిడెండ్ చెల్లిస్తున్నామని చైర్మన్ బొమ్మన జయకుమార్ చెప్పారు. శత వసంతాల సంవత్సరం నాటికి రూ.900 కోట్ల వ్యాపారం చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని ఆయన చెప్పారు.మొబైల్ బ్యాంకింగ్ ప్రారంభించామని,అన్ని బ్రాంచీల్లో ఏటీఎం సేవలు కల్పించి వాటి ద్వారా రెండుమూడు లక్షల ఆదాయం ఆర్జించడం జరుగుతోందని కూడా ఆయన తెలిపారు.ఎన్.పి.ఎ.ని నియంత్రించి జీరో శాతం నెట్ ఎన్.పి.ఎ. సాధించామని చైర్మన్ బొమ్మన జయకుమార్ చెప్పారు డిపాజిట్లపై ఆకర్షణీయమైన వడ్డీ రేట్లు అందించి, గోల్డ్ లోన్లు, హౌసింగ్ రుణాలు,తనఖా రుణాలు మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా వడ్డీ రేట్లు సవరించి వ్యాపారాభివృద్ధి సాధించామని ఆయన చెప్పారు.విలేకరుల సమావేశంలో వైస్ చైర్మన్ రొబ్బి విజయశేఖర్, డైరెక్టర్లు ప్రసాదుల హరినాథ్, ద్వారా పార్వతి సుందరి, జామిశెట్టి గాంధీ,మహంతి లక్ష్మణరావు,జామి కృష్ణ,గుంటముక్కల సత్యనారాయణ ప్రసాదరావు,యాంద్రపు రామకృష్ణ,కనకం నాగేశ్వర రావు,బూర రామచంద్ర రావు,బీర శ్రీనివాసరావు, పల్లా వెంకటేశ్వరరావు, ఇన్చార్జి సెక్రటరీ, సీఈవో మద్దాల విజయ ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

## సేవ రత్న అవార్డు గ్రహీత పాలచర్ల నాగేంద్ర చౌదరికి జె.కొత్తూరు కనకదుర్గ ఆలయ కమిటీ ఘన సన్మానం



**జగ్గంపేట :విశ్వం వాయిస్ న్యూస్** కాకినాడ జిల్లా జగ్గంపేట మండలం జె. కొత్తూరు గ్రామ శివారు వెలసినటువంటి శ్రీ కనక దుర్గమ్మ ఆలయం వద్ద శుక్రవారం సేవరత్నా అవార్డ్ గ్రహీత హిందూ ధర్మ పరిరక్షణ సేవ సమితి రాష్ట్ర బోర్డు నెంబర్, భారతీయ ధర్మ పరిషత్ రాష్ట్ర కార్యవర్గ అధ్యక్షులు, సామాజిక సేవకులు పాలచర్ల నాగేంద్ర చౌదరి ని ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు.అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి అమ్మవారి ఆశీసులు అందించడం జరిగింది.అలాగే పాలచర్ల నాగేంద్ర చౌదరి ఇచ్చిన సలహాలు సూచనలు తీసుకుని గుడిని అభివృద్ధిని చేయడం జరుగుతుంది అన్నారు. ఈ సందర్భంగా నాగేంద్ర చౌదరి మాట్లాడుతూ కొత్తూరు కనకదుర్గ అమ్మవారు మహిమ గల అమ్మవారిని కోరిన కోరికలు సిద్ధిస్తాయని ప్రతి శుక్రవారం ఈ ఆలయం వద్ద అన్నదానం నిర్వహించడం జరుగుతుందని ఈ ఆలయ కమిటీ వారు నాకు సన్మానం చేయటం చాలా ఆనందంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో కనకదుర్గ అమ్మవారి ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా లక్ష్మీ ప్రసన్న....



**కాకినాడసిటీ: విశ్వం వాయిస్ న్యూస్** బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కాకినాడ నగరపాలక సంస్థ మాజీ కార్పొరేటర్ సాలగ్రామ లక్ష్మీ ప్రసన్న నియమితులయ్యారు. శుక్రవారం రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు పివిఎన్ మాధవ్ ఈమె పేరును ప్రకటించారు. ఈ సందర్భంగా లక్ష్మి ప్రసన్న మాట్లాడుతూ కాకినాడ నగరంలో కార్పొరేటర్గా పనిచేస్తున్న సమయంలో నగరపాల సమావేశంలో ప్రజా సమస్యలను లేవనెత్తి వాటి పరిష్కారం కోసం కృషి చేశానన్నారు. తనపై నమ్మకంతో పార్టీ రాష్ట్ర బాధ్యతలు అప్పగించినందుకు తన వంతు ఎనలేని ప్రయత్నం చేసి సమస్యలను రాష్ట్ర అధినాయకుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు తన వంతు ప్రయత్నం చేస్తానని చెప్పారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు, కార్యకర్తలు లక్ష్మీప్రసన్నకు శుభాకాంక్షలు తెలిపారు.

## జగ్గంపేటలో ఘనంగా మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకలు

**జగ్గంపేట నియోజకవర్గ జనసేన ఇంచార్జ్ తుమ్మలపల్లి రమేష్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు**



**జగ్గంపేట :విశ్వం వాయిస్ న్యూస్** కాకినాడ జిల్లా జగ్గంపేట లో జనసేన పార్టీ ఇంచార్జ్ తుమ్మలపల్లి రమేష్ ఆధ్వర్యంలో పద్మ విభూషణ్ చిరంజీవి పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా జగ్గంపేట టౌన్ లో గల స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ఆవరణలో లో మొక్కలు నాటారు. అనంతరం తుమ్మలపల్లి రమేష్ జన సైనికులతో కలిసి ప్రభుత్వ హాస్పిటల్ లో గల రోగులకు ఫ్రూట్స్ పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా తుమ్మలపల్లి రమేష్ మాట్లాడుతూ తెలుగు యువతను సేవాభావం వైపు నడిపి, సేవా కార్యక్రమాల ద్వారా అనేక మంది ప్రజలకు రక్తదానం, నేత్రదానం చేసినటువంటి సేవా ప్రదాత, చిత్ర రంగంలో తన పేరును చెరగని అక్షరాలతో లిఖించిన నట శిఖరం మెగాస్టార్ చిరంజీవి అని, వారి జన్మదినం సందర్భంగా వారి అభిమానులుగా మేము కూడా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అన్నారు.ఎన్నో కోట్ల మంది యువత హృదయాలలో జరగని ఒక చిహ్నం చిరంజీవికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రామచంద్రపురం గ్రామ సర్పంచ్ తుమ్మలపల్లి సాయి గుణ శేఖర్, రామవరం ఎంపీటీసీ దొడ్డ శ్రీను,మరిసే రామకృష్ణ,మాదారపు వీరబాబు,గోకేడ ప్రసాద్, పాఠంశెట్టి రమేష్,గంధం శ్రీను,అంకం ఓం కృష్ణ,గండికోట శ్రీను మల్ల వీర దుర్గ,తుమ్మల మనోజ్,కిలాని శివాజీ,అడబాల వీరబాబు, చిరుత తాతజీ,రేవూరి శ్రీను,గంధం వంశీ సూరబతుల వీరబాబు, పులి ప్రసాద్, జుట్టుక నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు

# సమృద్ధిగా రాష్ట్రానికి సాగు నీరు, తాగు నీరు

- బనకచర్ల ప్రాజెక్టుతో ఏపీకి ఎంతో ఉపయోగం
- పరిశ్రమలకు కూడా ప్రాజెక్ట్ ఉపయోగపడుతుంది
- కొందరు కావాలనే బనకచర్ల పై దుష్ప్రచారం చేస్తున్నారు
- రెండు రాష్ట్రాలు బాగుండాలనేది మంత్రి లోకేష్ ఆలోచన
- ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్:** బనకచర్ల ప్రాజెక్టుతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం సస్యశ్యామలం అవుతుందని, సమృద్ధిగా సాగు నీరు–తాగునీరు అందుతుందని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. ఇటీవల కురిసిన వర్షాల వల్ల గోదావరి నీటి ప్రవాహం ఉధృతంగా ఉండటంతో కూటమి నాయకులతో కలిసి శుక్రవారం ఉదయం ఆయన పుష్కరాలరేవు వద్ద నీటి ప్రవాహాన్ని పరిశీలించారు. గోదావరి నీటి మట్టం పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు గోదావరిలోకి వెళ్లకుండా తగు చర్యలు తీసుకోవాలని నగర పాలక సంస్థ,ఇరిగేషన్ అధికారులకు సూచించారు. బారికేడ్లు కట్టాలన్నారు. అనంతరం ఎమ్మెల్యే వాసు మాట్లాడుతూ తెలంగాణ నుండి వచ్చి వృథాగా సముద్రంలో కలిసిపోయే లక్షలాది క్యూసెక్కుల నీటిని ఏపీలో బనకచర్ల ప్రాజెక్టుతో వినియోగించుకోవాలని యువ మంత్రి నారా లోకేష్ ఆలోచన అని అన్నారు. బనకచర్ల ప్రాజెక్టు వల్ల ఏపీకి సాగునీరు, తాగునీరు అంది పరిశ్రమలకూ ఉపయోగ పడుతుందన్నారు. తద్వారా రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. తెలంగాణలో రాజకీయ కారణాలతో ఈ ప్రాజెక్టును వ్యతిరేకిస్తున్నారని, రెండు తెలుగు రాష్ట్రాలు బాగుండాలనేది యువ మంత్రి నారా లోకేష్ కోరిక అని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. తెలంగాణ అవసరాలకు సరిపోయి దిగువకు నీరు రాకపోతే బనకచర్ల ఖాళీగా ఉంటుందని, అందుకే ఏపీలో చేపట్టనున్న బనకచర్ల ప్రాజెక్టును వ్యతిరేకించవద్దని నారా లోకేష్ కోరుతున్నారని తెలిపారు. తెలంగాణా నుండి వచ్చే లక్షలాది క్యూసెక్కుల నీరు వృథాగా సముద్రంలో కలిసిపోతున్నప్పుడు దిగువ ఏపీలో కట్టే బనకచర్ల ప్రాజెక్టు పట్ల అభ్యంతరాలు ఎందుకని ప్రశ్నించారు. అదే విషయాన్ని మంత్రి నారా లోకేష్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా తెలియజేస్తున్నారని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ వివరించారు. ఎమ్మెల్యే వాసు వెంట కూటమి నాయకులు కాశీ నవీన్ కుమార్, వై శ్రీను, యిన్నమూరి దీపు, మాటూరి రంగారావు, శెట్టి జగదీష్, నల్లం శ్రీను, నిమ్మలపూడి గోవింద్, బుడ్డిగ రవి, సప్పా వెంకట రమణ, నల్లం ఆనంద్, వెంకన్న, కొమ్మ రమేష్, ముద్రగడ జయరామ్, విశ్వనాథరాజు,కురగంటి త్రినాధ్, జి శ్రీనివాస్, నగర పాలక సంస్థ, ఇరిగేషన్ అధికారులు ఉన్నారు.

## ప్రాజెక్టుకు సంబంధించిన వారే రహదారి మరమ్మత్తులు చేపట్టాలి

**స్థానిక కూటమి నాయకులు**



**సీతానగరం విశ్వం వాయిస్ న్యూస్:** తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలం పురుషోత్తపట్నం గ్రామంలో ప్రాజెక్టుకు సంబంధించిన కాంట్రాక్టర్లే రహదారి మరమ్మత్తులు చేపట్టాలంటూ స్థానిక టిడిపి నాయకులు, గ్రామ నాయకులు, ప్రజలు రహదారిపై ఆందోళనకు దిగారు. పురుషోత్తపట్నం నుండి సీతానగరం వరకు రహదారి చాలా అధ్వానంగా ఉంది. పురుషోత్తపట్నం నుంచి రాజమండ్రి వరకు అనేకమంది వ్యాపారులు ఉద్యోగస్తులు స్కూల్ పిల్లలు నిత్యం ప్రయాణిస్తూనే ఉంటారు. రహదారి నిర్మాణం చేపట్టకపోవడం వల్ల స్కూల్ పిల్లలు ఉద్యోగస్తులు వ్యాపారస్తులు కూలి పనికి వెళ్లేవారు చాలా ఇబ్బందులు పడుతున్నారు. బస్సులు సమయానికి రాక ప్రజలు స్కూల్ పిల్లలు చాలా ఇబ్బందులు పడుతున్నారు. అలాగే ప్రైవేట్ స్కూలు బస్సులు రహదారి సరిగ్గా లేక పురుషోత్తపట్నం మేము బస్సులు నడపలేమని అంటున్నారు. అన్ని విధాల అందరికీ చాలా ఇబ్బందులు పడే పరిస్థితి. దీనిని దృష్టిలో పెట్టుకొని స్థానిక నాయకులు మండ రాంబాబు ఆధ్వర్యంలో ప్రాజెక్ట్కు సంబంధించిన బారీ వాహనములను నిలిపివేసి ప్రాజెక్టుకు సంబంధించిన వారే రహదారికి మరమత్తులు చేపట్టాలని ఆందోళన చేపట్టారు. దీనికి సంబంధించి ప్రాజెక్టు వారు రోడ్డు మార్గాన్ని మరమ్మత్తులు చేస్తామని పనిని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కూటమి నాయకులు, గ్రామబి నాయకులు ప్రజలు, విద్యార్థులు, స్వచ్ఛందంగా పాల్గొన్నారు.

## మానవత్వం లేనిదే సమాజంలో మనిషి మనుగడ లేదు

- మానవతా ఆవిర్భావ దినోత్సవ ర్యాలీలో ఆదిత్య విద్యార్థులు



**రాజమహేంద్రవరం,విశ్వం వాయిస్ న్యూస్:** స్థానిక మానవతా సంస్థ ఆవిర్భావ దినోత్సవం ర్యాలీ లో ఆదిత్య విద్యార్థులు , బిజినెస్ స్కూలుకు చెందిన 60 మంది ఎన్ఎస్ఎస్ మరియు యూత్ రెడ్ క్రాస్ వాలంటీర్లు పాల్గొన్నారు. మానవతా సంస్థ అధ్యక్షులు మురళీకృష్ణ కోరిక మేరకు డీలక్స్ సెంటర్ నుండి కోటగుమ్మం శివుని బొమ్మ వరకు ర్యాలీ జరిగింది.ఈకార్యక్రమంలో డాక్టర్ జి.వి.ఎస్ నాగేశ్వర రావు,పట్టా విజయ్ దేవన్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్స్ శిరీష,పోలుకొండ సాయి తదితరులు పాల్గొన్నారు.డాక్టర్ జీవీఎస్ నాగేశ్వరరావు మాట్లాడుతూ మానవతకు మరో పేరు మదర్ తెరిసా అని ప్రతి వ్యక్తిపైన ప్రేమ కరుణ చూపించుతూ అవసరమైనప్పుడు తమ సహాయ సహకారాలు అందించాలని కష్టాల్లో ఉన్న వాళ్ళని ఆదుకోవాలని కరోనా సమయంలో కూడా తాను ఈ సేవా కార్యక్రమాల్లో గడపడం ఆనందకరమని ఆయన చెప్పారు.రాజమండ్రి ఆదిత్య విద్యాసంస్థల డైరెక్టర్ ఎస్పీ గంగిరెడ్డి ప్రేరణతో జరిగిన ఈ కార్యక్రమానికి డాక్టర్ బి హెచ్ వి రమాదేవి తన సహకారం అందజేశారు. మానవత్వం లేనిదే సమాజంలో మనిషి మనుగడ లేదని అటువంటి అద్భుత సంస్థకు ఈ ఆవిర్భావ దినోత్సవం రోజున తమ సహకారం చేయడం వాలంటీర్ల అదృష్టమని ఆమె ఈ సందర్భంగా తెలిపారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాంలలో పాల్గొంటున్న వాలంటీర్లను ప్రోగ్రాం ఆఫీసర్లను ప్రిన్సిపాల్స్ సిహెచ్ ఫణికుమార్, ఎస్.కె.ఎన్ రెహమాన్,చంద్రశేఖర్లు అభినందించారు.

## మండల సమస్యలకు పరిష్కారం చూపండి

**కొత్త తహసీల్దార్ ను కోరిన బీజేపీ నేత శ్రీధర్**

**జగిత్యాల :** జిల్లాలోని బుగ్గారం మండలం పరిధిలోని పలు సమస్యల సత్వర పరిష్కారం కోసం కృషి చేయాలని బుగ్గారం మండల బీజెపి అధ్యక్షులు మేడవేణి శ్రీధర్ కోరారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లిన శ్రీధర్ ఆధ్వర్యంలోని బీజెపి నేతలు మొదట కొత్త గా తహసీల్దార్ గా భాధ్యత లను చేపట్టిన నేపథ్యంలో శాలువా తో సన్మానం చేసి వినతి పత్రం అందజేశారు.

# 16 లక్షల 75 వేల విద్యార్థుల ఫీజుల బకాయిలు చెల్లించాలి

**సంక్షేమ భవన్ వద్ద విద్యార్థుల మహాధర్నా.. దద్దరిల్లి న సంక్షేమ భవన్ ..**
**8000 వేలకోట్ల స్కాలర్షిప్ ల బకాయిలు చెల్లించాలని డిమాండ్..**
**రాష్ట్రవ్యాప్త ఆందోళనలు తప్పవని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు ఆర్ కృష్ణయ్య హెచ్చరిక**

హైదరాబాద్ : 16 లక్షల 75 వేల విద్యార్థుల 8000 వేలకోట్ల స్కాలర్షిప్ ఫీజుల బకాయిలు చెల్లించాలని డిమాడ్ చేస్తూ జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు ఆర్ కృష్ణయ్య నేతృత్వం లో శుక్రవారం సంక్షేమ భవన్ వద్ద విద్యార్థుల మహాధర్నా నిర్వహించారు. .. సంక్షేమ భవన్ దద్దరిల్లి పోయింది ఈ సందర్భంగా ఆర్ కృష్ణయ్య మాట్లాడుతూ ప్రభుత్వం తన మొద్దు నిద్రని వీడకపోతే రాష్ట్రవ్యాప్త ఆందోళనలు తప్పవని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు ఆర్ కృష్ణయ్య హెచ్చరిక.నిధుల విడుదలకు అడ్డుకట్ట వేస్తూ గాల్లో దీపంగా మారిన విద్యార్థులు చదువులు.. కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లిస్తున్నారు విద్యార్థుల స్కాలర్షిప్లు చెల్లించరా? మూడు సంవత్సరాలుగా విద్యార్థుల స్కాలర్షిప్ బకాయిలు చెల్లించడం లేదుపది నెలలుగా విద్యార్థులు రోడ్డు మీద వచ్చి ఉద్యమాలు చేస్తున్న ప్రభుత్వం పట్టించుకోవడం లేదు ఆర్థిక శాఖ కాంట్రాక్టర్లు అంటే చాలా ప్రేమ ఉంది కానీ అంటే పట్టించుకోవడం లేదు... ఆర్థిక శాఖ వైఖరి మార్చుకోకపోతే తీవ్ర తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు..జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య మాట్లాడుతూ, విద్యార్థులు స్కాలర్షిప్‌లు, ఫీజు



రీయింబర్స్‌మెంట్‌లపై ఆధారపడి చదువుకుంటున్నారని, కానీ ప్రభుత్వం ఆలస్యం చేయడంతో యాజమాన్యాలు విద్యార్థులపై ఒత్తిడి తెస్తున్నాయని విమర్శించారు. దీని వల్ల విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురవుతున్నారని ఆయన తెలిపారు. ఫీజు బకాయిలను వెంటనే చెల్లించకపోతే తీవ్ర స్థాయి ఉద్యమాలకు దిగుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమణం లో -- ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# పాల బిల్లులు చెల్లించకుంటే మదర్ డైరీ ముట్టడి

**రాజాపేట పాల సంఘం చైర్మన్ సందిల భాస్కర్ గౌడ్ హెచ్చరిక**

**యాదగిరిగుట్ట :** రైతులకు మదర్ డైరీ బాకీ పడిన పాల బిల్లులను తక్షణమే చెల్లించాలని... లేని పక్షంలో మూడు రోజుల్లో మదర్ డైరీ కార్యాలయాన్ని ముట్టడిస్తామని రాజాపేట పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం చైర్మన్ సందిల భాస్కర్ గౌడ్ హెచ్చరించారు. శుక్రవారం ఆయన రాజాపేటలో మాట్లాడుతూ పెండింగ్ బిల్లుల చెల్లింపు తర్వాతనే ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో గతంలో గెలిచిన ఆరుగురు డైరెక్టర్ల కృషి శూన్యమన్నారు. సకాలంలో పాల బిల్లులు ఇప్పిస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చి ,ఆ తర్వాత నిస్సహాయులుగా మారిన డైరెక్టర్లు తమ తమ పదవులకు రాజీనామా చేయడం మంచిదన్నారు. ముఖ్యమంత్రి వద్దకు వెళ్లి పెండింగ్ పాల బిల్లులు వచ్చేలా కృషి చేయాలని డైరెక్టర్లకు సూచించారు. ప్రభుత్వం విజయ డైరీ కి ఇస్తున్న మాదిరిగా మదర్ డైరీ కి కూడా డబ్బులు సకాలంలో ఇస్తే ఈ దుస్థితి రైతులకు పట్టేది కాదన్నారు. రెండు జిల్లాలలోని ప్రభుత్వ హాస్టల్లలో మదర్ డైరీ పాలకు బదులు విజయ డైరీ పాలు వచ్చేలా ఎందుకు



చేశారని ఆయన ప్రశ్నించారు. యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానానికి ప్రతినిత్యం భారీ పరిమాణంలో నెయ్యి అవసరం పడుతుందని.. సరఫరా ఆర్డర్ కాపీ మాత్రం సాధించ లేకపోయారని సందిల భాస్కర్ గౌడ్ విమర్శించారు. ఈ మీడియా సమావేశంలో చైర్మన్ లు పోసుకొండ దశరథ, నీల బిక్షపతి, నీల రాజు, పోసు గౌండ మధు, రైతు సంఘం నాయకులు పులి చంద్రమౌళి, యామ జగదీష్, బాబు, కాకల ఐలయ్య పాల్గొన్నారు

# మర్రి ఊడలతో పొంచి ఉన్న ప్రమాదం

**-పట్టించుకోని మున్సిపల్, విద్యుత్ శాఖ అధికారులు**
**-ఏదైనా ప్రమాదం జరిగితే బాధ్యులేవరు..?**

**మంథని :** గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా గణేష్ విగ్రహాలను తరలిస్తున్నప్పుడు కొంతమంది యువకులు విషాదకరంగా హై-వోల్టేజ్ వైర్లకు తగిలి ప్రాణాలు కోల్పోయిన సంఘటన ఈ మధ్యనే హైదరాబాదులోజరిగింది. అలాంటి సంఘటనలు జరగకుండా మంథని పట్టణంలో మున్సిపాలిటీ, విద్యుత్,ఇతర శాఖల అధికారులు సమన్వయంతో చర్యలు చేపట్టాలిసిన అవసరం ఎంతైనా ఉంది. మంథని పట్టణంలోని పలు వీధుల్లో ఇలాంటి సంఘటనలు జరిగే కొన్ని ప్రదేశాలు ఉన్నాయి. వీటిని గుర్తించి అధికారులు ముందస్తుగా చర్యలు చేపట్టాలి. ముఖ్యంగా పెంజేరుకట్ట వీధిలో హనుమాన్ దేవాలయం ప్రక్కన ఒక పెద్ద మర్రిచెట్టు పెరిగి దాని కొమ్మలు రోడ్డుపైకి విస్తరించింది. కొమ్ముల నుండి దాని ఊడలు దాదాపు ఆరు అడుగుల క్రిందికి దిగి సమీపంలోని విద్యుత్ వైర్లకు దగ్గరగా ప్రమాదకరంగా వాలడంతో ప్రమాదం పొంచి ఉంది. ఆ చెట్టు క్రింద నుండి ఏదైనా ఎత్తైన వాహనం వెళితే వాటికి తగులుతున్నాయి. మనిషి నిలబడి చెయ్యి పైకి లేపిన సైతం



ఊడలు తాకుతున్నాయి. రాబోయే గణేష్ శోభాయాత్ర (ఊరేగింపు) సమయంలో ఇది తీవ్రమైన ప్రమాదాన్ని కలిగించే విధంగా ఈ ప్రాంతం ఉంది. ఈ విషయంపై అక్కడి చుట్టుపక్కల ఇండ్లవారు మున్సిపాలిటీలో ఫిర్యాదు చేసిన మున్సిపల్ అధికారులలో చలనం రావడం లేదు. ఏదైనా అనుకోని సంఘటన జరిగితే దీనికి బాధ్యులు ఎవరని ప్రజలు చర్చించుకుంటున్నారు. పట్టణంలో గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఏటువంటి ప్రమాదాలు జరగకుండా అవసరమైన ముందు జాగ్రత్త చర్యలను మంథని మున్సిపల్ అధికారులు, విద్యుత్ శాఖ అధికారులు సంయుక్తంగా చేపట్టాలి. ముఖ్యంగా ఈ మర్రిచెట్టు ను, గబ్బిలాలు, వందలాది కోతులు నివాసంగా మార్చుకొన్నాయి. గబ్బిలాల రెట్టలతో దుర్వాసన వస్తున్నది. అక్కడి చుట్టూ ప్రక్కల ఇండ్లపై, గోడలపై కోతులు తిరగడమే కాకుండా ఇండ్లలో దూరి వస్తువులను చెల్లా చెదురు చేస్తున్నాయి. వీధుల్లోకి కూడా దూసుకువస్తు మనుషలపై దాడి చేసి గాయపరుస్తున్నాయి. దీనివల్ల పాదచారులకు అసౌకర్యం, ప్రమాదం కలుగుతున్నాయి. ప్రజా సంక్షేమం దృష్ట్యా మర్రి ఊడలను తొలగించాలని, కోతుల సమస్యను పరిష్కరించాలని మున్సిపల్ అధికారులను పెంజేరు కట్ట వీధి ప్రజలు కోరుతున్నారు.

# గ్రామీణాభివృద్ధికి బాటలు వేసేందుకు గ్రామాల్లో ఉపాధి పనుల జాతర

**మంథని సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్**

**మంథని :** గ్రామీణాభివృద్ధికి బాటలు వేసేందుకు ప్రభుత్వం గ్రామాల్లో ఉపాధి పనుల జాతర కార్యక్రమం నిర్వహిస్తునీదని మంథని సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్ తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం గ్రామీణ అభివృద్ధి, ఉపాది కల్పన, పల్లెల్లో మౌలిక వసతుల విస్తరణ లక్ష్యంగా రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న ఉపాధి పనుల జాతర కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మంథని మండలం పుట్టపాక గ్రామంలోఉపాధి పనుల జాతర నిర్వహించారు. ఈ సందర్భంగా మంథని సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్ మాట్లాడుతూ ఇందిరా మహిళాశక్తి పథకం ద్వారా మహిళలకు ఉపాధి కల్పన, జలనిధి కింద నీటి సంరక్షణ పనులతో పాటు, వ్యవసాయ పోలాలకు బాటల నిర్మాణం, ఫల వనాల పెంపకం చేపడుతున్నామని అన్నారు. అంతేకాకునీడా అంగన్‌వాడీ, గ్రామ పంచాయతీ భవనాలు, పాఠశాల మరుగుదొడ్లు, పశువులు, మేకలు, కోళ్ల షెడ్‌లు, వ్యవసాయ చెరువులు, ఓపెన్ బావులు, నర్సరీలు, తోటలు, నీటి సేకరణ చెరువులు, సిసి రోడ్లు, చేపల చెరువులు, చెక్ డ్యామ్‌ల నిర్మాణంతో సహా విస్తృత శ్రేణి గ్రామీణ పనులను ఈ ఉపాధి పథకం ద్వారా చేపట్టవచ్చని తెలిపారు. గ్రామీణాభివృద్ధి కోసం ప్రజా ఉద్యమంగా ఈ ఉపాది పనుల జాతరను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇందులో భాగంగానే ఐటి పరిశ్రమలు శాసన సభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు గ్రామాల అభివృద్ధికి అనేక నిధులను మంజూరు చేస్తూ గ్రామాల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తున్నారని తెలిపారు. మంత్రి శ్రీధర్ బాబు తోనే మంథని నియోజకవర్గం రూపురేఖలు మారుతాయని అన్నారు. ఈ సందర్భంగా రేపాక ఓదెలు పశువుల కొట్టానికి సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్ భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయతి అధికారి, పుట్టపాక ప్రత్యేక అధికారి అనిల్ రెడ్డి, నాయకులు చాట్లపల్లి సంతోష్, హుస్సేన్ భీ, కన్నూరి రాజబాబు, తిరుపతి,



సుదర్శన్, మిట్ట రాజు, పంచాయతి కార్యదర్శి డేగ సరిత, ఉపాధి హామి ఫీల్డ్ అసిస్టెంట్ కొత్త ప్రవీణ్, అంగన్ వాడి టీచర్లు కల్వల రాజేశ్వరి, కన్నూరి శ్రీలత, ఏఎన్ఎంలు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

## రహదారులు బంద్ అయిన అన్ని గ్రామాలకు అన్ని రకాల నిత్యవసరాలు తక్షణమే పంపిణీ చేయాలి

**కూనవరం మండలం శబరి బెల్టు గ్రామాలకు విద్యుత్ ప్రత్యామ్నాయాన్ని చూపాలి**
**సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి బి. కిరణ్**




**చింతూరు డివిజన్ విశ్వం వాయిస్ న్యూస్:** గత ఐదు రోజుల నుండి చింతూరు డివిజన్ 4 మండలాల్లో వరదల వలన రహదారులు బంద్ అయి అనేక గ్రామాల ప్రజలు నిత్యవసరాలు లేకుండా ఇబ్బందులు పడుతున్నారని తక్షణమే రహదారులు బంద్ అయినా అన్ని గ్రామాలకు నిత్యవసరాలు పంపిణీ చేయాలని మరియు చిన్న పాటి వరదలకె కూనవరం మండలంలోని శబరి బెల్టు గ్రామాలకు విద్యుత్ అంతరా యం కలుగుతున్నదని తక్షణమే దానికి ప్రత్యామ్నాయ పరిష్కారం చూపాలని సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి బి కిరణ్ డిమాండ్ చేశారు. శుక్రవారం నాడు చింతూరు పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో జిల్లా కార్యదర్శి మాట్లాడుతూ గత ఐదు రోజుల నుండి వరద ప్రభావంతో వి ఆర్ పురం,కూనవరం, చింతూరు, ఎట్టపాక మండలాల్లో అనేక గ్రామాలు రాకపోకలు బంద్ అయి నిత్యవసరాలకు ఇబ్బంది పడుతున్నారని, ముంపు ప్రాంతాల్లో జిల్లా అధికారులు పర్యటిస్తున్న సందర్భంగా ప్రతి కుటుంబానికి 16 రకాల నిత్యవసరాలు, కొవ్వొత్తులు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. అవసరమైన చోట మరో బొట్లు ఏర్పాటు చేసి ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలని అన్నారు. వరదల సమయంలో రాకపోకలకు ఇబ్బంది లేకుండా ప్రత్యామ్నాయ రహదారులు వేయాలని గతం నుండి సూచించినప్పటికీ అధికారులు ప్రభుత్వం స్పందించడం లేదని ఇప్పటికైనా ప్రత్యామ్నాయ రహదారుల నిర్మాణానికి కృషి చేయాలని అన్నారు. చిన్నపాటి వరదలకే కూనవరం మండలంలో కొన్ని గ్రామాలకు విద్యుత్ అంతరాయం కలుగుతున్నదని గతం నుండి అక్కడ ప్రజలు కోరుతున్నప్పటికీ అధికారుల చలనం లేదని విమర్శించారు. ఇప్పటికైనా ప్రత్యామ్నాయ విద్యుత్తు లైన్ లు ఏర్పాటుచేసి విద్యుత్ అంతరాయాన్ని అధిగమించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పల్లపు వెంకట్, జిల్లా కమిటీ సభ్యులు సీసం సురేష్ మండల నాయకులు పొడియం లక్ష్మణ్, కారం నాగేష్, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

## 100 పడకల ఆసుపత్రిగా అప్ గ్రేడ్ పట్ల టీడిపి హర్షం

**ఏరియా ఆసుపత్రి సూపరిండెంట్ కోటిరెడ్డి స్వీట్లు పంచిన టీ డి పి మండల అధ్యక్షులు జమాల్ ఖాన్.**




**చింతూరు డివిజన్ విశ్వం వాయిస్ న్యూస్:** చింతూరు ఏ రియా ఆసుపత్రిని 100 పడక ల ఆసుపత్రి గా టీ డి పి ప్రభుత్వం అప్ గ్రేడ్ చేయటం పట్ల టీ డి పి మండల అధ్యక్షులు యండి జమాల్ ఖాన్, సీనియర్ నాయకులు ఏం డి జహంగీర్ హర్షం వ్యక్తం చేశారు. ఆసుపత్రి ప్రధాన వైద్యాధికారి కోటిరెడ్డికి స్వీట్ లను తినిపించి హర్షం వ్యక్తం చేశారు. చింతూరు ఏరియా ఆసుపత్రి ని 100 పడక ల ఆసుపత్రి గా అప్గ్రేడ్ చేయడంలో కీలకపాత్ర వహించిన రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి ఆమె భర్త మఠం భాస్కర్ సేవలను వారు కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కరణం లక్ష్మణ్, మార్కెట్ కమిటీ సభ్యులు పి సాల్మన్ రాజు, ట్రస్ట్ సభ్యులు ఎస్ కే రియాజ్, అజీజ్, యాకుబ్ పాషా, ఎస్ కే జానీ తదితరులు.

## ఆలయాలకు శ్రావణ శుక్రవారం

**శోభఘనంగా కుంకుమ పూజలుఅమ్మ వారికి ఓడిబియ్యం సమర్పించిన మహిళలు**

**జగిత్యాల :** మహిళలు, భక్తులు ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేసి అమ్మవారిని దర్శించుకోగా ఆలయాలు శ్రావణ శుక్రవారం శోభను సంతరించుకున్నాయి.జగిత్యాల రూరల్ మండలం పొలాసలో 108 శ్రీ చక్ర సహిత లలితామాత ఆలయంలో శ్రావణమాసం ఆఖరి శుక్రవారం సందర్భంగా పెద్ద సంఖ్యలో మహిళలు అమ్మవారికి పూజలు చేసి ఓడిబియ్యం సమర్పించారు. శ్రీ లలితామాత ఆలయంలో ఆలయ ఫౌండర్ ట్రస్టి చైర్మన్ చెల్లం స్వరూప సత్తయ్య ఆధ్వర్యంలో సుహాసినిలు లలితసాహస్ర నామ పారాయణం గావించిశ్రీ చక్రాలకు భక్తి శ్రద్ధలతో కుంకుమ పూజలు నిర్వహించి అమ్మవారిని దర్శించుకున్నారు.భక్తుల భజనలతో ఆలయం లలితామాతనామ స్మరణతో మారుమ్రోగింది. లలితమాతఆలయానికి పెద్ద సంఖ్యలో మహిళా భక్తులు రావడంతో ఆలయం కిక్కిరిసిపోయింది.అనంతరం ఆలయంలో అన్నదానం నిర్వహించగా భక్తులు స్వీకరించారు.జగిత్యాల పట్టణంలోని చింతకుంట వద్ద శ్రీ సూర్య ధన్వాంతరి దేవాలయంలో ధనలక్ష్మి సేవా సమితి ఆధ్వర్యంలో మాతలు అమ్మవారికి కుంకుమ పూజలు చేసి, పంచామృతాలతో అభిషేకం చేసి, లలితాసహస్ర నామ పారాయణం చేశారు. పారాయణం అనంతరం మాతలు అమ్మ వారికి ఒడి బియ్యం సమర్పించారు. కుంకుమ పూజ అనంతరం లక్కీ డిప్ ద్వార ఎంపిక చేసి వారికి అమ్మ వారి శేష వస్త్రం, చీరను ఆలయ పూజారి ఆశీర్వచనములతో సత్కరించారు.అష్టలక్ష్మి దేవాల యం, శివాలయం, సహస్రలింగాల దేవాలయం, తదితర ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు

## హరీష్‌పై ఆగ్రహం గులాబీ గూటికి కమలం నేతలు

**అదిలాబాద్ :** :కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ నియోజకవర్గంలో బీజేపీకి షాక్ తగిలింది. బిజెపిలోని ముఖ్య నాయకులు ఎమ్మెల్యే హరీష్ బాబు వ్యవహార శైలి నచ్చక పార్టీకి రాజీనామా చేశారు. హైదరాబాద్‌లోని నందినగర్‌లో జరిగిన సిర్పూర్ నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశంలో భాగంగా, రాష్ట్ర బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ సమక్షంలో సిర్పూర్ నియోజకవర్గానికి చెందిన బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొంగ సత్యనారాయణ, రాష్ట్ర నాయకులు బోలెం వెంకటేష్ ఇతర బిజెపి నాయకులు బిఆర్ఎస్‌లో చేరారు. బిఆర్ఎస్ పార్టీ హయంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు రానివ్వలేదని, కాంగ్రెస్ హయాంలో రైతులు యూరియా కోసం అధికారుల కాళ్లు మొక్కే పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు.

# ఈ పండ్లను కలిపి తింటున్నారా..?



అరటిపండ్లు శరీరానికి అవసరమైన అనేక పోషకాలను అందిస్తాయి. ఇందులో ఉండే పొటాషియం, కాల్షియం శరీర కండరాలను బలోపేతం చేస్తాయి. ఇవి శక్తిని అందించడంతో పాటు, గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి.జీర్ణక్రియను మెరుగుపరుస్తాయి. ఎముకలను బలోపేతం చేస్తాయి. అరటిపండును రోజువారీ ఆహారంలో చేర్చుకోవడం ద్వారా, అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు.బొప్పాయి తినడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. ఇది జీర్ణక్రియకు సహాయపడుతుంది. చర్మ ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. రోగనిరోధక శక్తిని పెంచడంతో పాటు గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గిస్తుంది. బొప్పాయి క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల కొలెస్ట్రాల్ అదుపులో ఉంటుంది. బొప్పాయి- అరటి వాటి స్వంత లక్షణాలను కలిగి ఉండి.. శరీరానికి వివిధ విధాలుగా మేలు చేస్తాయి.ఎందుకు కలిపి తినకూడదు? : అరటిపండు - బొప్పాయి వేర్వేరు స్వభావాలు కలిగిన పండ్లు. అందుకే వీటిని కలిపి తినడం ఆరోగ్యానికి మంచిది కాదని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. వీటి కలయిక వల్ల వాంతులు, అలెర్జీలు, అజీర్ణం వంటి సమస్యలు వచ్చే అవకాశం ఉంది. అంతేకాకుండా, శ్వాసకోశ సమస్యలు ఉన్నవారు బొప్పాయి తినడం మంచిది కాదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ రెండు పండ్లను కలిపి తినడం వల్ల ఆస్తమా, ఇతర శ్వాసకోశ సమస్యలు తీవ్రం కావచ్చని చెబుతున్నారు. ఆయుర్వేదం ప్రకారం.. అరటిపండు శరీరానికి చలువ చేస్తుంది. బొప్పాయి శరీరాన్ని వేడి చేస్తుంది. ఈ రెండు విభిన్న స్వభావాలు కలిగిన పండ్లను కలిపి తీసుకుంటే జీర్ణవ్యవస్థ దెబ్బతింటుంది. ఫలితంగా తలనొప్పి, వాంతులు, తలతిరుగుడు, అలెర్జీలు వంటి సమస్యలు ఎదురవుతాయి. అంతేకాకుండా కామెర్లు ఉన్నవారు బొప్పాయి తినకూడదు. ఇందులో ఉండే పపైన్, బీటా కెరోటిన్ కామెర్ల సమస్యను పెంచుతాయని వైద్యులు తెలిపారు. అలాగే శరీరంలో పొటాషియం అధికంగా ఉన్నవారు అరటిపండ్లు తినకుండా ఉండడం మంచిది. కాబట్టి ఈ పండ్లను కలిపి తినకుండా విడివిడిగా తీసుకోవడం వల్ల ఆరోగ్యానికి మేలు కలుగుతుంది.

# పచ్చి బఠానీలతో పుట్టెడు లాభాలు!



పచ్చి బఠానీలు పోషకాలకు నిలయం. వీటిలో విటమిన్-సి, మెగ్నీషియం, పొటాషియం మరియు కాల్షియం వంటి పోషకాలు ఉంటాయి. ఇది గుండె ఆరోగ్యాన్ని ప్రోత్సహిస్తుంది.బఠానీలలో కరిగే ఫైబర్ కూడా ఉంటుంది, ఇది కొలెస్ట్రాల్ స్థాయిలను సాధారణీకరిస్తుంది.పచ్చి బఠానీలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. వీటిల్లో ఉండే ప్రోటీన్లు, ఫైబర్, మెగ్నీషియం, పొటాషియం గుండెను ఆరోగ్యంగా ఉంచుతుంది. శరీర కండరాలకు కూడా పచ్చి బఠానీలు మంచివి. రక్తపోటును నియంత్రించడంతో పాటు మలబద్ధకం సమస్యలకు పచ్చి బఠానీలు చెక్ పెడతాయి.పచ్చి బఠానీలు డయాబెటిక్ రోగులకు ప్రయోజనకరంగా ఉంటాయి. దీని +× తక్కువగా ఉంటుంది. ఇది చక్కెరను నియంత్రించడంలో సహాయపడుతుంది. ఇందులో ఉండే ఫైబర్ బ్లడ్ షుగర్ అకస్మాత్తుగా పెరగనివ్వదు. శారీరక శ్రమ, ఆహారం కారణంగా రక్తంలో చక్కెర స్థాయి పెరుగుతుంది. శరీరంలో ఇనుము లోపం వల్ల అలసట, బలహీనత మరియు అనేక సమస్యలు వస్తాయి. ఇది ఎర్ర రక్త కణాల ఏర్పాటుకు సహాయపడుతుంది. బఠానీలలో విటమిన్ సి, ఇ, ఎ జింక్ లాంటివి లభిస్తాయి, ఇది రోగనిరోధక శక్తిని బలోపేతం చేస్తుంది. అంతేకాదు ఇది మంట సమస్యను తగ్గిస్తుంది. రెగ్యూలర్‌గా పచ్చిబఠానీలు తినటం వల్ల కణాలు దెబ్బతినకుండా రక్షిస్తాయి. పచ్చి బఠానీలలో ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. ఇది జీర్ణ సంబంధిత సమస్యల నుండి మిమ్మల్ని రక్షిస్తుంది. ప్రతిరోజూ పచ్చి బఠానీలు తింటే, మీ ప్రేగులలో మంచి బ్యాక్టీరియా పెరుగుతుంది. కడుపు సమస్యలను నివారిస్తుంది. బరువు తగ్గే ప్రయత్నంలో ఉన్నవారు మీరు పచ్చి బఠానీలను మీ ఆహారంలో భాగం చేసుకోవచ్చు. ఇందులో ప్రోటీన్ ఉంటుంది. ఇందులో ఐరన్, ఫోలేట్, విటమిన్ ఎ, ఫాస్పరస్ కూడా ఉంటాయి, ఇది కండరాల బలాన్ని ప్రోత్సహిస్తుంది.

# బంగాళాదుంప రసాన్ని తాగితే ఇన్ని లాభాలా?



రోజూ బంగాళాదుంప రసం తాగడం వల్ల అల్సర్లు, జీర్ణ సమస్యల నుండి సులభంగా ఉపశమనం లభిస్తుంది. ఇప్పటికే జీర్ణ సంబంధిత వ్యాధులు, ఇతర కడుపు సమస్యలతో బాధపడుతున్నవారు ఖచ్చితంగా బంగాళాదుంప రసాన్ని ప్రయత్నించాలి.బంగాళాదుంపలలో విటమిన్ సి పుష్కలంగా ఉంటుంది. అందువల్ల, ఈ రసం తాగడం వల్ల వివిధ రకాల ఇన్ఫెక్షన్లను నివారించడంలో సహాయపడుతుంది. అధిక రక్తపోటును అదుపులో ఉంచుతుంది. మంచి రోగనిరోధక వ్యవస్థకు మద్దతు ఇస్తుంది. బంగాళాదుంప రసం కళ్ళు, చర్మం, దంతాలు, నాడీ వ్యవస్థ ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది.బంగాళాదుంపతో తయారు చేసిన జ్యూస్ తాగడం వల్ల కిడ్నీ స్టోన్ సమస్యల నుండి ఉపశమనం కలిగిస్తుంది. ఆరోగ్యానికి మేలు చేసే రాగి, మాంగనీస్, పొటాషియం, బి-విటమిన్‌లను కలిగి ఉంటాయి. బంగాళాదుంప రసంలో లభించే ఫైబర్ శరీరంలో కొలెస్ట్రాల్ స్థాయిలను నియంత్రించడంలో చురుకైన పాత్ర పోషిస్తుంది. ప్రతిరోజు ఉదయం బంగాళాదుంప రసం తాగడం వల్ల శరీర బరువు నియంత్రణలో ఉంటుందని కొందరు ఆరోగ్య నిపుణులు అంటున్నారు. బంగాళాదుంప రసంలో యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. అనేక ఇన్ఫెక్షన్లను నివారిస్తుంది. మైగ్రేన్ బాధితులు బంగాళదుంప రసం తాగడం వల్ల ప్రయోజనం పొందవచ్చు. బంగాళదుంప రసం తాగడం వల్ల చర్మ సమస్యలు కూడా నయమవుతాయని నిపుణులు చెబుతున్నారు. ఇది చర్మాన్ని ముడతలు పడకుండా కాపాడుతుంది. వృద్ధాప్య సంకేతాలను నివారిస్తుంది. చర్మాన్ని లోపలి నుంచి శుభ్రపరుస్తుంది. బెల్లీ బ్లోట్ నివారిస్తుంది.

# పండ్ల తొక్కలు పడేస్తున్నారా?

తాజా పండ్లు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. అయితే పండ్ల తొక్కలు గొప్ప ప్రయోజనాలను అందిస్తాయి. వీటిల్లో ఫైబర్ అధిక మొత్తంలో ఉంటుంది. ఇది జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. మలబద్ధకాన్ని తగ్గిస్తుంది. బరువు నియంత్రణలో సహాయపడుతుంది.వీటిల్లో విటమిన్లు, ఖనిజాలు, యాంటీఆక్సిడెంట్లు సమృద్ధిగా ఉంటాయి, ఆపిల్, ద్రాక్ష, ఎండుద్రాక్ష, కివి వంటి పండ్ల తొక్కలలో ఫ్లేవనాయిడ్లు, పాలీఫెనాల్స్ ఉంటాయి. ఇవి క్యాన్సర్‌ను నివారించడంలో, వృద్ధాప్య సంకేతాలను తగ్గించడంలో సహాయపడతాయి. రోగనిరోధక శక్తిని పెంచుతుంది. చర్మ, జుట్టు సంరక్షణలో ప్రభావవంతంగా ఉంటుంది. పండ్ల తొక్కల్లోని మూలికా లక్షణాలు శరీరాన్ని ఇన్ఫెక్షన్ల నుంచి రక్షిస్తాయి. నారింజ, ఎండుద్రాక్ష తొక్కలను ఎండబెట్టి పొడి చేసి చర్మానికి వాడటం వల్ల మచ్చలు, మొటిమలు తగ్గుతాయి. ద్రాక్ష, జామ తొక్కల్లో రెస్వెరాట్రాల్ ఉంటుంది. ఇది క్యాన్సర్‌ను నివారించడానికి, వృద్ధాప్యాన్ని ఆలస్యం చేయడానికి సహాయపడుతుంది.కీరదోస, నారింజ తొక్కల్లో ఫైబర్, సిలికా ఉంటాయి. ఇవి ఎముకలు, చర్మానికి ప్రయోజనకరంగా ఉంటాయి. నారింజ తొక్కలో విటమిన్ సి, ఫ్లేవనాయిడ్లు, నూనెలు ఉంటాయి. ఇవి చర్మానికి, కాలేయానికి మేలు చేస్తాయి. నల్ల ఎండుద్రాక్ష శరీరంలో రక్తాన్ని ఉత్పత్తి చేయడంలో సహాయపడుతుంది. ఎండిన నల్ల ఎండుద్రాక్ష తొక్క పొడి జీర్ణక్రియకు సహాయపడుతుంది. కివి పండు తొక్కలో చాలా యాంటీఆక్సిడెంట్లు ఉంటాయి. కివిలో ఫైబర్ కూడా పుష్కలంగా ఉంటుంది. ఇది శరీరాన్ని విష పదార్థాల నుంచి దూరంగా ఉంచడానికి సహాయపడుతుంది. బత్తాయి, కమలాపండ్లు తినడం వల్ల శరీరానికి వచ్చే వివిధ వ్యాధులను నివారించవచ్చని వైద్యులు అంటున్నారు. వీటి తొక్కలో ఫైబర్, విటమిన్ సి, యాంటీఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి జీర్ణక్రియను పెంచుతాయి. గుండెను రక్షిస్తాయి.



# బిజినెస్

## శ్రీజీ షిప్పింగ్ గ్లోబల్ ఐపీఓకు భారీ స్పందన




జామ్‌నగర్‌కు చెందిన శ్రీజీ గ్రూప్‌కు అనుబంధ సంస్థ శ్రీజీ షిప్పింగ్ గ్లోబల్ లిమిటెడ్ ఐపీఓకు భారీ స్పందన వచ్చింది. రూ.410.71 కోట్ల విలువైన ఈ పబ్లిక్ ఆఫరింగ్ ఆగస్టు 19న ప్రారంభమై ఆగస్టు 21న ముగిసింది. ఈ ఇష్యూ పూర్తిగా ఫ్రెష్ ఇష్యూ రూపంలో ఉండగా, ఒక్కో షేరు ధరను రూ.240 నుంచి రూ.242 మధ్యగా నిర్ణయించారు. లాట్ సైజ్ 58 షేర్లుగా ఉండటంతో, ఒక రిటైల్ ఇన్వెస్టర్ కనీసం రూ.14,616 పెట్టుబడి పెట్టాల్సి వచ్చింది. ఎన్ఎస్ఈ డేటా ప్రకారం, 1.14 కోట్ల షేర్లకు గాను 21.17 కోట్ల షేర్లకు బిడ్లు వచ్చాయి. దీంతో మొత్తం సబ్‌స్క్రిప్షన్ 18.56 రెట్లు నమోదైంది. విభాగాలవారీగా చూస్తే, నాన్-ఇన్‌స్టిట్యూషనల్ ఇన్వెస్టర్లు 38.96 రెట్లు, రిటైల్ ఇన్వెస్టర్లు 14.73 రెట్లు, క్వాలిఫైడ్ ఇన్వెస్టర్లు 9.97 రెట్లు సబ్‌స్క్రైబ్ చేశారు. షేర్ల కేటాయింపు ఆగస్టు 22న జరగనుండగా, లిస్టింగ్ ఆగస్టు 26న బీఎస్ఈ, ఎన్ఎస్ఈ స్టాక్ ఎక్స్ఛేంజ్‌లలో జరగనుంది. శ్రీజీ షిప్పింగ్ గ్లోబల్ లిమిటెడ్ భారత్, శ్రీలంకలోని 20 ఓడరేవుల్లో డ్రై బల్క్ కార్గో (పొడి సరుకులు) రవాణా, లాజిస్టిక్స్ సేవలు అందిస్తోంది. ప్రస్తుతం సంస్థకు 80కి పైగా వెసెల్స్ (టగ్‌బోట్లు, బార్జ్‌లు, ఫ్లోటింగ్ క్రేన్‌లు), అలాగే 370కి పైగా వాణిజ్య వాహనాలు, ఎర్త్‌మూవింగ్ మెషినరీ ఉన్నాయి. ఐపీఓ ద్వారా వచ్చిన నిధులను కొత్త షిప్‌లు కొనుగోలు చేయడానికి, అలాగే కొన్ని ఋణాల భారం తగ్గించేందుకు వినియోగించనున్నట్లు కంపెనీ ప్రకటించింది.

## స్కామ్ అకౌంట్లను గుర్తించడానికి బ్యాంకుల్లో ఏఐ ఆధారిత వ్యవస్థ




ఆన్‌లైన్ మోసాలు, మనీలాం డరింగ్‌ను అరికట్టడానికి అన్ని బ్యాంకులలో ఖాతాలలో కృత్రిమ మేధ(ఏఐ) ఆధారిత ధృవీకరణను తప్పనిసరి చేయాలని భారతీయ రిజర్వ్ బ్యాంక్(ఆర్‌బీఐ) నిర్ణయించింది. ఈ మేరకు ఆర్‌బీఐ త్వరలో మార్గదర్శకాలను జారీ చేయనుందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. మొదట స్కామ్ ఖాతాలను గుర్తించి వాటిని బ్లాక్ చేయడానికి ఆర్‌బీఐ ఓ బ్యాంకులో ఏఐ- ఆధారిత వ్యవస్థను ఉపయోగించి పైలట్ కార్యక్రమాన్ని చేపట్టింది. ఈ సమయంలో సదరు ప్రభుత్వ రంగ బ్యాంకులో మాత్రమే 13 లక్షల ఖాతాలను గుర్తించి బ్లాక్ చేశారు. మార్గదర్శకాలు అమల్లోకి వచ్చిన తర్వాత, ప్రైవేట్, ప్రభుత్వ రంగ బ్యాంకులతో సహా అన్ని బ్యాంకులు మ్యూల్ ఖాతాలను గుర్తించి బ్లాక్ చేయాల్సి ఉంటుంది. తద్వారా ఏ రకమైన అక్రమ బదిలీనైనా అరికట్టవచ్చని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. సైబర్ మోసగాళ్లు సామాన్యులను లక్ష్యంగా చేసుకోకుండా ఉండటానికి ఈ వ్యవస్థ ఎలాంటి టూ-వే లావాదేవీనైనా గుర్తించగలదని ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. అంతేకాకుండా బ్యాంకింగ్ లైసెన్స్‌లు, వాటి పునరుద్ధరణ దీని పరిధిలోకి వస్తాయని తెలుస్తోంది. ఈ నిబంధనలను పాటించేందుకు ప్రభుత్వం దేశవ్యాప్తంగా భారీ ప్రచారాన్ని కూడా నిర్వహించాలని భావిస్తున్నట్టు సమాచారం.

# మైక్రోసాఫ్ట్ కార్యాలయంలో గాజా దాడుల నిరసనలు

అమెరికాలోని వాషింగ్టన్‌లోని మైక్రోసాఫ్ట్ రెడ్‌మండ్ కార్యాలయంలో గాజాపై ఇజ్రాయెల్ దాడులను ఖండిస్తూ ఉద్యోగులు రెండు రోజులుగా నిరసనలు చేపట్టారు. మైక్రోసాఫ్ట్ అభివృద్ధి చేసిన సాంకేతికతను ఇజ్రాయెల్ సైన్యం దుర్వినియోగం చేస్తోందని ఆరోపిస్తూ, సుమారు 35 మంది ఉద్యోగులు ఈ ఆందోళనలో పాల్గొన్నారు. ఈ నిరసనలు కంపెనీ యొక్క బాధ్యతాయుతమైన సాంకేతిక వినియోగం గురించి ప్రశ్నలను లేవనెత్తాయి, అలాగే కార్పొరేట్ నీతి మరియు రాజకీయ సమస్యలపై ఉద్యోగుల ఆందోళనలను హైలైట్ చేశాయి. నిరసనకారులు తమ డిమాండ్లను వ్యక్తం చేయడానికి ఫర్నిచర్‌ను ధ్వంసం చేయడం, రంగులు చల్లడం వంటి చర్యలకు పాల్పడ్డారు, దీనితో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. మైక్రోసాఫ్ట్ యాజమాన్యం ఈ చర్యలను అసమ్మతిగా భావించినప్పటికీ, నిరసనకారులు తమ సాంకేతికత యుద్ధంలో వినియోగించబడుతున్న తీరుపై నైతిక ఆందోళనలను వ్యక్తం చేశారు. ఈ ఘటన సాంకేతిక కంపెనీలు తమ ఉత్పత్తుల వినియోగంపై ఎలాంటి నియంత్రణ కలిగి ఉండాలనే చర్చను మరింత తీవ్రతరం చేసింది. పరిస్థితి అదుపు తప్పడంతో స్థానిక పోలీసులు జోక్యం చేసుకొని 18 మంది నిరసనకారులను అరెస్టు చేశారు. అరెస్టయిన వారిలో మైక్రోసాఫ్ట్‌లో పనిచేస్తున్న ఉద్యోగులతో పాటు మాజీ ఉద్యోగులు కూడా ఉన్నారు. ఈ అరెస్టులు నిరసనకారుల ఉద్దేశాలను దెబ్బతీసినప్పటికీ, వారు తమ డిమాండ్లను మరింత గట్టిగా వినిపించేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఈ ఘటన సామాజిక మరియు రాజకీయ సమస్యలపై




కార్పొరేట్ ప్రపంచంలో జరుగుతున్న ఉద్యమాలకు ఒక ఉదాహరణగా నిలిచింది. ఈ నిరసనలు మైక్రోసాఫ్ట్‌తో పాటు ఇతర సాంకేతిక దిగ్గజాలను తమ ఉత్పత్తుల వినియోగం గురించి ఆలోచింపజేస్తున్నాయి. గాజా దాడులపై నిరసనలు కేవలం రాజకీయ వ్యక్తీకరణలకు మాత్రమే పరిమితం కాకుండా, సాంకేతికత యొక్క నైతిక బాధ్యతలపై విస్తృత చర్చకు దారితీస్తున్నాయి. ఈ ఘటన భవిష్యత్తులో కార్పొరేట్ సంస్థలు తమ ఉద్యోగుల ఆందోళనలను ఎలా నిర్వహిస్తాయి, సాంకేతికత యొక్క రాజకీయ పరిణామాలను ఎలా ఎదుర్కొంటాయి అనే అంశాలపై కీలక ప్రభావం చూపనుంది.

# వరుసగా లాభాల బాటలో దేశీయ స్టాక్ మార్కెట్లు

దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా నాలుగో రోజు కూడా లాభాల బాటలో పయనించాయి. జీఎస్టీలో ప్రతిపాదించిన కీలక సంస్కరణలు ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌ను బలపరచడంతో గురువారం సూచీలు స్వల్ప లాభాలతో ముగిశాయి. ట్రేడింగ్ సెషన్ ఆద్యంతం పరిమిత శ్రేణిలో కదలాడినప్పటికీ, చివరికి లాభాలను నిలబెట్టుకున్నాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి, బీఎస్ఈ సెన్సెక్స్ 142.97 పాయింట్ల లాభంతో 82,000.71 వద్ద స్థిరపడింది. అదేవిధంగా, ఎన్ఎస్ఈ నిఫ్టీ 33.20 పాయింట్లు పెరిగి 25,083.75 వద్ద ముగిసింది. అయితే, ఆటో, ఎఫ్ఎంసీజీ వంటి రంగాలలో ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు మొగ్గు చూపడంతో మార్కెట్లపై కొంత ఒత్తిడి కనిపించింది. ప్రస్తుతం ఉన్న నాలుగు శ్లాబుల జీఎస్టీ విధానాన్ని రద్దు చేసి, దాని స్థానంలో 5%, 18% చొప్పున రెండు శ్లాబుల విధానాన్ని తీసుకురావాలన్న ప్రతిపాదనకు మంత్రుల బృందం ఆమోదం తెలపడం మార్కెట్లకు సానుకూల శక్తినిచ్చింది. "స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో ప్రధాని మోదీ ప్రకటించిన నూతన తరం జీఎస్టీ సంస్కరణల అమలులో ఇది ఒక కీలకమైన తొలి అడుగు" అని మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ రీసెర్చ్ హెడ్ సిద్ధార్థ ఖేమ్కా విశ్లేషించారు. దీనికి తోడు, ఆగస్టులో తయారీ, సేవా రంగాలు బలమైన వృద్ధిని కనబరచడం కూడా మార్కెట్‌కు స్థిరత్వాన్ని ఇచ్చిందని ఆయన తెలిపారు. సెన్సెక్స్ షేర్లలో బజాజ్ ఫిన్‌సర్వ్, ఐసీఐసీఐ బ్యాంక్, బజాజ్ ఫైనాన్స్, ఎల్%ట%టీ, సన్ ఫార్మా, టైటాన్ ప్రధానంగా లాభపడగా, పవర్‌గ్రిడ్, హిందుస్థాన్ యూనిలీవర్, ఎన్టీపీసీ, మహీంద్రా అండ్ మహీంద్రా, టాటా మోటార్స్ నష్టపోయాయి. రంగాల వారీగా చూస్తే, నిఫ్టీ ఫైనాన్షియల్ సర్వీసెస్, బ్యాంకింగ్ సూచీలు లాభాల్లో ముగియగా, ఆటో, ఎఫ్ఎంసీజీ



సూచీలు నష్టాల్లో ముగిశాయి. డాలర్‌తో రూపాయి మారకం విలువ 87.22 వద్ద బలహీనంగా ట్రేడ్ అయింది.

# వన్డే వరల్డ్‌కప్-2025 రివైజ్డ్ షెడ్యూల్ విడుదల

మహిళల వన్డే ప్రపంచకప్-2025 టోర్నమెంట్‌కు సంబంధించి అంతర్జాతీయ క్రికెట్ మండలి కీలక అప్‌డేట్ అందించింది. టోర్నమెంట్ ఓపెనర్‌లో భాగంగా ఆతిథ్య దేశాలు భారత్- శ్రీలంక మధ్య జరిగే తొలి మ్యాచ్ వేదికను మార్చింది. తొలుత బెంగళూరులోని ఎం.చిన్నస్వామి స్టేడియం లో ఈ వన్డేను నిర్వహించాలని భావించిన ఐసీసీ.. తాజాగా దీనిని గువాహటిలోని బర్సపరా స్టేడియానికి మార్చింది. అదే విధంగా.. ఈ మెగా టోర్నీలో బెంగళూరులో జరగాల్సిన మిగతా మ్యాచ్‌లన్నింటి వేదికను నవీ ముంబైకి తరలించింది.

**తొక్కిసలాటలో ప్రాణాలు పోయాయి**

ఇటీవల ఐపీఎల్-2025లో విజేతగా నిలిచిన తర్వాత రాయల్ చాలెంజర్స్ బెంగళూరు విజయోత్సవం తొక్కిసలాటకు దారి తీసి.. పలువురు ప్రాణాలు పోగొట్టుకున్న విషాదరకర ఘటన విదితమే. ఈ నేపథ్యంలో ఆర్సీబీ యాజమాన్యంతో పాటు కర్ణాటక ప్రభుత్వం మీద కూడా తీవ్ర స్థాయిలో విమర్శలు వచ్చాయి. ఇందుకు సంబంధించిన దర్యాప్తులో తప్పంతా ఆర్సీబీదేనని తేలింది.

**నవీ ముంబైలో..**

ఇదిలా ఉంటే.. తొక్కిసలాట ఘటన తర్వాత.. చిన్నస్వామి స్టేడియంలో వరల్డ్‌కప్ మ్యాచ్‌లు నిర్వహించేందుకు కర్ణాటక ప్రభుత్వం అనుమతిని నిరాకరించింది. ఈ నేపథ్యంలో ఐసీసీ బెంగళూరులో జరగాల్సిన మ్యాచ్‌లను నవీ ముంబైలో నిర్వహించాలని నిర్ణయించింది. ఐసీసీ తాజా ప్రకటన ప్రకారం.. నవీ ముంబైలోని డీవై పాటిల్ స్టేడియం ఐదు మ్యాచ్‌లకు ఆతిథ్యం ఇవ్వనుంది. లీగ్ దశలో మూడు, సెమీ



ఫైనల్, ఫైనల్ కూడా ఇక్కడే జరిగే అవకాశం ఉంది. ఇక పాకిస్తాన్ క్రికెట్ బోర్డుతో ఒప్పందం ప్రకారం.. ఆ దేశ మహిళా జట్టు తటస్థ వేదికైన శ్రీలంకలోని కొలంబోలో మ్యాచ్‌లు ఆడనున్న విషయం తెలిసిందే.

**పాక్ జట్టు ఫైనల్ చేరితే?**

ఒకవేళ పాక్ జట్టు ఫైనల్ చేరితే మాత్రం నవీ ముంబై గాకుండా.. కొలంబోలో టైటిల్ పోరు జరుగుతుంది. ఇక బెంగళూరులో జరగాల్సిన భారత్ వర్సెస్ శ్రీలంక, ఇంగ్లండ్ వర్సెస్ సౌతాఫ్రికా, భారత్ వర్సెస్ బంగ్లాదేశ్ మ్యాచ్‌లు మాత్రం నవీ ముంబైలో జరగడం ఖరారైంది. కాగా బెంగళూరు నుంచి వేదికను తరలించాల్సి వస్తే తిరువనంతపురంలో మ్యాచ్‌లు జరుగుతాయని వార్తలు వచ్చాయి. అయితే, నవీ ముంబై తాజాగా ఈ మ్యాచ్‌ల ఆతిథ్య హక్కులు దక్కించుకుంది. కాగా సెప్టెంబరు 30న భారత్-శ్రీలంక మ్యాచ్‌తో గువాహటి వేదికగా వన్డే ప్రపంచకప్-2025 టోర్నీకి తెరలేవనుంది.

**వన్డే వరల్డ్‌కప్-2025లో టీమిండియా షెడ్యూల్ (అప్‌డేటెడ్)**

సెప్టెంబరు 30- భారత్ వర్సెస్ శ్రీలంక- గువాహటి
అక్టోబరు 5- భారత్ వర్సెస్ పాకిస్తాన్- కొలంబో
అక్టోబరు 9- భారత్ వర్సెస్ సౌతాఫ్రికా- విశాఖపట్నం
అక్టోబరు 12- భారత్ వర్సెస్ ఆస్ట్రేలియా- విశాఖపట్నం
అక్టోబరు 19- భారత్ వర్సెస్ ఇంగ్లండ్- ఇండోర్
అక్టోబరు 23- భారత్ వర్సెస్ న్యూజిలాండ్- నవీ ముంబై
అక్టోబరు 26- భారత్ వర్సెస్ బంగ్లాదేశ్- నవీ ముంబై.

**నాకౌట్ స్టేజ్ షెడ్యూల్**

అక్టోబరు 29- సెమీ ఫైనల్ 1- కొలంబో/గువాహటి
అక్టోబరు 30- సెమీ ఫైనల్ 2- నవీ ముంబై
నవంబరు 2- ఫైనల్- కొలంబో/నవీ ముంబై

**వన్డే వరల్డ్‌కప్-2025 టోర్నీకి భారత మహిళా క్రికెట్ జట్టు**

హర్మన్‌ప్రీత్ కౌర్ (కెప్టెన్), స్మృతి మంధాన (వైస్ కెప్టెన్), ప్రతీక రావల్, హర్లీన్ డియోల్, దీప్తి శర్మ, జెమీమా రోడ్రిగ్స్, యస్తిక భాటియా, అరుంధతి రెడ్డి, క్రాంతి గౌడ్, రిచా ఘోష్, అమన్‌జోత్ కౌర్, రాధ యాదవ్, రేణుక ఠాకూర్, శ్రీచరణి, స్నేహ్ రాణా.

స్టాండ్‌బై: సయాలీ సత్‌ఘరే, తేజల్ హసబ్నిస్, ప్రేమ రావత్, ప్రియా మిశ్రా, ఉమా ఛెత్రి, మిన్ను మణి.

# స్పోర్ట్స్

## సెలక్షన్ కమిటీలోకి కొత్త సభ్యులు.. దరఖాస్తులు ఆహ్వానించిన బీసీసీఐ..!




భారత క్రికెట్ నియంత్రణ మండలి శుక్రవారం మెన్స్, వుమెన్స్ జాతీయ సెలక్షన్ కమిటీల్లోని ఖాళీగా ఉన్న సభ్యుల పోస్టులను భర్తీ చేసేందుకు దరఖాస్తులను ఆహ్వానించింది. సీనియర్ పురుషుల సెలక్షన్ కమిటీలో ఇద్దరు సభ్యులు, మహిళల సెలక్షన్ కమిటీలో నాలుగు పదవులను భర్తీ చేయనున్నది. ఆసక్తి ఉన్న వారు సెప్టెంబర్ 10వ తేదీలోగా దరఖాస్తులు అందజేయాలని బీసీసీఐ కోరింది. గతంలో ఉన్న అర్హత ప్రమాణాలు ఉంటాయని బీసీసీఐ స్పష్టం చేసింది. కనీసం ఏడు టెస్టు మ్యాచ్‌లు.. లేకపోతే 30 ఫస్ట్‌క్లాస్ మ్యాచులు ఆడిన అనుభవం ఉండాలని పేర్కొంది. ప్రత్యామ్నాయంగా కనీసం పది వన్డే ఇంటర్నేషనల్స్, లేకపోతే 20 ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌లు ఆడిన ఆటగాళ్లు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపింది. ఎంపికైన సెలక్టర్ల ఒప్పందం ప్రతి సంవత్సరం పునరుద్ధరించనున్నట్లు పేర్కొంది. ఇదిలా ఉండగా.. ప్రస్తుతం ఉన్న సెలెక్టర్లలో ఎవరిని భర్తీ చేయాలో ఇంకా నిర్ణయించలేదని.. ఈ ప్రక్రియ త్వరలోనే ప్రారంభమవుతుందని ఓ బీసీసీఐ అధికారి ఒకరు తెలిపారు. ఇటీవల ఆసియా కప్ కోసం జట్టును ఎంపిక చేసిన ప్రస్తుత పరుషుల సెలక్షన్ కమిటీకి మాజీ ఫాస్ట్ బౌలర్ అజిత్ అగార్కర్ నేతృత్వం వహిస్తున్న విషయం తెలిసిందే. ఆయనతో పాటు కమిటీలో ఎస్ఎస్ దాస్, సుబ్రతో బెనర్జీ, అజయ్ రాత్రా, ఎస్ శరత్ సభ్యులుగా ఉన్నారు. అలాగే, పురుషుల జూనియర్ క్రికెట్ సెలక్షన్ కమిటీలో ఒక సభ్యుడి కోసం బీసీసీఐ దరఖాస్తులు ఆహ్వానించింది. ఈ కమిటీ అండర్-22 వరకు వయస్సు గల జట్లకు క్యాంపులు, పర్యటనలు, టోర్నమెంట్లను టీమ్‌ను ఎంపిక చేస్తుంది. మహిళల జాతీయ సెలక్షన్ కమిటీలో నాలుగు పదవులకు దరఖాస్తులు ఆహ్వానించింది. ప్రస్తుత మహిళా ప్యానెల్‌కు నీతు డేవిడ్ నేతృత్వం వహిస్తున్నారు. ఆమెతో పాటు రేణు మార్గరెట్, ఆర్తి వైద్య, కల్పనా వెంకటాచర్, శ్యామా డీ షా ఉన్నారు. ఈ కమిటీ ఇటీవల స్వదేశంలో జరిగే వన్డే ప్రపంచ కప్ కోసం భారత మహిళా జట్టును కూడా ఎంపిక చేసింది. అయితే, ఇటీవల పలు నివేదికలు చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ పదవీకాలాన్ని జూన్ 2026 వరకు పొడిగించాలని బీసీసీఐ నిర్ణయించినట్లు పేర్కొన్నాయి. భారత జట్టు సాధించిన విషయాలను దృష్టిలో ఉంచుకొని బీసీసీఐ ఈ నిర్ణయం తీసుకుంది. అగార్కర్ జూలై 2023లో సెలక్షన్ కమిటీ చైర్మన్‌గా నియమితులయ్యారు. ఆయన పదవీకాలంలో టీమిండియా పలు అద్భుత విజయాలను సాధించింది. 2023 వన్డే ప్రపంచ కప్ ఫైనల్ వరకు వెళ్లింది. 2024 టీ20 ప్రపంచ కప్ టైటిల్, 2025 ఛాంపియన్స్ ట్రోఫీని గెలిచింది.

# సూపర్ ఫిట్‌గా కోహ్లీ, రోహిత్.. వరల్డ్ కప్‌లో ఆడడం ఖాయం..!



టీమిండియా స్టార్ ద్వయంగా పేరొందిన విరాట్ కోహ్లీ రోహిత్ శర్మ మళ్లీ బ్లూ జెర్సీతో మైదానంలోకి దిగితే చూడాలనుకుంటున్నారు అభిమానులు. టీ20, టెస్టులు.. ఈ రెండు ఫార్మాట్లకు వీడ్కోలు పలికిన రోహిత్, కోహ్లీ వన్డేల్లో చెలరేగేందుకు సిద్ధమవుతున్నారు. అయినా సరే ఈ ఇద్దరికీ వచ్చే వన్డే వరల్డ్ కప్‌లో చోటు దక్కడంపై సందేహాలు వెలిబుచ్చుతున్నారు కొందరు. కుర్రాళ్లు దూసుకొస్తున్న నేపథ్యంలో మెగా టోర్నీలో 'రోకో'కు ఛాన్స్ కష్టమే అని మాజీలు సైతం అభిప్రాయ పడుతున్నారు. కానీ.. అనుభవజ్ఞులైన కోహ్లీ, హిట్‌మ్యాన్ వరల్డ్ కప్‌లో ఆడితే టీమిండియాకు తిరుగుండదని అంటున్నాడు రాస్ టేలర్ 'కోహ్లీ, రోహిత్‌లను చూడండి.. ఇప్పటికీ చాలా ఫిట్‌గా ఉన్నారు. వయసు పైబడుతున్నా తమ బ్యాట్ పవర్ చూపిస్తూ పరుగులు సాధిస్తూనే ఉన్నారు. ఇప్పటికే ఎన్నో రికార్డుల బద్ధలు కొట్టిన ఈ ఇద్దరు ఇంకా ఏం కోరుకుంటున్నారో వాళ్లకు మాత్రమే తెలుసు. ఇద్దరూ తండ్రులయ్యారు. క్రికెట్ కోసం కుటుంబం, పిల్లలకు చాలారోజులు దూరంగా ఉంటున్నారు. ఆటపట్ల వాళ్లకున్న చిత్తశుద్ధి ప్రపంచానికి తెలుసు. భారత క్రికెట్‌కు కూడా విరాట్, రోహిత్ చాల సేవ చేశారు. అందుకే ఈ దిగ్గజ ఆటగాళ్లు 2027 వన్డే వరల్డ్ కప్ స్క్వాడ్‌లో ఉండాలని కోరుకుంటున్నా' అని న్యూజిలాండ్ వెటరన్ వెల్లడించాడు. నిరుడు పొట్టి వరల్డ్ కప్, ఈ ఏడాది ఛాంపియన్స్ ట్రోఫీ విజయంలో కీలకమైన రోహిత్, కోహ్లీలు సంయుక్తంగా వన్డే వరల్డ్ కప్ మాత్రం గెలవలేదు. 2011లో వన్డే వరల్డ్ కప్ గెలుపొందిన జట్టులో కోహ్లీ సభ్యుడు కాగా.. రోహిత్ మాత్రం మిస్ అయ్యాడు. రెండేళ్ల క్రితం అతడి సారథ్యంలో భారత్ ఫైనల్ చేరినా ట్రోఫీని అందుకోలేకపోయింది. ఆస్ట్రేలియా బౌలర్ల విజృంభణతో ఆదిలో తడబడిన రోహిత్ సేన భారీ స్కోర్ చేసినా.. ట్రావిస్ హెడ్ మెరుపు సెంచరీతో ఆసీస్ ఆరోసారి విశ్వ విజేతగా నిలిచింది. సో.. 2027లో వన్డే ప్రపంచ కప్‌తో కెరీర్ ముగించే ఆలోచనతో ఉన్నారిద్దరూ. కానీ.. మరో ఏడాది వరకూ ఫిట్‌గా ఉంటారా? సెలెక్టర్లు వీళ్లకు ఛాన్స్ ఇస్తారా? అనేది తెలియాల్సి ఉంది.



### చిరు-

## బాబీ మరో సినిమా..

# అఫీషియల్ పోస్టర్ రిలీజ్

'భోళా శంకర్' వచ్చి రెండేళ్లు దాటిపోయింది. ఆ సినిమా ఫలితం వల్ల ఆలోచనలో పడిపోయిన చిరంజీవి రూట్ మార్చారు. 'విశ్వంభర' మొదలుపెట్టారు. అయితే ఇది భారీ బడ్జెట్ చిత్రం కావడంతో లేట్ అవుతూ వస్తోంది. మరోవైపు అనిల్ రావిపూడి దర్శకత్వంలోనూ ఓ చిత్రం చేస్తున్నారు. దీనికి 'మన శంకర వరప్రసాద్ గారు' అనే టైటిల్ ఫిక్స్ చేశారు. అలానే శ్రీకాంత్ ఓదెలతోనూ ఓ మూవీ కమిట్ అయ్యారు. ఇప్పుడు మరో ప్రాజెక్ట్ కన్ఫర్మ్ చేశారు. ఈ మేరకు అధికారిక ప్రకటన వచ్చింది. రెండో ఇన్నింగ్స్‌లో చిరు సినిమాలు చేస్తున్నారు గానీ సరైన ఫలితాలు రావట్లేదు. ఈ క్రమంలోనే వచ్చి మంచి కమర్షియల్ హిట్ అయిన సినిమా 'వాల్తేరు వీరయ్య'. ఈ చిత్రానికి బాబీ దర్శకుడు. ఇప్పుడు మరోసారి చిరుని డైరెక్ట్ చేసే ఛాన్స్ బాబీ అందుకున్నాడు. యష్ 'టాక్సిక్', దళపతి విజయ్ 'జననాయగన్' చిత్రాల్ని నిర్మిస్తున్న కెవిఎన్ ప్రొడక్షన్.. చిరు-బాబీ కొత్త చిత్రాన్ని తెరకెక్కిస్తోంది. 'మెగా 158' పేరుని ఈ ప్రాజెక్టుకి వర్కింగ్ టైటిల్‌గా నిర్ణయించారు. నెత్తురు-గొడ్డలిని పోస్టర్‌లో చూపించారు. చూస్తుంటే ఇది యాక్షన్ మూవీలా అనిపిస్తుంది. మరి షూటింగ్ ఎప్పుడు మొదలుపెడతారు. హీరోయిన్, సంగీత దర్శకుడు ఎవరనేది త్వరలో వెల్లడిస్తారేమో?

# విద్యాబాలన్‌పై అలాంటి ముద్ర.. అదెంతవరకు న్యాయం?



"సినిమా అంటే ఒక సెలబ్రేషన్. కమర్షియాలిటీ కూడా. అయితే ఈ తరహా చిత్రాలతో పాటు ఒక్కొక్కసారి మనల్ని ఆలోచింపజేసే 'పరదా'లాంటి చిత్రాలు కూడా రావాలి. 'పరదా' చాలా కొత్త కథ. నిజాయితీగా చెప్పే ప్రయత్నం చేశాం. ప్రేక్షకులు మా సినిమాను ఆదరిస్తారనే నమ్మకం ఉంది. ఫ్యామిలీస్‌తో కలిసి చూడాల్సిన సినిమా ఇది" అని హీరోయిన్ అనుపమ పరమేశ్వరన్ అన్నారు. అనుపమ పరమేశ్వరన్ కథానాయికగా, సంగీత, దర్శన, రాజేంద్రప్రసాద్, రాగ్ మయూర్ ఇతర కీలక పాత్రల్లో నటించిన చిత్రం 'పరదా'. 'ది ఫ్యామిలీ మ్యాన్' సిరీస్ మేకర్స్ రాజ్ అండ్ డీకే సపోర్ట్‌తో 'సినిమా బండి' ఫేమ్ ప్రవీణ్ కాండ్రేగుల దర్శకత్వంలో శ్రీనివాసులు పీవీ, శ్రీధర్ మక్కువతో కలిసి విజయ్ డొంకాడ నిర్మించిన ఈ చిత్రం నేడు (శుక్రవారం) విడుదలవుతోంది. ఈ సందర్భంగా గురువారం విలేకరుల సమావేశంలో అనుపమా పరమేశ్వరన్ చెప్పిన సంగతులు.

### కనెక్ట్ అయ్యా..

'పరదా'లాంటి కథలు తెలుగులోనే కాదు... భారతీయ సినిమాలోనూ చాలా అరుదు. ఈ తరహా ఫ్రెష్ కాన్సెప్ట్‌తో కూడిన కథ నా దగ్గరకు రాలేదు. అందుకే దర్శకుడు ప్రవీణ్ కథ చెప్పినప్పుడు ఎమోషనల్‌గా కనెక్ట్ అయ్యాను. ఒక అమ్మాయి మాత్రమే దాన్ని అర్థం చేసుకోగలదు. 'పరదా' ఒక బోల్డ్ అటెంప్ట్. ఈ సినిమా చూస్తున్నప్పుడు ఎవరైనా ఒక్క సెకండ్ ఆలోచించగలిగినా అది సక్సెస్‌గా భావిస్తాను.



విశ్వం వాయిస్
తెలుగు దినపత్రికలో
వెలువడుతున్న ప్రత్యేక శీర్షికలు...

# 'వార్ 2' చూడలేదు.. 'కూలీ'కి వెళ్దామంటే ఓకే చెప్పాను



నారా రోహిత్ హీరోగా నటించిన 'సుందరకాండ' చిత్రం ఆగస్టు 27న రిలీజ్ కానుంది. ఈ క్రమంలో తన మూవీ ప్రమోషన్స్ కోసం ఆయన పలు ఇంటర్వ్యూలు ఇస్తున్నారు. కూలీ, వార్2 సినిమాలు చూశారా..? ఎలా ఉన్నాయంటూ ఆయన్ను ప్రశ్నించారు. ఈ సందర్భంలో రోహిత్ చేసిన వ్యాఖ్యలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. ఎన్టీఆర్ సినిమా విడుదలైతే తప్పకుండా తన కుటుంబ సభ్యులతో పాటు టీడీపీ అభిమానులు చూస్తారు. అయితే, కొంత కాలంగా తారక్‌ను నందమూరి, నారా ఫ్యామిలీలు దూరంగానే ఉంచుతూ వస్తున్నాయి. వార్ 2 మూవీ విడుదల సమయంలో తారక్‌పై టీడీపీ ఎమ్మెల్యేనే భూతులతో విరుచుకుపడ్డాడు. అయితే, తాజాగా ఒక ఇంటర్వ్యూలో వార్2 సినిమా చూశారా అని 'నారా రోహిత్'ని ప్రశ్నించారు. అందుకు ఆయన ఇలా సమాధానం ఇచ్చారు. 'వార్ 2 సినిమా చూడలేదు. మా గ్యాంగ్ అంతా కూలీ సినిమా చూద్దాం అన్నారు. అప్పుడు నేనూ కూడా 'కూలీ' కోసమే వెళ్లాను. సినిమా అక్కడక్కడ నచ్చింది. ఓవరాల్‌గా పర్వాలేదు. వార్2 చూడలేదు. కానీ, సమయం దొరికితే తప్పకుండా చూస్తాను.' అని అన్నారు. అయితే, ఇక్కడ నారా రోహిత్‌ను నెటిజన్లు తప్పుబడుతున్నారు. మొదట కుటుంబ సభ్యుల సినిమాకు ప్రాధాన్యత ఇవ్వాలి కదా అంటూ ప్రశ్నిస్తున్నారు. తారక్‌తో తనకు మంచి స్నేహం ఉందని నారా రోహిత్ అన్నారు. ఎక్కడైనా తాము ఎదురైతే మంచిగానే మాట్లాడతామన్నారు. కానీ, పెద్దగా ఫోన్స్‌లలో మాట్లాడుకోవడం వంటివి మాత్రం లేవన్నారు.

VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603, viswamvoice@gmail.com